ISSN : 0971-8729

# యోజన

సంపుటి : 46 సంచిక : 9 అభివృద్ధి మాసపత్రిక జూలై, 2018 ₹ 22

## ప్రగతిపథంలో భారతదేశం









పట్టణ ప్రాంతాలలో స్వంత ఇంటి వరం
హర్‌దీప్ ఎస్. పూరి

గ్రామాల నూరు శాతం విద్యుదీకరణ
ఎ.కె. భల్లా

పునర్వినియోగ ఇంధన విస్తరణ కార్యక్రమం - 2022
మనోజ్ కుమార్ ఉపాధ్యాయ్, డాక్టర్ అభినవ్ త్రివేది

ప్రత్యేక వ్యాసం :
యువత భాగస్వామ్యంతో సామాజికాభివృద్ధి
అమరేంద్రకుమార్ దూబే

విశిష్ట వ్యాసం :
రైతు సంక్షేమానికే అధిక ప్రాధాన్యత
డాక్టర్ జగ్‌దీప్ సక్సేనా

# అభివృద్ధి మార్గ సూచి:

## ప్రధాన ఎక్స్‌ప్రెస్ రహదారులను ప్రారంభించిన ప్రధాన మంత్రి




ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతంలో నూతనంగా నిర్మించిన రెండు ఎక్స్‌ప్రెస్ రహదారులను ప్రధాని మే 27, 2018 న ప్రారంభించారు. వీటిలో మొదటిది 14 లైన్ల ఢిల్లీ-మీరట్‌ల రహదారి మొదటి దశ (నిజాముద్దీన్ నుండి ఢిల్లీ-ఉత్తరప్రదేశ్ సరిహద్దు వరకు). 8,360 కి.మీ. ల ఈ జాతీయ రహదారిని కేవలం 18 నెలలలో రూ. 841.5 కోట్ల వ్యయంతో నిర్మించారు. 14 లైన్లతో ఉండే దేశంలోని మొదటి జాతీయ రహదారి ఇది. కాలుష్యాన్ని తగ్గించడం దీని ప్రత్యేకత. దీనిలో 2.5 మీటర్ల వెడల్పు ఉండే సైకిల్ మార్గం కూడా ఉంటుంది. యమునా వంతెనపై ఒక పూల తోట, సౌర దీపాలు దీని ప్రత్యేకతలు. ఈ మార్గం లోని మొక్కలకు బిందు సేద్యం విధానంలో నీటిని అందచేస్తారు. ఢిల్లీ నుండి మీరట్‌కు, అక్కడి నుండి ఉత్తరాఖండ్‌కు సత్వర మార్గాన్ని దీని ద్వారా అందచేస్తారు. ఈ రహదారి మొత్తం పొడుగు 82 కిలోమీటర్లు. మొత్తం అంచనా వ్యయం రూ. 4,975.17 కోట్లు. ఢిల్లీ నుండి దస్నా వరకు మొత్తం 28 కిలోమీటర్ల దూరానికి సైకిల్ మార్గాన్ని కేటాయించిన మొదటి జాతీయ రహదారి ఇది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఢిల్లీ నుండి మీరట్ కు కేవలం ఒక గంటలో వెళ్లవచ్చు.

జాతికి అంకితమిచ్చే రెండవ ప్రాజెక్టు 135 కిలోమీటర్ల Eastern Peripheral Expressway, EPE. ఇది ఒకటవ జాతీయ రహదారిపైనున్న కుండ్లీ నుండి రెండవ జాతీయ రహదారిపైనున్న పల్వల్ వరకు ఉంటుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ. 4617.87 కోట్లు. ముందుగా ఆ ప్రాజెక్టు నిర్మాణానికి 910 రోజులు పడుతుందని అంచనా వేయగా, కేవలం 500 రోజుల్లో రికార్డు పనితనంతో పూర్తిచేశారు. మొత్తం 135 కిలోమీటర్ల పొడవునా కేవలం సౌర విద్యుత్‌నే వాడుతున్న దేశంలోని మొదటి ప్రాజెక్టు ఇది. ప్రతి 500 కిలోమీటర్లకూ ఒక వాననీటిని ఒడిసిపట్టి వినియోగించుకునే ఏర్పాటు చేశారు. దారి పొడుగునా ఉన్న మొక్కలకు Drip Irrigation, బిందు సేద్యం పద్ధతిలో నీటి వనరులను అందచేస్తున్నారు. ఢిల్లీ చుట్టుపక్కల ప్రాంతాలను కలిపే ప్రాజెక్టు అంటే తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కలిపే ప్రాజెక్టు మహానగరంలోని జనాభా ఒత్తిడిని తగ్గించి, ఢిల్లీకి కాకుండా, ఢిల్లీ మీదుగా పోయే రవాణాను దారి మళ్ళించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం.

■

ISSN : 0971-8729

మమ్మల్ని కలవండి: https://www.facebook.com/pages/Yojana-journal

e-mail : yojanatelugu@gmail.com e-mail : yojana.telugu@nic.in

జూలై, 2018 సంపుటి : 46 సంచిక : 9

# యోజన

1973 నుండి

ఆనోభద్రా క్రతవోయన్తు విశ్వతః
(ఉత్తమ భావాలు అన్నివైపుల నుండి రావాలి)

ముఖ్య సంపాదకులు : **దీపికా కచ్చల్**
సీనియర్ సంపాదకుడు : **విజయకుమార్ వేదగిరి**
సంపాదకుడు : **మహమ్మద్ సిరాజుద్దీన్**

దేశం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలపై విస్తృత చర్చకు యోజన ఒక వేదిక. దీనికోసం ప్రభుత్వ విధానాలపై పరిశీలనకు వ్యాసాల రూపంలో వెసులుబాటు కల్పిస్తోంది. యోజన కేవలం ప్రభుత్వ వాణిని వినిపించే బాకా కాదు. ఈ మాస పత్రిక అస్సామీ, బెంగాలీ, ఇంగ్లీష్, గుజరాతీ, హిందీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళ్, తెలుగు మరియు ఉర్దూ భాషలలో ప్రచురించబడుతున్నది.

ఛీఫ్ ఎడిటర్ కార్యాలయం: రూం నెంబర్-660 సూచనాభవన్; సి.జి.ఓ. కాంప్లెక్స్; లోధీ రోడ్; న్యూ ఢిల్లీ-110 003. ఫోన్: 011-24362971.
ఈ-మైల్: yojanace@gmail.com:
వెబ్ సైట్: www.yojana.gov.in;
www.publicationsdivision.nic.in
యోజన ఇంగ్లీష్; రూం నెంబర్ 647; సూచన భవన్; సి.జి.ఒ. కాంప్లెక్స్; లోధీ రోడ్; న్యూ ఢిల్లీ-110 003.
సంయుక్త సంచాలకుడు (ప్రొడక్షన్) : **వి.కె. మీనా**

మా ప్రతినిధులు: ఆహ్మదాబాద్: శ్రీమతి అమిత మారు; బెంగుళూరు: కుమారి ఎస్. పునీత; చెన్నై: ఏ. ఇలంగోవన్; గువహటి: ఆనుపమ దాస్; హైదరాబాద్: విజయకుమార్ వేదగిరి; కొల్ కత్తా: శ్రీమతి రమా మండల్; ముంబై: ఉమేష్ సదాశివరావు ఉజ్గరె; తిరువనంతపురం: శ్రీమతి కె. ధన్య సన్యాల్; జలంధర్: శ్రీమతి గగన్ దీప్ కౌర్ దేవగన్; భుబనేశ్వర్ గిరీష్ చంద్ర దాస్.

**సూచన:** ఈ పత్రికలోని వివిధ వ్యాసాలలో వెలువరించిన అభిప్రాయాలు ఆయా వ్యాస కర్తలవే గానీ, ప్రభుత్వానివి కావు.
వ్యాసాలలో ఉపయోగించిన ఏ దేశానికి చెందినవైనా జెండాలు, మ్యాపులు కేవలం సూచనప్రాయమేగానీ, అధికార మ్యాపులను ప్రతిఫలించవు. చట్టపరమైన సూచికలు కూడ కావు.
ఈ పత్రికలో వచ్చే ప్రకటనలలోని నిజనిజాలను పాఠకులు ముందుగా నిర్ధారించుకోవలసిందిగా మనవి. వీటిలోని ఏ అంశానికీ యోజన బాధ్యత వహించదు.

**చందా:**
యోజన మాసపత్రిక ఏ భాషదైనా సంవత్సర చందా రూ. 230/- రెండు సంవత్సరాలకు రూ. 430/- మరియు మూడు సంవత్సరాలకు రూ 610/- విదేశాలకైతే ఇవే చందారేట్లతో పాటు, ఇండియా పోస్టు వారు నిర్ణయించిన ఎయిర్ మెయిల్ ఛార్జీలను చెల్లిస్తే చాలు.
**నూతన చందాలు, నవీకరణలు, ఫిర్యాదులకు సంప్రదించండి : యోజన (తెలుగు), రూం.నం. 205, సి.జి.ఒ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ - 80.**
ఫోన్ **040-27546313; 011-24367453** లేదా
**ఈ-మెయిల్: yojanatelugu@gmail.com; www.pdjucir@gmail.com**

## ఈ సంచికలో...

1. పట్టణ ప్రాంతాలలో స్వంత ఇంటి వరం
   - *హర్‌దీప్ ఎస్. పూరి............5*
2. గ్రామాల నూరు శాతం విద్యుదీకరణ
   - *ఎ.కె. భల్లా.....................9*
3. పునర్వినియోగ ఇంధన విస్తరణ కార్యక్రమం - 2022
   - *మనోజ్ కుమార్ ఉపాధ్యాయ్*
   - *డాక్టర్ అభినవ్ త్రివేది......13*
4. యువత భాగస్వామ్యంతో సామాజికాభివృద్ధి
   - *అమరేంద్రకుమార్ దూబే...16*
5. రైతు సంక్షేమానికే అధిక ప్రాధాన్యత
   - *డాక్టర్ జగ్‌దీప్ సక్సేనా........22*
6. కేంద్ర రైతు సంక్షేమ పథకాలు
   - *ఏ. అమరయ్య ...............26*
7. విజ్ఞాన విపంచి
   - *ప్రాతూరి పోతయ్య శర్మ......28*
8. విమానయాన రంగంలో ఉడాన్ ప్రయోగం
   - *సింధు భట్టాచార్య.............31*
9. అందరికీ అందుబాటులో గృహాలు
   - *డాక్టర్ రంజిత్ మెహతా.......34*
10. పరారీ ఆర్థిక నేరస్తుల బిల్లు - 2018
   - *డాక్టర్ సి.ఎం.ఏ. వి. మురళి........38*
11. తెలంగానం.........................41
12. జాతిసిగలో కోహినూర్ - శ్రీహరికోట రాకెట్ కేంద్రం - *డా॥ అయినాపురపు రామలింగేశ్వరరావు....................42*
13. జనహో భారత్
   - *టంగుటూరి శ్రీరామ్..........45*
14. డిజిటల్ భారతం
   - *ఎం. ఎస్. లక్ష్మి.............49*
15. మనసులోని మాట.................53

**పేజీల సంఖ్య 56**

**Sales Emporia:** New Delhi: Soochna Bhawan, CGO Complex, Lodhi Road; New Delhi-110003 (Phone No: 011-24365610). Delhi: Hall No. 196; Old Secretariat; Delhi-110 054(Phone: 01123890205). Navi Mumbai: 701, B Wing, 07th Floor, Kendriya Sadan, Belapur-400 614 (Phone: 022-27570686). Kolkatta: 8, Esplanade East-700 069 (Phone:033-22486696). Chennai: 'A' Wing, Rajaji Bhawan, Basant Nagar-600 090 (Phone: 04424917673). Thiruvananthapuram: Press Road; Near Govt. Press-695 001 (Phone:0471-2330650). **Hyderabad: Room No. 204, Second Floor, CGO Towers, Kavadiguda-500 080 (Phone: 040-27535383).** Bengaluru: First Floor, 'F' Wing, Kendriya Sadan, Koramangala-560 034 (Phone:080-25537244). Patna: Bihar State Co-operative Building, Asoka Rajpath-800 004 (Phone:0612-2675823). Lucknow: Hall No.1, Second Floor, Kendriya Bhawan, Sector-H, Aligunj-226 024 (Phone: 0522-2325455). Ahmadabad: Ambica Complex, First Floor, Above UCO Bank, Paldi-380 007 (Phone: 079-26588669). Guwahati: House No. 4, Pension Para Road-781 003 (Phone:030-2665090).


ISSN : 0971-8729

# యోజన

చీఫ్ ఎడిటర్స్ డెస్క్

## సంపాదకీయం

### ప్రగతి పథం




అభివృద్ధి అంటే ఒక్కొక్కరికీ ఒక్కొక్క అర్థం. కొందరికి అది కేవలం తిండి, బట్ట, గూడు మాత్రమే! మరి కొందరికి ఇంకా ఎక్కువ కావచ్చు. తిండి అంటే, ఆహార భద్రత కావచ్చు. గుడ్డ అంటే, మిమ్మల్ని మీరు సమాజంలో ప్రకటించుకునే విధానం కావచ్చు. గూడు అంటే, తలదాచుకునే ఇల్లే కాదు, విశాలమైన తాలింఖానా వంటి సౌకర్యాలతో కూడిన నివాసం అవచ్చు. అయితే, రోటి అనగానే మనకు ఆహార భద్రత అనిపించవచ్చు కానీ, మనందరికీ ఈ ఆహారాన్ని అందచేస్తున్న రైతు గురించి ఎంతమందిమి ఆలోచిస్తున్నాము? అందరికీ ఆహారాన్ని అందచేయడంలో ఆ రైతే ప్రధాన పాత్రధారి. అయితే అతను ఆహారాన్ని అందిస్తున్న ప్రజలు కానీ, వారిని పాలిస్తున్న ప్రభుత్వం కానీ వారి గురించి ఆలోచించటంలేదు.

ఈ అంశాన్ని గమనించి, కేంద్ర ప్రభుత్వం రైతులకోసం, వారికి సమాజంలో న్యాయపరమైన స్థానాన్ని కట్టబెట్టేందుకు అనేక సంక్షేమ చర్యలను చేపట్టింది. 2020 నాటికి వారి వార్షిక ఆదాయాన్ని రెట్టింపు చేయడం వీటన్నింటిలో ప్రధానమైనది. అదే విధంగా, భూసార పరీక్ష కార్డులు (Soil Health Card), ప్రకృతి వైపరీత్యాలనుండి రక్షణకు ప్రధానమంత్రి పంటల బీమా పథకం (Prime Minister Fasal Bima Scheme), మార్కెట్ మద్దతుతో పాటు, అదనపు ఆదాయాన్ని ఆర్జించిపెట్టే ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజన, తాను పండించిన పంటకు తగిన ధరను అందించే ఈ–ఎన్ఏఎం అంటే డిజిటల్ మార్కెటింగ్ సౌకర్యాలు వంటి ఎన్నో కార్యక్రమాలను ప్రారంభించారు.

గూడు విషయానికి వస్తే, అందరికీ అందుబాటులో ఇల్లు అన్నమాట. మామూలుగా ఇంటిని కట్టు కోవడమంటే ఎంతో వ్యయ ప్రయాసలతో కూడినది. చాలా మందికి ఆర్థికంగా అందుబాటులో ఉండదు కానీ, ప్రభుత్వ సహాయంతో ఎంతోమంది పేదలకుకూడా ఒక గూడు ఏర్పరుచుకునే అవకాశం కలిగింది. అందుకోసమే 2022 నాటికి అందరికీ ఇల్లు అనే లక్ష్యంతో కార్యక్రమం ప్రారంభించింది. ప్రతి కుటుంబానికీ నీటి సరఫరా, గౌరవ గృహం (మరుగుదొడ్డి), నిరంతర విద్యుత్ సరఫరా వంటి సౌకర్యాలతో పక్కా ఇళ్లను ఏర్పాటు చేయడం ఈ కార్యక్రమ లక్ష్యం. ఒక చోటు నుండి మరో చోటుకు సులభంగా వెళ్లగలగటం కోసం సౌకర్యవంతమైన రవాణా సౌలభ్యం తరువాతది. మనుషుల, సరుకు రవాణా సులభంగా జరగాలి. జాతీయ రాజమార్గాల, రహదారుల కేంద్ర మంత్రిత్వ శాఖ మార్చ్ 2019 నాటికి పూర్తయ్యేలాగున 300 పథకాలను గుర్తించింది. జూన్ 2019 నాటికి జాతీయ రాజమార్గాల ప్రాధికరణ సంస్థ ద్వారా 127 పథకాలు, మంత్రిత్వ శాఖ ద్వారా 153 పథకాలను మార్చి 2019 నాటికే పూర్తిచేయనున్నారు. అంతేకాదు, డిసెంబర్ 2018 నాటికి మరో 100 ప్రాజెక్టులు పూర్తికానున్నాయి. జాతీయ రాజమార్గాల ప్రాధికారణ సంస్థ కు లక్ష్యంగా నిర్ణయించిన 5058 కిలోమీటర్ల మార్గాలను 6000 కిలోమీటర్లుగా పెంచారు. చిన్న నగరాలు, పట్టణాలను కలుపుతూ సత్వర రవాణాకు సృజనాత్మకంగా UDAAN పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. UDAAN అంటే, ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్, అంటే దేశంలోని సాధారణ పౌరుడు విమాన ప్రయాణం చేసే అవకాశం అని.

2015 వ సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రధానమంత్రి ఎర్రకోట బురుజుల నుండి మాట్లాడుతూ రానున్న 1000 రోజుల్లో దేశం లోని అన్నీ గ్రామాలకూ విద్యుత్ సౌకర్యం అందిస్తామని వాగ్దానం చేశారు. ఇంతటి బృహత్తర లక్ష్య సాధనకు దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి యోజన పథకాన్ని ప్రకటించిన 1000 రోజుల్లోనే మొత్తం 18 వేల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. దేశ ప్రగతికి యువ శక్తిని సక్రమంగా వినియోగించుకోవడం ఎంతో అవసరం. మన దేశంలో లభ్యమవుతున్న యువశక్తి ప్రయోజనాన్ని గరిష్టంగా వినియోగించుకుంటున్నది. నెహ్రూ యువ కేంద్ర, జాతీయ సేవా పథకం వంటి మార్గాలలో యువ శక్తిని జాతి ప్రయోజనాలకు వినియోగించుకోవడానికి ఉద్యుక్తమైంది. అందుకోసం స్కిల్ ఇండియా, స్టార్ట్ అప్ ఇండియా, జాతీయ యువ నేతల కార్యక్రమం, ముద్రా యోజన వంటి ఎన్నో కార్యక్రమాలను ప్రారంభించింది. ఒక దేశం అభివృద్ధి కార్యక్రమంలో అనేక అంశాలుంటాయి. ఇలాంటి ప్రతి అంశమూ కూడా ఎంతో ప్రాముఖ్యం కలిగి ఉంటుంది. ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటుంది. సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం ఇటీవల చేపట్టిన అనేక చర్యలు ఈ లక్ష్య సాధనకు పునాది అయ్యాయి. ■

# పట్టణ ప్రాంతాలలో స్వంత ఇంటి వరం

– హర్‌దీప్ ఎస్. పూరి

ప్రధానమంత్రి
ఆవాస్ యోజన
(పట్టణ)

**పట్టణ గృహ నిర్మాణం అంటే కేవలం 4 గోడలు, ఇటుకలు, సిమెంటుతో నిర్మాణం మాత్రమే కాదు. నివాసితులకు సకల సౌకర్యాలు కల్పించాలి. కనుకనే, కేంద్రం కేవలం ఇళ్ల నిర్మాణానికి కాకుండా, నివాస గృహాల ఏర్పాటుకు కృషి చేస్తున్నది. పి.ఎమ్.ఎ.వై. (యు) పథకం ద్వారా నివాస గృహం పొందే వారందరూ సకల సౌకర్యాలతో కూడిన స్వంత ఇంటిని కలిగి ఉంటూ, ఎటువంటి అసౌకర్యానికిలోను కాకుండా గౌరవప్రదమైన, రక్షణతో కూడిన జీవితాన్ని గడుపుతారు.**

ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ పదవీ బాధ్యతలు చేపట్టిన నెల రోజుల తరువాత జూలై, 2014లో పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రసంగిస్తూ "భారత ప్రజలు 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించుకునే సమయానికి, ప్రతి కుటుంబానికి ఒక స్వంత, పక్కా ఇల్లు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమనీ, ప్రతి ఇంటికీ మంచినీటి సరఫరా, మరుగుదొడ్లు, వారమంతా ప్రతిదినం 24 గంటల విద్యుత్ సరఫరా, ఇతర ప్రాంతాలతో అనుసంధానానికి మెరుగైన రవాణా సౌకర్యాలు కూడా కల్పిస్తామని" ప్రకటించారు. ఈ లక్ష్యాల సాధనకుగాను "ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పి.ఎమ్.ఎ.వై.)" అందుబాటు ధరలో అందరికీ స్వంత ఇల్లు పథకాన్ని ప్రధాని ప్రారంభించారు. ఈ పథకాన్ని రెండు భాగాలుగా విభజించారు. ఒకటి గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పి.ఎమ్.ఎ.వై. (గ్రామీణ) రెండవది హౌసింగ్ మరియు అర్బన్ కార్యక్రమాల (ఎమ్.హెచ్.యు.ఎ.) మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పి.ఎమ్.ఎ.వై. (అర్బన్).

2022 సంవత్సరం నాటికి ప్రతి పట్టణంలోను అందుబాటు ధరలలో, మొత్తం సుమారు కోటి 20 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పి.ఎమ్.ఎ.వై. (అర్బన్) పథకాన్ని జూన్, 2015లో ప్రారంభించారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాలలో హౌసింగ్ మరియు అర్బన్ కార్యక్రమాల మంత్రిత్వ శాఖ ద్వారా 47.5 లక్షల చౌక ధరల ఇళ్ల నిర్మాణాన్ని మంజూరు చేయడంతోపాటు, 8 లక్షలకు పైబడి ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసింది. గత యు.పి.ఎ. ప్రభుత్వ హయాంలో జరిగిన ఇళ్ల నిర్మాణ కార్యక్రమాలతో పోల్చి చూస్తే, 2004-2014 సంవత్సరాల మధ్య కాలంలో కేవలం 13.46 లక్షల ఇళ్లు మంజూరు కాగా, కేవలం 5.65 లక్షల ఇళ్లు నిర్మించి లబ్దిదారులకు అందించారు. గతాన్ని గుర్తు చేసుకుంటే, జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ పథకం (జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎమ్.) క్రింద చేపట్టిన ఈ పక్కా ఇళ్ల నిర్మాణాన్ని అతి పెద్ద పట్టణాభివృద్ధి కార్యక్రమంగా ప్రచారం చేశారు. కాని కేవలం 4 సంవత్సరాలలోనే ప్రధాన మోదీ నేతృత్వంలోని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అంతకంటే నాలుగు రెట్లు అధికంగా ఇళ్ల నిర్మాణం మంజూరు చేసి, నిర్మిస్తున్నది.

**పట్టణీకరణకుగల ప్రాధాన్యత గుర్తింపు :**

పి.ఎమ్.ఎ.వై. (అర్బన్) కార్యక్రమానికి గల ప్రాధాన్యతను, విజయాలను గుర్తించాలంటే

కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ రాజ్య మంత్రి, న్యూఢిల్లీ.
E-mail : minister-mohua@nic.in

ముందుగా పట్టణీకరణకు ప్రస్తుతం నెలకొన్న ప్రాధాన్యతను నిశితంగా గమనించాలి. స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత అనేక సంవత్సరాలపాటు మన దేశాన్ని ప్రధానంగా వ్యవసాయాధారిత దేశంగా మాత్రమే గుర్తిస్తూ, పట్టణ అభివృద్ధి కార్యక్రమాలను అంతగా పట్టించుకోలేదు. ఉపాధి కల్పించడంలోను, ఆదాయాన్ని సమకూర్చడంలోను వ్యవసాయానికే అగ్రతాంబూలం లభించింది. సర్వీసుల రంగాన్ని ఎవరూ పట్టించుకోలేదు. కాని ప్రస్తుతం వ్యవసాయం మన దేశంలోని 40 శాతానికి పైబడిన పౌరులకు ఉపాధిని కల్పిస్తున్నా, ఖజానాకు లభిస్తున్న ఆదాయం, మొత్తం ఆదాయంలో 16.4 శాతానికి పడిపోయింది. కాని పట్టణ ప్రాంతాలలోని సర్వీసుల రంగం ద్వారా 55.2 శాతం ఆదాయం లభిస్తున్నది. ఈ వ్యత్యాసంలోని పెరుగుదలను గుర్తించిన మోదీ ప్రభుత్వం పట్టణీకరణకు ప్రాధాన్యతను ఇస్తున్నది. సర్వీసు రంగంలో ఉపాధిని పొందుతున్న ప్రజలందరూ పట్టణ నివాసానికే అధిక సంఖ్యలో సంసిద్ధతను వ్యక్తం చేస్తున్నారు. కనుక పట్టణ ప్రాంత గృహ నిర్మాణానికి కూడా ప్రాధాన్యత పెరిగింది. మొదటిసారిగా ఈ విషయాన్ని గమనించిన మోదీ ప్రభుత్వం, 2030 నాటికి భారత జనాభాలో 40 శాతం మేరకు, అనగా 60 కోట్ల మందికి పట్టణాలలో నివాసాలు అవసరమవుతాయని మోదీ ప్రభుత్వం పెద్ద ఎత్తున పట్టణ ప్రాంత గృహనిర్మాణ కార్యక్రమం చేపట్టింది.

2015లో ఐక్యరాజ్య సమితి ఒక కార్యక్రమం ద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (ఎస్.డి.జి.లు), 2030 సంవత్సరానికి సంబంధించి ఒక అభివృద్ధి అజెండాను లాంఛనంగా ప్రారంభించింది. కాని అంతకు ముందే మోదీ ప్రభుత్వం ఎస్.డి.జి.లోని 11వ లక్ష్యానికి అనుగుణంగా “పట్టణాలు, మరియు పట్టణ ప్రాంత జనావాసాలకు ఇన్క్లూసివ్, సేఫ్, మన్నిక గలిగిన, సుస్థిర” సదుపాయాలు సమకూర్చే ఒక సమగ్ర కార్యక్రమాన్ని తమ అభివృద్ధి కార్యక్రమాలు, లక్ష్యాలలో చేర్చింది.

దీనికి అనుగుణంగానే జూన్, 2015లో కేంద్ర ప్రభుత్వం పి.ఎమ్.ఎ.వై. (యు)ను ప్రారంభించింది. ఈ విధమైన ప్రత్యేక పథకాన్ని చేపట్టనున్నట్లు 2014, జూలైలోనే ప్రకటించింది. అంతే కాకుండా ఎస్.డి.జి.లను పూర్తి చేయడానికి ఐక్యరాజ్య సమితి నిర్ణయించిన గడువు 2030 కాగా, మోదీ ప్రభుత్వం ఈ లక్ష్యాలను 2022లోనే పూర్తి చేసే విధంగా కార్యక్రమాలను ముందుకు పరుగెత్తిస్తున్నది. 75వ స్వాతంత్ర్య దినోత్సవం నాటికి ప్రతి భారతీయునికి స్వంత ఇంటి కలను సాకారం చేయబోతున్నది.



పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో లభించే ఉపాధి సదుపాయాల విషయంలో, భారతీయులలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా పట్టణీకరణ కార్యక్రమాల అంశంలో కూడా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పట్టణ గృహ నిర్మాణం అంటే కేవలం 4 గోడలు, ఇటుకలు, సిమెంటుతో నిర్మాణం మాత్రమే కాదు. నివాసితులకు సకల సౌకర్యాలు కల్పించాలి. కనుకనే, కేంద్రం కేవలం ఇళ్ల నిర్మాణానికి కాకుండా, నివాస గృహాల ఏర్పాటుకు కృషి చేస్తున్నది. నివాసం అంటే మరుగుదొడ్లు, కరెంటు, నీటి సరఫరా, మంచినీటి పైపులు, చెత్త తరలింపునకు తగిన ఏర్పాట్లు, రోడ్డు రవాణా సౌకర్యాలు కలిగిన ఇళ్లు. అంతే కాకుండా ఈ గృహాలను ఆయా గృహ యజమానురాలు, లేదా భార్యాభర్తలిద్దరికీ కలిపి రిజిస్టర్ చేస్తారు. పి.ఎమ్.ఎ.వై. (యు) పథకం ద్వారా నివాస గృహం పొందే వారందరూ సకల సౌకర్యాలతో కూడిన స్వంత ఇంటిని కలిగి ఉంటూ, ఎటువంటి అసౌకర్యానికిలోను కాకుండా గౌరవప్రదమైన, రక్షణతో కూడిన జీవితాన్ని గడుపుతారు.

**పథకం అమలులో రాష్ట్రాల భాగస్వామ్యం:**

భారత దేశానికి అభివృద్ధి ఆకాంక్షలకు, ఆశయాలకు, ఆలోచనలకు లోటు లేదు. భారతదేశ పట్టణ ప్రాంత అభివృద్ధికిగాను, మన మేధావులు ఎన్నో ప్రణాళికలను రచించడంతో పాటు, సలహాలు సూచనలు కూడా అందించారు. సమస్యలకు పరిష్కారాలను కనుగొన్నారు. కానీ, ఇవన్నీ ప్రారంభ స్థాయిలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం ప్రధాని మోదీ అంకిత భావంతో చేపట్టిన పి.ఎమ్.ఎ.వై.(యు) పథకం మాత్రం విజయవంతంగా దూసుకొనిపోతున్నది. కానీ, కేవలం ప్రణాళికలు రచించడంతో సరిపోదు. దానిని అమలుపరచడానికి సమిష్టిగా కృషి చేయవలసి ఉంటుంది. పర్యవేక్షణను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించవలసి ఉంటుంది.




**పి.ఎమ్.ఎ.వై.(యు) కార్యక్రమాన్ని నాలుగు రకాలుగా విభజించారు. అవి 1) మురికివాడల సమగ్ర అభివృద్ధి 2) ఎఫోర్డబుల్ హౌసింగ్ ఇన్ పార్ట్‌నర్‌షిప్ (ఎ.హెచ్.పి.) 3) క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ స్కీమ్ (సి.ఎల్.ఎస్.ఎస్.) మరియు 4) బెనిఫిషియరీ లెడ్ కన్‌స్ట్రక్షన్ (బి.ఎల్.సి.). ఈ నాలుగు విభాగాల ద్వారా ఈ పథకం నాలుగు విధాల లక్ష్యాలను నెరవేరుస్తుంది. అవి 1) అత్యంత అమానవీయ పరిస్థితులలో జీవిస్తున్న మురికివాడల నివాసితులకు మంచి వాతావరణంలో ఆవాసాలు. 2) అందుబాటు వడ్డీ రేట్లతో బ్యాంకుల నుండి గృహ నిర్మాణ రుణాలను పొందాలనుకుంటున్న అల్పాదాయ మరియు మధ్యతరగతి పౌరులకు రుణాల మంజూరు. 3) చిన్నపాటి స్వంత స్థలంలో స్వంతంగా ఇల్లు నిర్మించుకొనేవారికి ఆర్థిక సహాయం.**

**4) రుణాలతో ఇల్లు నిర్మించుకొనేవారికి ఆర్థిక చేయూత. ఈ పథకాల ద్వారా అందరికీ అందుబాటు ధరలో స్వంత ఇళ్లు పథకాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు.**

గతంలో గృహనిర్మాణ పథకాలలో లబ్ధిదారులకు ఎదురయిన వివిధ సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఆ పథకాలను సమూలంగా సంస్కరించి పి.ఎమ్.ఎ.వై.(యు) పథకం రూపొందించి అమలు చేస్తున్నారు. అన్ని వర్గాల వారికి అనుకూలమైన ఈ పథకాల నుండి, లబ్ధిదారులు తమకు అనువైన పథకాన్ని ఎంపిక చేసుకోవచ్చును. ఎంపిక చేసుకొనే స్వేచ్ఛ లబ్ధిదారులకే ఉంటుంది.

2014 సాధారణ ఎన్నికల అనంతరం లోక్‌సభలో తొలిసారిగా ప్రసంగిస్తూ ప్రధాని మోదీ ''సహకారాత్మక ఫెడరలిజమ్'' ఆవశ్యకతను నొక్కి చెప్పారు. గతంలో ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా విధులను నిర్వర్తించిన తమకు న్యూఢిల్లీ నుండి మొత్తం దేశాన్ని పరిపాలించే సమయంలో సంక్రమించే పరిమిత అవకాశాల గురించి పూర్తి అవగాహన ఉందని అన్నారు. ఒక పెద్ద రాష్ట్రమైన గుజరాత్ పాలనా బాధ్యతల నిర్వహణ సమయంలో అనేక అంశాలను గమనించామని కేంద్ర ప్రభుత్వం రూపొందించి, దేశవ్యాప్తంగా అమలు చేసే వివిధ అభివృద్ధి పథకాల విషయంలో వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలతో చర్చలు, సంప్రదింపులు లేని కారణంగా అవి దారి తప్పాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం చేపడుతున్న పి.ఎమ్.ఎ.వై. (యు) పథకం అనేక గృహనిర్మాణ పథకాలకు చుక్కానిలాంటిదని, దీనిని రూపొందించే సమయంలో సహకారాత్మక ఫెడరలిజమ్ స్ఫూర్తితో, గతంలో అమలులో ఉన్న అన్ని పథకాలను దృష్టిలో ఉంచుకొన్నామని వివరించారు. గతంలో వివిధ రాష్ట్రాలు తాము స్వంతంగా ప్రారంభించే ప్రతి గృహనిర్మాణ పథకానికి కేంద్రం నుండి అనుమతి పొందవలసి వచ్చేదని, ప్రస్తుతం పి.ఎమ్.ఎ.వై. (యు) పథకానికి రాష్ట్ర ప్రభుత్వాలే తమ సమ్మతిని తెలుపవలసి ఉంటుందని, ఏదైనా చిన్న చిన్న మార్పులు, చేర్పులు సూచించే అవకాశం ఉందని, ఈ మార్పులన్నింటినీ కేంద్ర స్థాయిలో సవరిస్తామని తెలిపారు.

గృహనిర్మాణ కార్యక్రమాలకు గత బడ్జెట్‌లలో కేటాయింపులకు విరుద్ధంగా 2017–18 సంవత్సర కేంద్ర బడ్జెట్‌లో నూతన గృహనిర్మాణ విధానాన్ని అవలంబిస్తూ, కేంద్రం ప్రధాన పాత్ర నిర్వహించాలని సంకల్పించింది. అందుబాటు ధరలలో స్వంత ఇళ్ల నిర్మాణం అంశాన్ని మౌలిక సదుపాయాల జాబితాలో చేర్చింది. ఆ తరువాత 2018–19 బడ్జెట్‌లో నేషనల్ హౌసింగ్ బ్యాంక్ పరిధిలో అఫోర్డబుల్ హౌసింగ్ ఫండ్‌ను ఏర్పాటు చేసింది. దీని ద్వారా గృహ నిర్మాణాలకు రుణాలు లభిస్తాయి. ఈ పథకంలో పాల్గొనే ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహించడానికి గాను "అఫోర్డబుల్ హౌసింగ్ ప్రాజెక్ట్"ల లాభాలపై వంద శాతం పన్ను మినహాయింపును, ఇన్‌కమ్‌టాక్స్‌లోని సెక్షన్ 80–ఐ.బి.ఎ. క్రింద ప్రస్తుతం అనుమతించారు.

పి.ఎమ్.ఎ.వై. (యు) వంటి అతి పెద్ద కేంద్ర పథకాలకు పూర్తి స్థాయి పర్యవేక్షణ, నియంత్రణ కావలసి ఉంటుంది. లేని పక్షంలో అమలు తీరు దారి తప్పుతుంది. ప్రత్యేకించి ఈ పథకాన్ని స్థూలంగా రియల్ ఎస్టేట్ రంగంగా పేర్కొనడం వలన మరిన్ని అదనపు జాగ్రత్తలు చేపట్టవలసి ఉంటుంది.

మన దేశంలోని రియల్ ఎస్టేట్ రంగానికి అనాదిగా ఒక చెడు సంప్రదాయాన్ని అలవాటు చేశారు. నీతిగా, నిజాయితీగా ఉండే బిల్డర్‌లను అణగద్రొక్కుతూ, అవినీతి, అక్రమాలు, రౌడీయిజంతో కూడిన కార్యక్రమాలు నిర్వహించే వారికి అదుపు లేకుండా పోతున్నది. ఈ రంగంలో రాజకీయ నాయకులు, అధికారులు, బిల్డర్లు ఒక గ్రూప్‌గా వ్యవహరిస్తూ ఇష్టారాజ్యం చెలాయిస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో నిర్మాణమవుతున్న నివాసాలను కొనుగోలు చేయాలనుకొనే వ్యక్తులెవరైనా సరే, వీరి స్వంత నియమ, నిబంధనలకు లోబడి ఇల్లు కొనుక్కోవాలి. ప్రభుత్వ చట్టాలు ఏవీ వీరికి వర్తించవు. కొనుగోలుదారులను కూడా అవినీతి ఊబిలోనికి దించుతున్నారు. ఇంత చేసినా ఇల్లు కొనుక్కొన్న వ్యక్తి, నిజాయితీగా సొమ్ము చెల్లించినా, అతనికి సకాలంలో, సక్రమంగా తన స్వంత ఆస్తిని దఖలుపరుస్తారన్న నమ్మకం లేదు. ఈ మురికి సంప్రదాయానికి స్వస్తి పలకడానికిగాను, కేంద్ర ప్రభుత్వం ది రియల్ ఎస్టేట్ (రెగ్యులేషన్ అండ్ డీ రెగ్యులేషన్) చట్టం 2016ను అమలులోనికి తెచ్చింది. రెరా (ఆర్.ఇ.ఆర్.ఎ.)గా పిలిచే ఈ చట్టాన్ని 70 సంవత్సరాల స్వతంత్ర భారతావనిలో మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టిన తరువాత, రియల్ ఎస్టేట్ రంగంలో అక్రమాలు, అన్యాయాలు తగ్గుతున్నాయి. పార్లమెంట్ ప్రవేశపెట్టిన ఈ చట్టం ద్వారా స్వంత ఇంటి కొనుగోలుదారుడు, జీవితమంతా ధారబోసి సంపాదించుకొన్న సొమ్ముకు న్యాయం జరుగుతుంది. దేశంలోనే అతి పెద్దదైన నిర్మాణ రంగం ద్వారా స్వంత ఇంటి కలను నెరవేర్చుకోవాలనుకొనే ప్రజలందరికీ, అవినీతి నుండి రక్షణ లభిస్తున్నది. ఈ చట్టంతో పాటు ప్రవేశపెట్టిన "ది ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్ రప్టసీ కోడ్'' వలన బ్యాంకు రుణాలను ఉద్దేశపూర్వకంగా ఎగవేసే అక్రమార్కులకు అడ్డుకట్టపడుతుంది. అంతే కాకుండా రియల్ ఎస్టేట్ రంగంలో అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తులను ఏరివేసే వీలు కలుగుతుంది. నిజాయితీపరులకు రక్షణ లభిస్తుంది.

**ముగింపు :**

అంచనాల మేరకు 2030 నాటికి భారతదేశం నలుమూలలా నెలకొనే నివాస గృహాలు, వాణిజ్య కేంద్రాల డిమాండ్‌ను తీర్చాలంటే, ప్రతి సంవత్సరం 70 నుండి 90 కోట్ల చదరపు మీటర్ల నిర్మాణాలను పట్టణ ప్రాంతాలలో చేపట్టాలి. కనుక ఇప్పటి నుండి 2030 వరకు ప్రతి సంవత్సరం చికాగో నగరమంత విస్తీర్ణంగల భవనాలు, ఇళ్లను భారత్‌లో నిర్మించవలసి ఉంటుంది.

ఈ నేపథ్యంలో, పి.ఎమ్.ఎ.వై. (యు) పథకం విజయవంతంగా పూర్తవ్వాలంటే,

దేశవ్యాప్తంగా పట్టణీకరణ కార్యక్రమాలు ఒక క్రమబద్ధమైన ప్రణాళిక మేరకు నిర్వహించాలి. మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ప్రారంభించిన స్వచ్ఛ భారత్ లేదా క్లీన్ ఇండియా మిషన్‌ను ప్రజలందరూ తమ స్వంత బాధ్యతగా స్వీకరించి, జన ఆందోళన్ లేదా సామాజిక కార్యక్రమంగా నిర్వహిస్తూ ప్రధాని మోదీ కలలను సాకారం చేస్తున్నారు. బహిరంగ మల, మూత్ర విసర్జనను పూర్తిగా నివారించడానికి గాను, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతి ఇంటికీ స్వంత మరుగుదొడ్డి నిర్మాణం పూర్తి చేయడంతోపాటు, దేశప్రజలందరికీ ఈ విషయంలో అవగాహన కల్పించాలి. ఇంతవరకు 57 లక్షల వ్యక్తిగత మరుగుదొడ్లు, 3.8 లక్షల సామూహిక మరుగుదొడ్లు నిర్మించడం పూర్తయింది. పి.ఎమ్.ఎ.వై. (యు) పథకం క్రింద నిర్మించనున్న 47.5 లక్షలకు పైన మరుగుదొడ్లు అందుబాటు ధరల నివాస గృహాలకు సమకూరుతాయి. అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (ఎ.ఎమ్.ఆర్.యు.టి.) పరిధిలోని 500 నగరాలలో, అంతర్జాతీయ ప్రమాణాలతో మంచినీటి సరఫరా, మెరుగైన మురికినీటి తరలింపు వ్యవస్థలతోపాటు, అందుబాటు ధరల నివాస గృహాలకు జీవన ప్రమాణాల స్థాయిని కూడా మెరుగుపరుస్తారు. ''స్మార్ట్ సిటీస్'' పథకంలో భాగంగా, ఎంపిక చేసిన 99 నగరాలలో, అందుబాటు ధరల నివాసాల లబ్దిదారులందరికీ ఆ నగరం అభివృద్ధి కార్యక్రమాలన్నింటిలో సమానమైన భాగస్వామ్యం లభిస్తుంది.

పట్టణ ప్రాంతాలలో మెరుగైన పర్యావరణ పరిస్థితుల కల్పనలో కూడా పి.ఎమ్.ఎ.వై.(యు) పథకం పాలు పంచుకుంటుంది. భారతదేశ నగరాలను ప్రపంచ స్థాయిలో నిలుపడానికి కృషి చేస్తుంది. ప్రధాని మోదీ నినదించిన "సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్" (అందరికి అభివృద్ధి) మేరకు, దేశ ప్రజలందరికీ ''మెరుగైన జీవనం'' అందించడానికి దృఢ నిశ్చయంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నది. ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాలు వేటిలోను ఇంత పెద్ద ఎత్తున పట్టణీకరణ అభివృద్ధి కార్యక్రమాలు జరగడం లేదు. ప్రస్తుతం భారతదేశంలో పి.ఎమ్.ఎ.వై. (యు) పథకం క్రింద కొనసాగుతున్న అందుబాటు ధరలో స్వంత ఇంటి నిర్మాణం పథకం పూర్తిగా విజయవంతమైతే భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలోను ఈ పథకాన్ని ప్రణాళికాపరంగాను, నిర్వహణ పరంగా కూడా ఆదర్శంగా తీసుకుని, ఈ భారత నమూనాను అనుసరించే అవకాశం ఉంది. ■




**హైదరాబాద్‌లో మే 31, 2018న నాలుగు సంవత్సరాల ఎన్.డి.ఎ పాలనపై ప్రజలకు ఒక నివేదికను అందుస్తున్న కేంద్ర న్యాయ, ఐటి శాఖామంత్రి రవిశంకర్ ప్రసాద్.**

# గ్రామాల నూరు శాతం విద్యుదీకరణ

- ఎ.కె. భల్లా



**దేశంలో విద్యుత్ సదుపాయానికి నోచుకోని సుమారు 18,500 గ్రామాలకు వెయ్యి రోజుల్లోగా విద్యుత్ వసతి కల్పిస్తామని 2015 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఎర్రకోట బురుజుల నుంచి జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రధాని ప్రకటించారు. ఈ లక్ష్యంతోనే గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ పంపిణీకి సంబంధించిన అన్ని అంశాలనూ సమీకృతం చేస్తూ గ్రామీణ ప్రాంతాల కోసం "దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి యోజన" (డిడియుజిజెవై) పేరిట ఒక పథకానికి రూపకల్పన చేసి ప్రారంభించారు.**

విద్యుత్ సదుపాయం ఇప్పుడు మనందరికీ కనీస అవసరంగా మారిపోయింది. ఈ 21వ శతాబ్దిలో విద్యుత్ సరఫరా లేకుడా జీవించడం అనే పరిస్థితిని ఊహించుకుంటే దారుణం అనిపిస్తుంది. అందుకే ప్రభుత్వం విద్యుత్‌ను సార్వత్రికంగా అందుబాటులోకి తేవడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసింది. దేశంలో విద్యుత్ సదుపాయానికి నోచుకోని సుమారు 18500 గ్రామాలకు వెయ్యి రోజుల్లోగా విద్యుత్ వసతి కల్పిస్తామని 2015 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఎర్రకోట బురుజుల నుంచి జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రధాని ప్రకటించారు. నిర్దేశిత కాలపరిమితిలోగా విద్యుత్ వసతికి నోచుకోని ఈ గ్రామాలన్నింటినీ విద్యుదీకరించాల్సిన బృహత్ బాధ్యతను విద్యుత్ మంత్రిత్వ శాఖ భుజస్కంధాలపై వేశారు. ఇంత పెద్ద సవాలును అమలు చేయాల్సివచ్చినప్పుడు దాని పరిధి ఎంతటితో అంచనా వేయడం ప్రాథమిక విధి. "ఏదైనా సరైన అంచనా లేకపోతే దాన్ని నిర్వహించడం సాధ్యం కాదు" అన్నది మేనేజ్ మెంట్ లో ప్రాథమిక సూత్రం.

గ్రామీణ ప్రాంతం పాలనా పరిధి తెలుసుకునేందుకు ప్రధాన ఆధారం జనాభాగణాంకాలే. ఆ రకంగా జనాభా గణాంకాల్లో నమోదైన గ్రామాలన్నింటికీ నూరు శాతం విద్యుదీకరణ సాధించడం – అందరికీ అందుబాటులో విద్యుత్ సాధనలో తొలి అడుగు. విద్యుత్‌ను అందరికీ అందుబాటులో తేవడం... అందులోనూ గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడం చాలా అవసరం. అప్పుడే ప్రజలు తమ అవసరాలు తీరాయని సంతృప్తి చెందుతారు. ఈ లక్ష్యంతోనే గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ పంపిణీకి సంబంధించిన అన్ని అంశాలనూ సమీకృతం చేస్తూ గ్రామీణ ప్రాంతాల కోసం "దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి యోజన'' (డిడియుజిజెవై) పేరిట ఒక పథకానికి రూపకల్పన చేసి ప్రారంభించారు.

### దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి యోజన (డిడియుజిజెవై)

ఇంతవరకు విద్యుత్ సదుపాయం లేని గ్రామాలన్నింటినీ విద్యుదీకరించడం; 2) ఇప్పటికే విద్యుత్ వసతి అందుబాటులో ఉన్న గ్రామాల్లో ప్రతీ ఇంటికీ విద్యుత్ వసతి ఉండేలా సమగ్ర విద్యుదీకరణ; 3) విద్యుత్ సరఫరాలో నాణ్యత, ఆధారనీయత పెంచడానికి పంపిణీ, అనుబంధ పంపిణీ మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడం; 4) రైతులకు విద్యుత్ సరఫరా కోసం ఫీడర్‌ను వేరు చేయడం;

కార్యదర్శి, కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ, న్యూఢిల్లీ.
E-mail : secy-power@nic.in

5) ఇంధన ఆడిటింగ్, విద్యుత్ సరఫరాలో నష్టాల తగ్గింపు లక్ష్యంగా ఫీడర్లు, పంపిణీ ట్రాన్స్ ఫార్మర్లు, వినియోగదారులందరికీ మీటర్లు ఏర్పాటు చేయడం ఈ స్కీమ్‌లో భాగంగా ఉన్నాయి. అప్పటివరకు అమలులో ఉన్న గ్రామీణ విద్యుదీకరణ పథకాన్ని డిడియుజిజెవైలో గ్రామీణ విద్యుదీకరణ విభాగం పేరిట ఒక ప్రత్యేక విభాగంగా విలీనం చేశారు. ఈ స్కీమ్ పెట్టుబడి అంచనా 75893 కోట్ల రూపాయలు కాగా కేంద్రప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల ద్వారా 63027 కోట్ల రూపాయలు కేటాయించింది. ఈ స్కీమ్ కింద మంజూరు చేసిన ప్రాజెక్టులన్నీ అమలులో వివిధ దశల్లో ఉన్నాయి.

## నూరు శాతం విద్యుదీకరణ ప్రణాళిక, వ్యూహం

డిడియుజిజెవై పథకం కింద ఇప్పటి వరకు విద్యుత్ వసతికి నోచుకోని గ్రామాలను విద్యుదీకరించడం ఒక ఉద్యమ స్ఫూర్తితో చేపట్టడం జరిగింది. 2015-16 సంవత్సరానికి ముందు మూడు సంవత్సరాల కాలంలో (2012-13 : 2587; 2013-14 : 1197; 2014-15 : 1405) గ్రామీణ విద్యుదీకరణ జోరు మందగించింది. అదే రీతిలో విద్యుదీకరణ సాగినట్టయితే గ్రామాలన్నింటినీ విద్యుదీకరించడానికి మరో పది సంవత్సరాలు పట్టి ఉండేది. అందుకే వాస్తవ పరిస్థితిని అవగాహన చేసుకునేందుకు, అందుబాటులో ఉన్నవనరుల గురించి అవగాహన పెంచుకుని విద్యుదీకరణలో పురోగతిని వేగవంతం చేసేందుకు కావలసిన దిద్దుబాటు చర్యలు చేపట్టడానికి, ఒక పర్యవేక్షణ యంత్రాంగం ఏర్పాటు చేసేందుకు విద్యుదీకరణతో సంబంధం ఉన్న అన్ని వర్గాల వారితోను సవివరమైన సంప్రదింపులు నిర్వహించారు. దీని వల్ల కొత్త ఆలోచనలు తెర పైకి వచ్చాయి. కొత్త వ్యూహాలు, కొత్త అమలు విధానం రూపొందించే వీలు కలిగింది. వాటి వివరాలు...

1) 2011 జనాభా గణాంకాల ఆధారంగా గ్రామాల గుర్తింపు : విద్యుదీకరణకు చక్కని ప్రణాళిక రూపొందించడానికి వీలుగా 2011 జనాభా గణాంకాలను ఉపయోగించుకుని గ్రామం పేరు, భౌగోళిక ప్రదేశం, గ్రామ జనాభా వంటి వివరాల ఆధారంగా ఇంతవరకు విద్యుత్ వసతి అందుబాటులో లేని, విద్యుదీకరణ అవసరమని భావించిన గ్రామాలను సరిగా గుర్తించాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రప్రభుత్వం సూచించింది. అంతకు ముందు అమలులో ఉన్న పథకం కింద ఎన్ని గ్రామాలకు విద్యుత్ సదుపాయం అందుబాటులోకి తెచ్చారు అన్నదే గీటురాయిగా కార్యక్రమ పురోగతిని పర్యవేక్షించే వారు.




2) మారుమూల/రవాణా వసతులు అందుబాటులో లేని గ్రామాలకు సోలార్ పివి ఆధారిత ఆఫ్ గ్రిడ్ సొల్యూషన్ : విద్యుత్ సదుపాయానికి నోచుకోని వాటిలో ఎక్కువ గ్రామాలు మారుమూల ప్రాంతాల్లో గాని లేదా మంచు కొండలు, దట్టమైన అడవులు, వామపక్ష తీవ్రవాద పీడిత ప్రదేశాల్లో ఉన్నట్టు పరిశీలనలో తేలింది. ఈ గ్రామాలకు చేరడం, తగిన విద్యుత్ పరికరాలను తరలించడం ఒక పెద్ద సవాలు అని గుర్తించారు. కొన్ని గ్రామాలకు గ్రిడ్ ను విస్తరించడం అసాధ్యమే కాకుండా వ్యయభారం సైతం అధికం అని గుర్తించడంతో వాటికి సోలార్ ఫొటోవోల్టాయిక్ ఆధారిత ఆఫ్ గ్రిడ్ వ్యవస్థలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ వసతి కల్పించాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా డిడియుజిజెవై పథకం కింద ఆఫ్ గ్రిడ్ ప్రాజెక్టులను మంజూరు చేశారు.

3) ప్రమాణాత్మక బిడ్డింగ్ పత్రాలు తయారుచేసి ఇ-టెండర్లను ఆహ్వానించారు.

4) సరికొత్త ఫైనాన్సింగ్ విధానాలు : విద్యుదీకరణ పనులు వేగం అందుకుంటున్న కొద్ది ఈ స్కీమ్ కింద రాష్ట్రాలకు నిధుల కేటాయింపు అవశ్యకత పెరిగింది. పథకం అమలు కోసం బడ్జెట్ ద్వారా కేటాయించిన నిధులకు అదనంగా బాండ్ల జారీ ద్వారా మార్కెట్ నుంచి నిధులు సమీకరించుకునేందుకు విద్యుత్ మంత్రిత్వ శాఖకు ఆర్థికమంత్రిత్వ శాఖ అనుమతించింది. విద్యుత్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పిఎఫ్ సి), గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్ (ఆర్ ఇసి) ద్వారా బాండ్లు జారీ చేసి నిధులు సమీకరించుకోవడం వల్ల పనుల అమలుకు రాష్ట్రాలకు తగినన్ని నిధులు అందుబాటులో ఉంటాయి. అదనపు బడ్జెటరీ వనరుల (ఇబిఆర్) ద్వారా గత



మారుమూల గ్రామాలకు పడవలపై విద్యుత్ సామాగ్రి తరలింపు

రెండు ఆర్థిక సంవత్సరాల్లో 9 వేల కోట్ల రూపాయలు సమీకరించడం జరిగింది.

5) పనుల అమలులోరాష్ట్రాలకు స్వేచ్ఛ : విభిన్న భౌగోళిక ప్రదేశాలు, జనాభా, ఇతర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని పనులకు ఒకే విధానం సరిపోదని భావించి వారి వారి అవసరాలకు అనుగుణంగా టర్న్ కీ, పాక్షిక టర్న్ కీ, డిపార్ట్‌మెంటల్ విధానాల్లో ఏది అనుకూలమైతే అది అనుసరించేందుకు రాష్ట్రాలకు స్వేచ్ఛ ఇచ్చారు.

6. రాష్ట్రాలు/డిస్కమ్‌లకు చేయూత : అవసరం అయినప్పుడల్లా రాష్ట్రాలు/డిస్కమ్‌లకు కావలసిన చేయూత అందించడం జరిగింది. రోజువారీగా రాష్ట్రప్రభుత్వ అధికారులతో సంప్రదిస్తూ పనులు సత్వరం జరిగేలా చూసేందుకు, అందరినీ ఒకే తాటిపై నడిపించేందుకు నోడల్ ఏజెన్సీ ప్రతీ రాష్ట్రంలోను కార్యాలయాలు తెరిచి సీనియర్ అధికారులను సమన్వయ కర్తలుగా నియమించింది. రాష్ట్ర డిస్కమ్‌లు /విద్యుత్ శాఖలను పటిష్ఠం చేసి వాటి సామర్థ్యాలను బలోపేతం చేసేందుకు, పథకం సత్వరం అమలు జరిగేలా చూస్తూ నిరంతరం పర్యవేక్షించడంలో వాటికి సహాయపడేందుకు ఆర్ఇసి బ్లాక్/జిల్లా స్థాయిల్లో గ్రామ విద్యుత్ అభియాంతలను నియమించింది. స్థానిక ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లను ఎంపిక చేసి నియమించే ఈ జివిఏలు క్షేత్రస్థాయిలో విస్తృత పర్యవేక్షణకు డిస్కమ్‌లకు సహాయపడుతున్నారు.

7. మైలురాళ్ల ఆధారిత పర్యవేక్షణ : పథకం అమలుకు నిర్దేశించిన కాలపరిమితి లోగా పనులు జరుగుతున్నది లేనిది పర్యవేక్షించి, వాటిలోని పురోగతిని గుర్తించేందుకు వీలుగా గ్రామాల విద్యుదీకరణ విధానం అంతటినీ 12 దశలు లేదా మైలురాళ్లుగా విభజించారు. పనులు కేటాయించడం దగ్గర నుంచి సర్వే నిర్వహణ, కావలసిన వస్తువుల కొనుగోలు, పనులు జరుగుతున్న ప్రదేశంలో వాటిని అందించడం, పరికరాల అమరిక, ప్రారంభం, విద్యుత్ అనుసంధానం వరకు ఈ మైలురాళ్లున్నాయి. ప్రాజెక్టు అనుకున్న సమయానికి పూర్తి చేసేందుకు, గ్రామాల్లో వెలుగులు నింపేందుకు వీలుగా ప్రాజెక్టు నిర్వహణ టూల్స్‌ను విస్తృతంగా వినియోగిస్తున్నారు.

8. పారదర్శకత, జవాబుదారీ : గ్రామాల్లో విద్యుదీకరణ పనులు జరుగుతున్న తీరు, విద్యుదీకరణలో పురోగతిపై ప్రజలకు సమాచారం అందించేందుకు, పథకం అమలులో పారదర్శకతకు "గర్వ్" పేరిట ఒక మొబైల్ యాప్‌ను కూడా ప్రారంభించారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ ఉండడం వల్ల వ్యవస్థలో జవాబుదారీతనంతో కూడిన వాతావరణం నెలకొంది.

9. క్రమం తప్పకుండా సమీక్ష, పర్యవేక్షణ : పథకం అమలుపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వాలు, డిస్కమ్‌ల స్థాయిలో నిరంతర సమీక్ష, పర్యవేక్షణ యంత్రాంగం ఒకటి ఏర్పాటు చేశారు. మరింత మెరుగైన సమన్వయం, ప్రాజెక్టు నిర్వహణ కోసం ప్రాంతీయ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు.

**పురోగతి**

రాష్ట్రాలు పైన సూచించిన వ్యూహం ప్రకారం ప్రాజెక్టును అమలు పరిచాయి. ఎంతో ఆలోచించి రూపొందించిన ఈ ప్రణాళిక, వ్యూహం ఫలితాలు పథకం అమలు మొదలైన తొలి ఏడాది నుంచే దృగ్గోచరం అయ్యాయి. 2015-16 సంవత్సరంలో (7108 గ్రామాల విద్యుదీకరణ) గ్రామీణ విద్యుదీకరణ అంతకు ముందు సంవత్సరాలతో పోల్చితే ఎంతో మెరుగుపడింది. అంతకుముందు మూడు సంవత్సరాలతో పోల్చినా (2012-13 : 2587బీ 2013-14 : 1197; 2014-15 : 1405) మరింత సమీకృత పురోగతి కనిపించింది.

**కాలంవారీగా పురోగతి పట్టిక**

| ప్రకటించిన తేదీ నుంచి రోజులు | విద్యుదీకరించిన గ్రామాల సంఖ్య |
|---|---|
| 200 | 6021 |
| 400 | 10233 |
| 600 | 13174 |
| 800 | 14701 |
| 1000 | * 18452 |

* 1271 గ్రామాలు అంతగా జనావాసం లేనివి లేదా దట్టమైన సంరక్షిత అటవీ గ్రామాలుగా గుర్తించారు.

**అమలులో సవాళ్లు, దిద్దుబాటు చర్యలు**

విద్యుదీకరణకు నోచుకోకుండా ఉండి పోయిన ఈ గ్రామాలన్నీ మారుమూల ప్రాంతాలకు చెందినవి లేదా ఎలాంటి రవాణా సదుపాయం అందుబాటులో లేని క్లిష్టమైన కొండ ప్రాంతాలు, దట్టమైన అటవీ ప్రాంతాలకు చెందినవి లేదా వామపక్ష తీవ్రవాద పీడిత ప్రాంతాల్లో ఉన్నవన్న విషయం ఇక్కడ మనం గమనించాలి. స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి ఇప్పటివరకు పేదరికంలోనే మగ్గుతున్న ఈ గ్రామాల ప్రజలకు విద్యుత్ సదుపాయాన్ని విస్తరించడంలో ప్రధాన అవరోధంగా నిలిచిన సవాలును దీటుగా అధిగమించడమే సంపూర్ణ గ్రామీణ విద్యుదీకరణ కార్యక్రమంలో అత్యంత కీలకమైన అంశం. పనులు పురోగమిస్తున్న కొద్దీ సంక్లిష్టత స్థాయి మరింతగా పెరుగుతూ వచ్చింది.

**కార్యక్రమం అమలులో ప్రధాన సవాళ్లు ఇలా ఉన్నాయి...**

సాంప్రదాయిక గ్రిడ్ వ్యవస్థ అందించడానికి అవకాశం లేని ప్రాంతాలు : 2762 గ్రామాలు

అత్యంత సంక్లిష్టమైన కొండ ప్రాంతాలు : 245 గ్రామాలు (జమ్ము కశ్మీర్ – 54; అరుణాచలప్రదేశ్ – 182; మేఘాలయ –9)

వస్తుసామగ్రిని తలపై పెట్టుకుని 1 నుంచి 10 రోజుల పాటు ప్రయాణించాల్సిన ప్రదేశాలు : 102 గ్రామాలు (అరుణాచలప్రదేశ్–90; మణిపూర్–12)

హెలీకాప్టర్ల ద్వారా వస్తుసామగ్రి తరలించగల ప్రదేశాలు : 51 గ్రామాలు (జమ్ము కశ్మీర్ – 35; అరుణాచలప్రదేశ్ – 16)

వామపక్ష తీవ్రవాద పీడిత (ఎల్ డబ్ల్యుఇ) ప్రాంతాలు :7614 గ్రామాలు (బిహార్ – 1044; జార్ఖండ్ – 2478; ఛత్తీస్‌గఢ్ – 1051; మధ్యప్రదేశ్ – 14; ఒడిశా – 3027)

అటవీ అనుమతులు అవసరమైన ప్రాంతాలు : 415 గ్రామాలు (జార్ఖండ్ – 155; ఉత్తరాఖండ్ – 23; ఒడిశా – 5; అస్సాం – 32; మధ్యప్రదేశ్ – 160)

రైల్వే అనుమతులు అవసరమైన ప్రాంతాలు: 38 గ్రామాలు (బిహార్ – 37; అసోం–1)

ఆ రకంగా రాష్ట్రాలు, డిస్కంలు, కాంట్రాక్టర్లు, వెండర్లు, పరికరాల తయారీదారులు, ఆయా రాష్ట్రాల ప్రజల సహకారంతో ప్రధాని ప్రకటించిన వెయ్యి రోజుల గడువు కన్నా చాలా ముందే విద్యుదీకరణ లక్ష్యాన్ని సాధించగలిగాం.

విద్యుత్ మంత్రిత్వ శాఖ ప్రయాణం కొనసాగుతూనే ఉంటుంది. దేశంలోని ఇళ్లన్నింటికీ విద్యుత్ వసతి కల్పించడం మా తదుపరి లక్ష్యం. ఇందుకోసం "ప్రధానమంత్రి సహజ్ బిజ్లీ హర్ ఘర్ యోజన – సౌభాగ్య" పేరిట ఒక కార్యక్రమం చేపట్టాం.

2019 మార్చి 31 నాటికి దేశంలో సంపూర్ణ విద్యుదీకరణ ధ్యేయంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలన్నింటిలోనూ విద్యుత్ వసతికి నోచుకోని ఇళ్లన్నింటికీ కూడా విద్యుత్ కనెక్షన్లు అందుబాటులోకి తెచ్చి చిట్టచివరి ఇంటిని కూడా విద్యుదీకరించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ■

## గమనిక

**వ్యాసకర్తలకు సూచన** యోజన మాసపత్రికకు వ్యాసాలు పంపేవారు తమ వ్యాసం సాఫ్ట్ కాపీని పేజిమేకర్ 6.5 లేదా 7 మరియు "అను" 7 ఫాంట్‌లో, వర్డ్‌లోనూ పంపాలి. వ్రాతప్రతిని కూడ హామీ పత్రంతో కలిపి పోస్టుద్వారా పంపాలి. హామీ పత్రంలో ఇది తమ స్వంత రచన అనీ, దేనికీ అనువాదం, అనుసరణ కాదనీ, మరే పత్రికకూ పంపలేదనీ, ఇంతకుముందు పుస్తకంగా ముద్రించలేదని పేర్కొనాలి. రచనలు ప్రతి నెలా 15వ తేదీ లోపు మాకు చేరాలి. ప్రచురణకు నోచుకోని రచనలు తిరిగి పంపబడవు. దీనిపై ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకూ చోటులేదు. ఏ నెలకైనా సంబంధించిన అంశం (Topic of the month) పైనే వ్యాసాలు పంపాలి గమనించగలరు. వ్యాసాలను పంపేవారు ఏ నెలకానెల ఇచ్చే ప్రత్యేక అంశంపైననే 5వ తారీఖులోపు నాలుగు వాక్యాల అవరణం పంపాలి.

యోజన తెలుగు మాసపత్రిక, 205, రెండవ అంతస్తు, సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ – 500 080.
E-mail: yojana_telugu@yahoo.co.in - yojana.telugu@nic.in

# పునర్వినియోగ ఇంధన విస్తరణ కార్యక్రమం - 2022

- మనోజ్ కుమార్ ఉపాధ్యాయ్
- డాక్టర్ అభినవ్ త్రివేది



**పునర్వినియోగ ఇంధన ఉత్పత్తిని వృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఇందులో ప్రధానమైనవి – ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు పెట్టుబడి మరియు వడ్డీ రాయితీలు, రాయితీపై ఆర్థిక వెసులుబాటు, ఆర్థిక ప్రోత్సాహకాలు మొదలైనవి. ఇంతేకాక, వీటికి అదనంగా అనేక ప్రత్యేక చర్యలను కూడా చేపట్టారు. ఇందులో ముఖ్యమైనవి విద్యుత్తు చట్ట సవరణలు, ఖచ్చితమైన పునర్వినియోగ కొనుగోలు ఒప్పందం (ఆర్‌పిఒ) అమలుకు టారిఫ్ విధానం, పునర్వినియోగ ఉత్పత్తిని ఖచ్చితంగా అమలు చేయడం మొదలగునవి ప్రధానమైనవి.**

దేశంలో ఇంధన అవసరాలను తీర్చడానికి పునర్వినియోగ ఇంధనం ఓ ప్రధాన వనరుగా ఉన్నది. గత కొన్నేళ్లుగా మన ఇంధన రంగంలో పునర్వినియోగ ఇంధనం కీలకంగా మారింది. 2022 నాటికి 175 జి.డబ్ల్యు (గిగా వాట్ల) పునర్వినియోగ ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో ఈ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది.

కేంద్ర నూతన పునర్వినియోగ ఇంధన మంత్రిత్వ శాఖ (ఎమ్ఎన్ఆర్ఇ) ప్రపంచంలోనే అతి పెద్ద విస్తరణ కార్యక్రమం చేపట్టి కాలుష్య రహిత ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి అనేక చర్యలు చేపట్టింది. 2018 మార్చితో ముగిసిన గత నాలుగేళ్లలో (మే 2014 నుండి మార్చి 2018 వరకు) 37.33 జి.డబ్ల్యు ల (గిగా వాట్ల) పునర్వినియోగ ఇంధనాన్ని ఉత్పత్తి చేసే సామర్థ్యం పెరిగింది. మనదేశం ఇప్పటి వరకూ మొత్తం 69 గిగా వాట్ల (20 శాతం) పునర్వినియోగ ఇంధన ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంది. 2022 నాటికి 175 గిగా వాట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించడానికి కేంద్రం అనేక పథకాలను చేపట్టింది. ఇందులో ముఖ్యమైనవి – పవన – సౌర హైబ్రిడ్ విద్యుత్తు ప్రాజెక్టులు, తీర ప్రాంత పవన విద్యుత్ ప్రాజెక్టులు, బయోమాస్ విద్యుత్తు, పరిశ్రమలకు బయో మాస్ గ్యాస్ సరఫరా, సౌర పార్కుల అభివృద్ధి కార్యక్రమం, అత్యాధునిక సౌర విద్యుత్తు ప్రాజెక్టులు, కాలువల ఒడ్డున, కాలువలపై విద్యుత్తు గ్రిడ్‌తో అనుసంధానించిన (Photo Voltoic) విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు, బయోగ్యాస్ ఆధారిత గ్రిడ్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి.

వీటన్నిటిలో జాతీయ సౌర విద్యుత్తు మిషన్ (సోలార్ మిషన్) అత్యంత ప్రధానమైనది. బొగ్గు, గ్యాస్ ఆధారిత విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలకు సమాన వ్యయంతో సౌర ఇంధనాన్ని విద్యుత్తు ఉత్పత్తికి వినియోగిస్తున్నారు. పునర్వినియోగ ఇంధన రంగంలో పారదర్శకమైన బిడ్డింగ్ విధానం, సదుపాయాలు కల్పించడం వల్ల సౌర విద్యుత్తును ఒక్కో యూనిట్ ధర రూ. 2.44, పవన విద్యుత్తు యూనిట్ ధర రూ. 2.64 అతి తక్కువ రేటుకు సరఫరా చేయడం జరుగుతోంది.

పునర్వినియోగ ఇంధన ఉత్పత్తిని వృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఇందులో ప్రధానమైనవి – ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు పెట్టుబడి మరియు వడ్డీ రాయితీలు, రాయితీ పై ఆర్థిక వెసులుబాటు, ఆర్థిక ప్రోత్సాహకాలు మొదలైనవి. ఇంతేకాక, వీటికి అదనంగా అనేక

నీతి ఆయోగ్‌లో ఇంధనం, వాతావరణ మార్పుల ఉప సలహాదారు, న్యూఢిల్లీ. E-mail : mk.upadhyay@nic.in
నీతి ఆయోగ్‌లో యువ నిపుణుడు, న్యూఢిల్లీ. E-mail : abhinav.trivedi@nic.in

ఇటీవల సౌర విద్యుత్తు ధరలు క్రమంగా ఎలా తగ్గాయో దిగువున పేర్కొన్న పట్టికలో చూడవచ్చు.

| క్ర. సం. | నెల సంవత్సరం | సామర్థ్యం మెగావాట్లు | అతి తక్కువ (రూ. కెడబ్ల్యుహెచ్) | పథకం | రాష్ట్రం |
|---|---|---|---|---|---|
| 1 | ఫిబ్రవరి–2017 | 750 | 3.30 | రాష్ట్ర పథకం | మధ్య ప్రదేశ్ (రేవా సోలార్ పార్కు) |
| 2 | మే – 2017 | 250 | 2.62 | విజిఎఫ్ స్కీం | రాజస్థాన్ (భద్లా IV సోలార్ పార్కు) |
| 3 | మే – 2017 | 500 | 2.44 | విజిఎఫ్ స్కీం | రాజస్థాన్ (భద్లా III సోలార్ పార్కు) |
| 4 | ఆగస్టు – 2017 | 500 | 2.65 | రాష్ట్ర పథకం | గుజరాత్ (సౌరేతర పార్కు) |

(మూలం: కేంద్ర నూతన & పునర్వినియోగ ఇంధన మంత్రిత్వశాఖ)

ప్రత్యేక చర్యలను కూడా చేపట్టారు. ఇందులో ముఖ్యమైనవి విద్యుత్తు చట్ట సవరణలు, ఖచ్చితమైన పునర్వినియోగ కొనుగోలు ఒప్పందం (ఆర్‌పిఒ) అమలుకు టారిఫ్ విధానం, పునర్వినియోగ ఉత్పత్తిని ఖచ్చితంగా అమలు చేయడం, గ్రీన్ ఎనర్జీ కారిడార్ ప్రాజెక్టు ద్వారా పునర్వినియోగ విద్యుత్తు సరఫరా చేయడం. విద్యుత్తు సరఫరా సంస్థలను ప్రోత్సహించడానికి, మీటరింగ్ విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయడం వంటి లక్ష్యాలను సాధించడానికి గ్రీన్ క్లైమేట్ ఫండ్ తదితర ద్వైపాక్షిక, అంతర్జాతీయ దాతల నుండి నిధుల సమీకరణ జరుగుతోంది. కేంద్ర నూతన – పునర్వినియోగ ఇంధన మంత్రిత్వ శాఖ చేపట్టిన ప్రధానమైన చర్యలు.

**సౌర విద్యుత్తు:**


- సౌర విద్యుత్తు పార్కులు & అల్ట్రా మెగా సౌర విద్యుత్తు ప్రాజెక్టుల సామర్థ్యం పెంపుదల పథకం కింద ఉత్పత్తిని 20 జిడబ్ల్యు నుంచి 40 జిడబ్ల్యు లకు పెంచారు.
- నూతన భవన నిర్మాణాల పైకప్పులపై సౌర విద్యుత్తు ఉత్పత్తిని ప్రోత్సహించేలా బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తూ, భవన నిర్మాణ నిబంధనల్లో సవరణలు చేశారు.
- స్మార్ట్ నగరాల అభివృద్ధిలో భవనాల పైకప్పులపై సౌర ఫోటో వోల్టాయిక్ పరికరాల ఏర్పాటు మరియు 10 శాతం పునర్వినియోగ విద్యుత్తు ఉత్పత్తి తప్పనిసరి చేస్తూ మార్గదర్శకాలను విడుదల చేశారు.
- సౌర విద్యుత్తు ప్రాజెక్టుల ఏర్పాటు కోసం ఈక్విటీ నిర్వహణకు పన్ను రహిత సోలార్ బాండ్ల విడుదల
- సౌర విద్యుత్తును కొనుగోలు చేయడానికి టారిఫ్ ఆధారిత పోటీ బిడ్డింగ్ ప్రక్రియ
- భవనాల పైకప్పులపై సోలార్ ఫోటో వోల్టాయిక్ ఏర్పాటుకు అయ్యే వ్యయంలో 30 శాతం నిధులను కేంద్రం అంది స్తోంది. ప్రత్యేక కేటగిరీ రాష్ట్రాల్లో 70 శాతం నిధులను కేంద్రం అందిస్తుంది.
- సూర్య మిత్ర కార్యక్రమం కింద 11 వేలకు పైగా అర్హులైన సాంకేతిక నిపుణులకు శిక్షణ ఇచ్చారు.

**పవన విద్యుత్తు:**

- పవన విద్యుత్తు వ్యవస్థాపక సామర్థ్యంలో చైనా, అమెరికా, జర్మనీ తరువాత భారత్ ప్రపంచంలో 4వ స్థానంలో ఉంది.
- మన దేశంలో పవన విద్యుత్తు ఉత్పాదక సామర్థ్యం 100 మీటర్ల హబ్ ఎత్తు పై 302 గిగా వాట్లు ఉన్నట్లు జాతీయ పవన విద్యుత్తు సంస్థ (National Institute for wind energy-NIWE) అంచనా వేసింది.
- భారత్‌కు సుదీర్ఘ సముద్ర తీరం ఉండడం వల్ల తీర ప్రాంతంలో పవన విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలకు పవన విద్యుత్తు విధానానికి కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.
- తమిళనాడులో పవన విద్యుత్తు అంచనాల ఆధారంగా NIWE సంస్థ గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలతో ఒప్పందాలు చేసుకున్నది.

**జీవ ఇంధనం:**

- జీవ వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తి సంస్థల ఏర్పాటుకు కేంద్రం ఆర్థిక సహాయం అందిస్తోంది.
- అంతర్గత విద్యుత్తు ఉత్పత్తికి బయో గ్యాస్ విద్యుత్తు ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నారు.
- జాతీయ బయోగ్యాస్ మరియు మెన్యూర్ నిర్వహణ కార్యక్రమం (NBMMP) కింద కుటుంబ అవసరాల కోసం ముఖ్యంగా గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు
- పునర్వినియోగ ఇంధనం ప్రోత్సాహకానికి టారిఫ్ విధానంలో సంస్కరణలు.
- మార్చి 2022 నాటికి సౌర విద్యుత్తు కొనుగోలు ఒప్పందాన్ని 8 శాతం పెంచడం.
- సరికొత్త బొగ్గు/లిగ్నైట్ ఆధారిత థర్మల్ విద్యుత్తు కర్మాగారాల్లో పునరుద్ధరణీయ విద్యుత్తు ప్రారంభించడం.
- పునర్వినియోగ విద్యుత్తును చౌక ధరలో అందుబాటులోకి తీసుకురావడానికి వీలుగా పునర్వినియోగ ఇంధనాన్ని కూడ గట్టడం.
- వివిధ రాష్ట్రాల మధ్య సౌర, పవన విద్యుత్తు ప్రసారణ వ్యయాన్ని రద్దు చేయడం.
- సవరించిన విద్యుత్తు ఛార్జీల విధానానికి అనుగుణంగా కేంద్ర విద్యుత్తు మంత్రిత్వ శాఖ రాగల మూడు సంవత్సరాలకు అంటే, 2016–17, 2017–18, 2018–19లకు సౌర విద్యుత్తు, సౌరేతర




విద్యుత్తును కొనుగోలు చేయడానికి దీర్ఘకాల అభివృద్ధి ప్రణాళికను ప్రకటించింది.

| దీర్ఘకాల ప్రణాళిక | 2016-17 | 2017-18 | 2018-19 |
|---|---|---|---|
| సౌరేతర | 8.75% | 9.50% | 10.25% |
| సౌర | 2.75% | 4.75% | 6.75% |
| మొత్తం | 11.50% | 14.25% | 17.00% |

### స్వచ్ఛమైన ఇంధన కారిడార్

- పునర్వినియోగ విద్యుత్తు అదనంగా కలిగివున్న ఎనిమిది రాష్ట్రాలు (తమిళనాడు, రాజస్థాన్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్) నుండి భారీగా 20,000 మెగావాట్లను ఇతర రాష్ట్రాలకు తరలించడం. ఇందుకోసం రూ. 10,141 కోట్ల వ్యయంతో సుమారు 9,400 సికె.మీ ల విద్యుత్తు సరఫరా లైన్ల ఏర్పాటు, 19,000 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్తు ఉప కేంద్రాల నిర్మాణం చేస్తున్నారు.

### ఇతర చర్యలు:

- అంతర్జాతీయ సౌర సమాఖ్య (ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్, ఐఎస్ఎ) డిసెంబరు, 2017లో ఏర్పాటయింది. అంతర్జాతీయ పునర్వినియోగ ఇంధన సంఘం (ఇంటర్నేషనల్ రిన్యూవబుల్ కమ్యూనిటీ) ప్రధాన కేంద్రం భారత్‌లో ఉన్నది. ఫ్రాన్స్ తో కలిసి భారత్ ఇందులో కీలక పాత్ర పోషిస్తోంది. కర్కాటక రేఖ నుంచి మకర రేఖ వరకు ఉన్న 121 దేశాలు ఐఎస్ఎలో సభ్యులుగా ఉన్నాయి.
- సౌర ఆధారిత విద్యుత్తు జనరేటర్లు, జీవ వ్యర్థాల ఆధారిత విద్యుత్తు జనరేటర్లు, పవన విద్యుత్తు యంత్రాలు, సూక్ష్మ జల విద్యుత్తు కేంద్రాలకు సుమారు రూ. 15 కోట్ల వరకు బ్యాంకులు రుణ సదుపాయం కల్పిస్తాయి. పునర్వినియోగ విద్యుత్తు ద్వారా పనిచేసే ప్రజావసరాలు – వీధి దీపాలు, మారుమూల గ్రామాల విద్యుదీకరణకు కూడా బ్యాంకు రుణాలు అందజేస్తున్నారు. వ్యక్తిగత గృహావసరాలకు రూ. 10 లక్షల వరకు రుణ సదుపాయం లభిస్తుంది.
- విద్యుత్తు చట్టం, 2013 కింద పునర్వినియోగ విద్యుత్తు ఉత్పత్తి, సరఫరా చేయడానికి నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతి కూడా ఇస్తున్నారు. ■

## గమనిక:

యోజన పత్రిక యాజమాన్యం వీలైనంతవరకు సంచికను సకాలంలో పాఠకులకు అందచేయాలని కృషిచేస్తుంది. అయితే, అనేక కారణాలవల్ల, చందా కట్టిన వెంటనే పాఠకులకు పత్రికను పంపటం వీలుకాదు. చందావివరాలు మాకు చేరాలి, ఆ సమయానికి సంచిక అందుబాటులో ఉండాలి. ఈ కారణాలవల్ల ఆన్‌లైన్ చందాదారులకు ఒక్కొక్కసారి చందా కట్టిన 15, 20 రోజుల తరువాతనే సంచికను పంపటం వీలవుతుంది. యోజన తెలుగు పత్రికకు 20వ తేదీ తరువాత అందిన చందాలకు, ఆ తరువాత నెలనుండే సంచికను పంపడం వీలవుతుంది. పత్రికను ఎప్పుడూ, సాధారణ పోస్టు ద్వారానే పంపుతాము. దీనికి రికార్డేమీ ఉండదు. ఒకవేళ ఎవరికైనా పత్రిక అందకపోతే, బదులుగా మరో సంచికను పంపడం లేదా చందాను సర్దుబాటు చేయడం వీలుకాదు. చందాదారులే తమ చిరునామా సరిచూసుకోవడం, స్థానిక పోస్టుమ్యాన్‌తో మాట్లాడటం చేయాలి. గమనించగలరు.

– సీనియర్ సంపాదకుడు

ప్రత్యేక వ్యాసం

# యువత భాగస్వామ్యంతో సామాజికాభివృద్ధి

- అమరేంద్రకుమార్ దూబే



**భారత దేశం సంస్కృతి, జాతీయత, భాష, సమాజం, మతం తదితరాల సమాహారమైన ఒక వైవిధ్యంగల జాతి. సమాచార సాంకేతికత (ఐటీ) వినియోగంతోపాటు తామెదుర్కొంటున్న వివిధ సమస్యలపై యువతరం భావాలు, దృక్పథాలు దేశవ్యాప్తంగా దాదాపు ఒకే తరహాలో ఉంటు న్నాయి. అభివృద్ధి, సమాచార ఆదానప్రదానం, కార్యకలాపాలు, అవకాశాలు తదితరాల గురించి స్థానికత, జాతీయతలతో నిమిత్తం లేకుండా తమ సమర్థతను చాటుకునే రీతిలో నేటి యువత ఏకస్వరంతో చర్చిస్తోంది.**

"యువతరం అంటే 15-29 సంవత్సరాల మధ్య వయోవర్గంలోని వ్యక్తుల సమూహం" అని జాతీయ యువజన విధానం-2014 నిర్వచిస్తోంది. కానీ, యువతను ఒక ఏకరూప వర్గంగా వ్యవహరించడం వీలుకాదు.. సమాజం నుంచి ఉద్భవించే పలు కారణాలు, సాంస్కృతిక నేపథ్యం, సామాజిక-ఆర్థిక స్థాయి, విద్యాస్థాయి, వారివారి భౌగోళిక ప్రాంతాలు, వారి భావనలు-ఆకాంక్షల ప్రాతిపదికగా యువతను ఒక వైవిధ్య సమూహంగా పరిగణించాలి. "యువతరం" అనే పదానికి మూడు స్పష్టమైన భావగర్భిత అర్థాలున్నాయి: మొదటిది... నిర్దిష్ట వయోవర్గానికి సంబంధించినది; రెండోది... విద్యా-ఉపాధి స్థాయుల దృష్ట్యా రూపాంతరీకరణ చెందే వ్యక్తుల వర్గాన్ని సూచించేది; మూడోది-ముఖ్యమైనది... ప్రత్యేక సాంఘిక, సాంస్కృతికపరమైనదేగాక వారి జీవితాన్ని ప్రభావితం చేసే మనశ్శరీర లక్షణాంశాలకు సంబంధించినదిగానూ పేర్కొనవచ్చు.

అయితే, కేవలం ఓ నిర్దిష్ట సమూహంలో భాగమైనంత మాత్రాన దానికి పూర్తి అర్థం అదేనని చెప్పలేం. యవ్వనంలో ఉన్న సందర్భంలో ఇది యవ్వన సమూహంగా ఉంది.. ఇది కౌమారదశ నుండి యవ్వనం వరకు, నైపుణ్యం లేదా విద్య నుండి ఉద్యోగానికి సాక్షిగా ఉంటుంది. యువతరానికి అన్వయంరీత్యా కౌమారం నుంచి యవ్వన దశకు; విద్య లేదా నైపుణ్యం నుంచి ఉపాధి దశకు రూపాంతరం చెందుతున్న వయోవర్గంగా పరిగణించడం అత్యంత ముఖ్యం. యువతరమంటే- తమను తాము నడిపించుకుంటూ, తమకు ఆసక్తిగల రంగాన్ని అర్థవంతంగా అన్వేషించుకుని దానితో మమేకం కావడంద్వారా తమ ఆశలు-ఆకాంక్షలను సాకారం చేసుకునే దిశగా స్వయంకృషికి ప్రాధాన్యమిచ్చే వయోవర్గం. ఇందులో విస్తృత కార్యకలాపాలు అంతర్భాగంగా ఉంటాయి. అవి మాధ్యమిక, తృతీయ రంగ కార్యకలాపాలు కావచ్చు లేదా ప్రజా శ్రేయస్సు ప్రధానమైనవి కావచ్చు లేదా స్వతంత్ర వృత్తులకు సంబంధించినవి కావచ్చు. ఈ ప్రక్రియలో యువతకు నైపుణ్య శిక్షణ లేదా తాము కోరుకునే నైపుణ్య సంబంధ విద్యాభ్యాస అవకాశం లభించవచ్చు. దాంతోపాటు తానెంచుకున్న వృత్తిద్వారా విభిన్న జీవనోపాధి మార్గం ఏర్పరచుకునే ఆకాంక్ష ఒక భాగంగా ఉండవచ్చు. ఓసారి వృత్తిలో ప్రవేశించాక కఠోర పరిశ్రమ ద్వారా విజయం సాధించి ముందడుగు వేయాలని ఆకాంక్షించవచ్చు. సరిగ్గా ఇటువంటి దశలోనే వారి జీవితంలోని సామాజిక-సాంస్కృతిక అంశాలతోపాటు మనశ్శరీర

కార్యదర్శి, కేంద్ర యువజన వ్యవహారాలు & క్రీడల మంత్రిత్వశాఖ, న్యూఢిల్లీ.
E-mail : secy-ya@nic.in

లక్షణాంశాలు మునుపటికన్నా ఎక్కువ ప్రభావం చూపడం ప్రారంభిస్తాయి. కొన్ని సందర్భాల్లో ఆ ప్రభావం మరింత విస్తృతంగా ఉండొచ్చు. మరికొన్ని సందర్భాల్లో బలహీనపరిచే ఫలితాలు తలెత్తిన ఉదాహరణలూ ఉండొచ్చు.

### సమూహ ప్రాధాన్యాంశాలు

జాతీయ యువజన విధానం-2014లో యువతకు ప్రాధాన్య రంగాలుగా భారత ప్రభుత్వం గుర్తించిన ప్రత్యేక అంశాలివే. అలాగే ఈ విధానం గుర్తించిన ఆకాంక్షలు, ప్రాథమ్యాంశాలు కిందివిధంగా ఉన్నాయి:-

లభిస్తున్న ప్రాముఖ్యం స్పష్టమవుతోంది.

### సామాజిక విలువలకు ప్రోత్సాహం

యువతలో భాగమైన ఉత్పాదక శ్రామికశక్తి తగిన అనుభవంద్వారా తమతమ జీవన మార్గాల్లో నాయకత్వ స్థాయికి ఎదుగుతుంది. భారత దేశ సంస్కృతి, జాతీయత, భాష, సమాజం, మతం తదితరాల సమాహార మైన ఒక వైవిధ్యంగల జాతి. భౌగోళిక సవాళ్లపై ఆయా సమాజాలు భిన్నరకాలుగా స్పందిస్తూ తమ జీవనశైలిని రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో భౌగోళికంగానూ భారత్ వైవిధ్యంగల దేశమే. అయితే, ఈ వైవిధ్యాలకు భిన్నంగా దేశంలోని

| లక్ష్యం | ప్రాధాన్యం |
|---|---|
| 1. భారతదేశ ఆర్థిక అభివృద్ధి కోసం నిలకడగా సహకరించగల ఉత్పాదక శ్రామిక శక్తిని సృష్టించడం | విద్య, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి వ్యవస్థాపకత |
| 2. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనగల శక్తియుక్తులుగల బలమైన, ఆరోగ్యకరమైన తరానికి రూపుదిద్దడం | ఆరోగ్యం, ఆరోగ్యకర జీవనశైలి క్రీడలు. |
| 3. జాతీయ స్వామ్యం నిర్మించే దిశగా సామాజిక విలువలు పాదుకొల్పడం, సంఘసేవను ప్రోత్సహించడం | సామాజిక విలువలకు ప్రోత్సాహం సామాజిక సంబంధాలు |
| 4. పరిపాలనలోని అన్ని స్థాయిలలో పౌరుల పాత్ర, భాగస్వామ్యానికి వీలు కల్పించడం | రాజకీయంసహా పరిపాలనలో భాగస్వామ్యం |
| 5. ముప్పులో ఉన్న యువతకు మద్దతు, అవకాశాలు అందని, బలహీనవర్గాల యువతకు సమానావకాశాల కల్పన | సార్వజనీనత సామాజిక న్యాయం |

పైన పేర్కొన్నవాటిలో ప్రతి ప్రాధాన్య రంగమూ ముఖ్యమైనదేగాక యువత సంపూర్ణ, నిర్మాణాత్మక ప్రగతి కోసం కృషిచేయాల్సి ఉంది. విద్య, ఉపాధి, ఆరోగ్యం, క్రీడలు వగైరాల గురించి ఇప్పటికే చాలా రాసిన, రాస్తున్న నేపథ్యంలో ఇక్కడ కేవలం రెండు ప్రాధాన్య రంగాల గురించి మాత్రమే చర్చిద్దాం:-

(i) సామాజిక విలువలకు ప్రోత్సాహం:

(ii) సమాజ సంబంధాలు:

పైన ఇచ్చిన పట్టికలోని "జాతీయ స్వామ్యం నిర్మించే దిశగా సామాజిక విలువలు పాదుకొల్పడం, సంఘసేవను ప్రోత్సహించడం" అనే లక్ష్యం కింద ఈ రెండు ప్రాధాన్య రంగాలకు

విభిన్న సమాజాలు, జాతీయతల మధ్య కొన్ని సామూహిక సారూప్యాలున్నాయి. రామాయణ, మహాభారత ఇతిహాసాలే ఇందుకు బహుశా తిరుగులేని నిదర్శనాలు. ఇవి దాదాపు అన్ని భారతీయ భాషల్లోకి అనువదించబడినా ప్రధాన కథాంశం మాత్రం యథాతథంగా కొనసాగడం విశేషం. మహాభారతంలోని ఉప కథలు (ఉపాఖ్యానాలు అంటారు) మాత్రమే ఒకే ఇతివృత్తం చుట్టూ సూక్ష్మ భేదాలతో నడుస్తాయి. ఈ అంశం ప్రాతిపదికగా వర్తమానం లోకి వస్తే... సమాచార సాంకేతికత (ఐటీ) వినియోగంతోపాటు తామెదుర్కొంటున్న వివిధ సమస్యలపై యువతరం భావాలు, దృక్పథాలు దేశవ్యాప్తంగా దాదాపు ఒకే తరహాలో ఉంటున్నాయి. అభివృద్ధి, సమాచార ఆదానప్రదానం, కార్యకలాపాలు, అవకాశాలు తదితరాల గురించి స్థానికత, జాతీయతలతో నిమిత్తం లేకుండా తమ సమర్థతను చాటుకునే రీతిలో నేటి యువత ఇవాళ ఏకస్వరంతో చర్చిస్తోంది. సామాజిక విలువల సమాహారమై, వేల ఏళ్ల నుంచి అనూచానంగా వస్తున్న ఆచారాలు-సంప్రదాయాల చుట్టూ అల్లుకున్న ఒక విభిన్న సంస్కృతే ఈ ఏకరూపతకు ప్రధాన కారణమని చెప్పవచ్చు. భారతీయ సమాజాన్ని... ప్రత్యేకించి యువతరాన్ని బద్ధుల్ని చేస్తున్న అనుసంధాన మంత్రం ఈ సామాజిక విలువలే.

### సమాజ సంబంధాలు

రెండో ప్రాధాన్య రంగం యువతకు సమాజంతో సంబంధాలు. ఇది సామాజిక విలువలతోపాటు సమాజంలోని సామాజిక-ఆర్థిక అల్లిక నుంచి ఉద్భవిస్తుంది. సామాజిక కార్యకలాపాలను జాతీయ సామాజిక సేవా పథకం (NSS), నెహ్రూ యువ కేంద్ర సంస్థ (NYKS) చేపడతాయి కాబట్టి సమాజంతో యువత సంబంధాలు వాస్తవానికి వైవిధ్య కార్యక్రమాలు వేదికగా సాగుతాయి. జనాభా నుంచి సామాజిక సేవలకోసం సమీకరించే వారిలో యువతరం ప్రాతినిధ్యమే ఎక్కువగా ఉంటుందనడం వాస్తవం.

కేంద్ర యువజన వ్యవహారాల శాఖ పరిధిలో రెండు ప్రధాన సంస్థలుంటాయి. అవే.. నెహ్రూ యువ కేంద్ర సంస్థ (NYKS), జాతీయ సామాజిక సేవా పథకం (NSS). యువతను సామాజిక సేవలో స్వచ్ఛంద భాగస్వాములను చేయడంలో ఈ సంస్థలు ఎంతగానో దోహద పడతాయి. యువతరంలో స్వచ్ఛంద సేవపై అవగాహన పెంచడంపైనే వారు ఇందులో పాల్గొనడమన్నది ప్రధానంగా ఆధారపడి ఉంటుంది. అంటే యువతరం స్వచ్ఛందంగా సమాజ సేవకు అంకితం కావడమన్న మాట. ఈ అవగాహన కల్పన నిర్బంధ సైనిక శిక్షణలా కాకుండా అంకిత భావంతో సమాజ సేవా కార్యకలాపాల్లో పాల్గొనేందుకు ప్రేరేపించేదిగా

ఉండాలి. NSS లేదా NYKS స్వచ్ఛంద కార్యకర్తలు సంప్రదాయేతర రంగాలలో కార్యకలాపాలు చేపట్టిన నేపథ్యంలో ఈ అంశానికి ప్రాధాన్యం ఏర్పడింది. పరిస్థితులకు అనుగుణంగా యువత స్పందించే వ్యవస్థలోనే సామాజిక విలువలు ముందుకొచ్చి అటువంటి కార్యకలాపాలద్వారా వారిమధ్య అనుబంధాన్ని ఏర్పరుస్తాయి.

నెహ్రూ యువ కేంద్ర సంఘటన్

## నెహ్రూ యువ కేంద్ర సంస్థ (NYKS)

దేశంలో 1972లో శ్రీకారం చుట్టుకున్న నెహ్రూ యువ కేంద్ర సంస్థ (NYKS) ప్రపంచంలోనే అతిపెద్ద యువజన సంస్థ. ఇందులో భాగంగా 623 జిల్లాల్లో ఏర్పాటైన 1.29 లక్షల యువజన కేంద్రాల్లో ప్రస్తుతం 87 లక్షల మంది యువతీయువకులు సభ్యులుగా ఉన్నారు. యువతలో వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం... తద్వారా జాతి నిర్మాణ కార్యకలాపాల్లో వారిని భాగస్వాములను చేయడం ఈ కేంద్రాల ప్రధాన లక్ష్యం. ప్రతి జిల్లాలోని సమితులలో ఇద్దరేసి యువజన స్వచ్ఛంద కార్యకర్తలు, ఒక జిల్లాస్థాయి యువజన సమన్వయకర్తద్వారా నెహ్రూ యువ కేంద్రాలు తమ కార్యకలాపాలను నిర్వర్తిస్తుంటాయి. న్యూఢిల్లీలోని జాతీయ ప్రధాన కార్యాలయంతో పాటు రాష్ట్రస్థాయిలో 29 జోనల్ కార్యాలయాలకు ఇవి అనుబంధంగా ఉంటాయి. ఇవన్నీ చేపట్టే కార్యకలాపాల్లో కొన్నిటిని దిగువన క్లుప్తంగా వివరించాం:-

### (i) యువజన నాయకత్వం-సామాజిక ప్రగతిపై శిక్షణ:

అర్థవంతమైన జీవితం గడిపే విధంగా, జాతి నిర్మాణానికి తమవంతు సహకరించేలా ఇతరులకు తోడ్పడుతూ వారిని నడపగల నాయకత్వ పాత్ర పోషించే స్థాయికి యువత సామర్థ్యాన్ని ఇనుమడింపజేయడం ఈ కార్యక్రమ ధ్యేయం. ఐదు రోజులపాటు సాగే ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను 2017-18లో 450కిపైగా నిర్వహించగా 19వేల మంది యువత ఇందులో శిక్షణ పొందారు.

### (ii) యువజన సంఘీభావం-యువ సృజన:

ఇది ప్రతి జిల్లాలోని ఎన్‌వైకేలు ఏటా నిర్వహించే కార్యక్రమం. గ్రామీణ యువజన నాయకులు తమ సృజనను ప్రదర్శించుకునే అవకాశంతోపాటు ఆత్మావిష్కరణ చేసుకునే వేదికను కల్పించడం దీని లక్ష్యం. అంతే కాకుండా యువజన సాధికారత దిశగా తమ అనుభవాలను పంచుకుంటూ ఉత్తమ ఆచరణలను సూచించేందుకూ ఈ వేదిక ఉపయోగపడుతుంది. తదనుగుణంగా 2017-18లో 300కు పైగా ఈ కార్యక్రమాలను నిర్వహించి 2,06,000 మంది యువతీ యువకులకు అవకాశం కల్పించారు.

### (iii) యువజన ఆదర్శ గ్రామీణ వికాస కార్యక్రమం:

ఎంపిక చేసిన జిల్లాల్లో ఒక్కో గ్రామాన్ని యువత కోసం యువజనమే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి ఉద్దేశించిన కార్యక్రమమిది. సదరు గ్రామాన్ని బహిరంగ విసర్జనరహితం చేయడం, రోగనిరోధక కార్యక్రమం 100 శాతం అమలు, 100 శాతం పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో చేర్చడం, పరిశుభ్రత, వ్యాధి నివారణ, ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వగైరాలు ఇందులో భాగంగా ఉంటాయి. ఏడాదిపాటు సాగే ఈ కార్యక్రమాన్ని 2017-18లో (31.12.2017వరకు) ఎంపిక చేసిన 78 జిల్లాల్లో నిర్వహించారు.

### (iv) గిరిజన యువత ఆదానప్రదాన కార్యక్రమం (TYEP):

కేంద్ర హోంశాఖ నిధులతో ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. దీనికింద వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల యువతను ఎంపిక చేసి దేశంలోని ఇతర ప్రాంతాల సందర్శనకు తీసుకెళ్తారు. తద్వారా దేశ సంస్కృతీ వారసత్వంపై వారికి అవగాహన కల్పిస్తారు. ఆ విధంగా వారు అభివృద్ధి కార్యకలాపాల గురించి తెలుసుకుంటారు. అంతేగాక దేశంలోని ఇతర ప్రాంతాల ప్రజలతో వారికి భావోద్వేగ అనుబంధం ఏర్పడాలన్నది ఈ కార్యక్రమ లక్ష్యం. తదనుగుణంగా 2017-18లో నిర్వహించిన 10 కార్యక్రమాల్లో 2వేల మంది గిరిజన యువతను భాగస్వాములను చేశారు.

### (V) ఐక్య భారతం-అత్యుత్తమ భారతం (అంతర్రాష్ట్ర యువజన ఆదానప్రదాన కార్యక్రమం):

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 140వ జయంతిని పురస్కరించుకుని ప్రధానమంత్రి 2015 అక్టోబరు 31న "ఐక్య భారతం-అత్యుత్తమ భారతం" కార్యక్రమాన్ని ప్రకటించారు. మన దేశానికి ప్రత్యేకమైన "భిన్నత్వంలో ఏకత్వాన్ని" మరింత ఉద్దీపింపజేసుకోవడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. అలాగే ప్రజల మధ్య సంప్రదాయకంగా కొనసాగుతున్న భావోద్వేగ అనుబంధాలను కొనసాగించడం, బలోపేతం చేయడం దీని ధ్యేయం. తద్వారా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నడుమ నిరంతర నిర్మాణాత్మక కార్యకలాపాలకు ఊతమిస్తూ జాతీయ సమగ్రత స్ఫూర్తిని ప్రోత్సహించాలన్నది ఆశయం. ఇందులో భాగంగా ఆయా రాష్ట్రాల సుసంపన్న సంస్కృతి, ఆచార-సంప్రదాయాలను ఇతర రాష్ట్రాల ప్రజలు అవగతం చేసుకుని, దేశంలోని భిన్నత్వంపై సదభిప్రాయం పెంచుకునే విధంగా ఏడాదిపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ పాలన సమన్వయంతో ఈ కార్యక్రమ నిర్వహణ సాగుతుంది.

అంతర్రాష్ట్ర యువజన ఆదానప్రదాన కార్యక్రమం "ఐక్య భారతం-అత్యుత్తమ

భారతం"ను నెహ్రూ యువ కేంద్ర సంస్థ 2017-18లో 15 రాష్ట్రాల పరిధిలో నిర్వహించింది. ఈ మేరకు తెలంగాణ-హరియాణా, హిమాచల్‌ప్రదేశ్; తమిళనాడు-జమ్ముకశ్మీర్; ఒడిసా-మహారాష్ట్ర; ఝార్ఖండ్-గోవా; కర్ణాటక-ఉత్తరాఖండ్; మేఘాలయ-ఉత్తరప్రదేశ్; సిక్కిం-ఢిల్లీ; మణిపూర్-మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలు పరస్పరం యువజన ఆదానప్రదాన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాయి.

**(vi) ఇతర కార్యకలాపాలు:**

కేంద్రంలోని వివిధ మంత్రిత్వ శాఖలతో సంయుక్తంగా మొక్కలు నాటడం, రక్తదాన శిబిరాల నిర్వహణ, స్వచ్ఛంద రక్తదాతల నమోదు, పిల్లలకు-తల్లులకు వ్యాధి నిరోధక టీకాలు (ఇంద్రధనుస్సు కార్యక్రమం), అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణ వంటి కార్యకలాపాలను నెహ్రూ యువ కేంద్ర సంస్థ చేపడుతూంటుంది. తాజాగా ప్రస్తుతం దేశవ్యాప్తంగా అమలవుతున్న స్వచ్ఛ భారత్ పథకం కింద తాగునీరు-పారిశుధ్య మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో యువతకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో భాగంగా స్వచ్ఛత సంబంధిత సమస్యలు, ఆరోగ్యం-పరిశుభ్రతల గురించి అవగాహన కల్పించే కార్యక్రమాల్లో యువత 100 గంటలపాటు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. అదేవిధంగా జలవనరుల శాఖ పర్యవేక్షణలో "పరిశుద్ధ గంగ ఉద్యమం" కింద "నమామి గంగ" కార్యక్రమంలోనూ ఎన్‌వైకెఎస్ సభ్యులైన యువజనులు భాగస్వాములయ్యారు.

**జాతీయ సేవా పథకం (NSS):**

స్వచ్ఛంద సమాజ సేవద్వారా విద్యార్థి యువజనంలో వ్యక్తిత్వ వికాసం, గుణగణాల పెంపు ప్రధాన లక్ష్యంగా 1969లో జాతీయ సేవా పథకం (**NSS**) ప్రారంభమైంది. 'సేవద్వారా విద్య' అన్నది ఎన్ఎస్ఎస్ ధ్యేయం. మహాత్మా గాంధీ ఆదర్శాల స్ఫూర్తే NSS సైద్ధాంతిక నేపథ్యం. తదనుగుణంగానే "నేను కాదు... నీవు ముందు" అన్న నినాదంతో 1969లో దేశంలోని 37 విశ్వవిద్యాలయాల్లో సుమారు 40వేల మంది కార్యకర్తలతో NSS ప్రారంభమైంది. ప్రస్తుతం 391 విశ్వవిద్యాలయాలు, 2 విద్యామండళ్లు, 16,278 ఉన్నత మాధ్యమిక పాఠశాలల్లో 39,695 శాఖలతో ఏకంగా 36.6 లక్షల మంది కార్యకర్తల మహాదళంగా NSS బహుముఖంగా విస్తరించింది.

ప్రాథమిక స్వరూప/కార్యక్రమ నిర్మాణం: ఈ పథకం కింద ప్రతి విద్యాసంస్థలో కనీసం 100 మంది విద్యార్థి కార్యకర్తలతో కూడిన ఒక శాఖ ఉండాలన్నది ఎన్ఎస్ఎస్ స్వరూప నిర్దేశం. ఈ శాఖకు కార్యక్రమాధికారి (PO) హోదాలో ఒక ఉపాధ్యాయుడు నేతృత్వం వహించాలి. ప్రతి శాఖ తమ కార్యకలాపాల కోసం ఒక నిరుపేదల దుర్భర ఆవాసం (మురికివాడ) లేదా గ్రామాన్ని ఎంపిక చేసుకోవాలి. అక్కడ ప్రతి విద్యార్థి కార్యకర్త ఏడాదికి కనీసం 120 గంటల మేర రెండేళ్లపాటు (మొత్తం 240 గంటలు) సేవలందించాలి. దీంతోపాటు దత్తత తీసుకున్న పట్టణ మురికివాడ లేదా గ్రామంలో ఎన్ఎస్ఎస్ శాఖ వారంపాటు నిర్వహించే ప్రత్యేక శిబిరానికి ప్రతి విద్యార్థి కార్యకర్త హాజరుకావాలి.

**ఎన్ఎస్ఎస్ కింద చేపట్టే కార్యకలాపాల స్వభావం:**

సమాజ సేవ చేయడమే ఎన్ఎస్ఎస్ కీలక కార్యకలాపం. ఇందులో భాగంగా సంబంధిత సమాజ అవసరాలపై స్పందననుబట్టి చేపట్టాల్సిన కార్యకలాపాల కచ్చితమైన స్వభావం రూపొందుతుంది. ఈ మేరకు ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు విద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలు, మహిళల స్థాయిని పెంచే కార్యక్రమాలు, ఉత్పత్తి-ఆధారిత కార్యక్రమాలు, విపత్తులు/దుర్ఘటనల సమయంలో సహాయ-పునరావాస చర్యలు వంటి కార్యకలాపాల్లో పాలుపంచుకుంటారు. అంతేకాకుండా గణతంత్ర దినోత్సవ కవాతు శిబిరాలు, సాహస కృత్యాల శిబిరాలు, జాతీయ సమగ్రత శిబిరాలు, ఈశాన్య ఎన్ఎస్ఎస్ వేడుకలు, జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా నిర్వహించే 'సువిచార్', 'యువ సదస్సు'లు వంటి కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**స్వచ్ఛంద కార్యక్రమాలకు కొన్ని ఉదాహరణలు:**

స్వచ్ఛంద సామాజిక కార్యకలాపాల నుంచి కొన్ని ప్రయోజనాలను ఆశించవచ్చు. యువతరం తమ చుట్టూ ఉన్న సమాజం గురించి తెలుసుకోవడానికి, అవగాహన పెంచుకోవడానికి ఇది దోహదపడుతుంది. అలాగే సమాజంలోని మంచిచెడులతోపాటు కష్టనష్టాలను అధ్యయనం చేసే అవకాశం కల్పిస్తుంది. నిర్దిష్ట పరిస్థితి లేదా సమస్యను విశ్లేషించి తదనుగుణ పరిష్కార మార్గం అనుసరించడానికి అవసరమైన క్షేత్రస్థాయి చైతన్యాన్ని పెంచుతుంది. ఒకసారి క్షేత్రస్థాయి వాస్తవాలను గ్రహించిన యువత ఆ అంశాలపై తమ దృక్పథాన్ని మరింత విస్తరించుకోగలదు. తార్కిక జ్ఞానం, సముచిత ప్రవర్తన అలవరచుకోవడంలోనూ తోడ్పడుతుంది. ఒకచోట గమనించిన అంశమే మరోచోట దానికి పూర్తి విరుద్ధంగా ఉండవచ్చునని అర్థం చేసుకోవడంతోపాటు ఆయా పరిస్థితులనుబట్టి రెండూ సరైనవేనని కార్యకర్తలు అర్థం చేసుకోవడం ప్రారంభిస్తారు. ఇతరుల దృక్పథాలను తెలుసుకోవడంలోనూ సమాజ సేవ తోడ్పడుతుంది. సంక్షిప్తంగా చూస్తే... కౌమారం నుంచి యవ్వన పరివర్తన దశలోకి రూపాంతరం చెందుతున్న వారి సమస్యలను పరిష్కరించడంలో కీలకమైన 'భావోద్వేగ స్థాయి'ని స్వచ్ఛంద కార్యకర్తృత్వం పెంపొందిస్తుందని చెప్పవచ్చు.

నెహ్రూ యువ కేంద్ర/ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు చేపట్టిన అటువంటి కార్యకలాపాలకు ఉదాహరణలే ఈ వాస్తవాన్ని స్పష్టం చేస్తాయి:

### (i) గిరిజనాభివృద్ధి పథకం (GVP):

గిరిజనులను జాతీయ జీవన స్రవంతిలో మమేకం చేయడంలో విద్య/అక్షరాస్యతలు పోషించగల పాత్రను గుర్తించిన నేపథ్యంలో కేరళలోని పాలక్కాడ్ జిల్లా నెహ్రూ యువ కేంద్ర సంస్థ శాఖ అక్కడి పాలన యంత్రాంగం తోడ్పాటుతో గిరిజనాభివృద్ధి పథకాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేసింది. ఇందులో భాగంగా మలంపుళ గ్రామంలో 1.5 ఎకరాలలో గిరిజనాభివృద్ధి ప్రాంగణాన్ని ఏర్పాటు చేసింది. ఇక్కడ విద్య-పరిపాలన భవనాలతోపాటు బాలబాలికల వసతిగృహ సదుపాయం కూడా కల్పించింది. కేరళ రాష్ట్ర అభివృద్ధి శాఖ ఈ పథకానికి మద్దతిచ్చింది.

ఈ ప్రాజెక్టు కింద ఎస్సెస్సెల్సీ, ఇంటర్ ఫెయిలైన గిరిజన విద్యార్థుల కోసం విద్య, సహ-పాఠ్య కార్యకలాపాలకు అనువైన సానుకూల వాతావరణం కల్పించారు. ఆ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా 10 నెలలపాటు ఆశ్రమ శిక్షణ సదుపాయం కల్పించారు. అదే సమయంలో గిరిజన యువత మనసులోని న్యూనత భావాన్ని తొలగించడం కూడా ఈ కార్యక్రమంలో భాగం. ఆ మేరకు పరిశుభ్రత, క్రమశిక్షణ, కఠోర పరిశ్రమవంటి జీవన విధానాలను అలవరచడంద్వారా వారిలో వ్యక్తిత్వ వికాసానికి కృషిచేశారు.

సాధారణ ఎస్సెస్సెల్సీ పాఠ్యాంశ ప్రణాళికతోపాటు ఆ విద్యార్థులకు ఆంగ్ల భాష, కంప్యూటర్ వాడకంలో తర్ఫీదు ఇచ్చారు. యోగాభ్యాసం, క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాల్లో భాగస్వాములను చేశారు. వివిధ ఆరోగ్య, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు. సామాజిక మేధావులు, ప్రసిద్ధ సాహితీవేత్తలు, రాజకీయ నాయకులు, అధికారుల ప్రసంగాలు వినడంతోపాటు వారితో సమాలోచనలకు వీలు కల్పించారు. గిరిజనాభివృద్ధి పథకం కింద చేపట్టిన ఈ కృషి విశేషంగా ఫలించి ఎస్సెస్సెల్సీ పరీక్షకు హాజరైన బాలబాలికలలో 88 శాతం ఉత్తీర్ణులయ్యారు.

### (ii) మాదకద్రవ్య వినియోగం- మద్యపాన నిరోధం (NYKS):

"మాదకద్రవ్య వినియోగం-మద్యపాన నిరోధంపై చైతన్యం, అవగాహన కల్పన" పేరిట ఎన్‌వైకేఎస్ ఒక ఏడాదిపాటు ప్రయోగాత్మక కార్యక్రమం నిర్వహించింది. సామాజిక న్యాయం-సాధికారత కల్పన మంత్రిత్వ శాఖ ఇందుకు ఆర్థిక తోడ్పాటు అందించింది. పంజాబ్‌లోని 10 జిల్లాల్లోగల 75 సమితుల పరిధిలోని 3వేల గ్రామాల్లోనూ, మణిపూర్ రాష్ట్రంలోని 7 జిల్లాల్లోగల 25 సమితుల పరిధిలోని 750 గ్రామాల్లోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కౌమార-యౌవన దశలోని యువత, అధిక ముప్పు బారినపడే, వ్యసనపరులయ్యే అవకాశమున్న బృందాలతోపాటు వారి కుటుంబాలు, సామాజిక సభ్యులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అదే సమయంలో గ్రామాల్లోని ఎన్‌వైకేఎస్ యువజన శాఖలు, మహిళా సంఘాలు, పంచాయతీలు, స్థానిక రాజకీయ, ఆధ్యాత్మిక నాయకులు, గ్రామ ప్రముఖులు, సేవా ప్రదాతల వంటి వైవిధ్య భాగస్వాముల మద్దతు, భాగస్వామ్యాన్ని సమీకరించారు. వారి సహాయ సహకారాలతో మాదకద్రవ్య వినియోగం, మద్యపానం వంటి వ్యసనాలతో తలెత్తే దుష్పరిణామాలపై సామూహిక అవగాహన కల్పించారు.

మద్యపానం, మాదకద్రవ్య వినియోగం కారణంగా సంభవించగల ముప్పును విశదీకరించి, వాటి నిరోధం దిశగా ఇటు లక్షిత వర్గాలతోపాటు అటు భాగస్వాములలోనూ చైతన్యం, అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధానోద్దేశం. అలాగే ఇప్పటికే ఈ వ్యసనాల బారినపడిన వారికి వాటినుంచి బయటపడేందుకు తగిన వృత్తిపరమైన సాయం అందించి ఆరోగ్యకర, అర్థవంతమైన జీవనం దిశగా నడిపించాలన్న లక్ష్యం కూడా పెట్టుకున్నారు. ఈ మేరకు శిక్షణ పొందిన 37,500 మంది గ్రామీణ యువజన సంఘాల సభ్యులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. వ్యక్తిగత సంబంధాలు, సహచరులకు అవగాహన కల్పన కార్యక్రమం చేపట్టి 3,75,000 మంది యువజనానికి అవగాహన కల్పించారు. అంతేగాక మాదకద్రవ్యాలకు లేదా మద్యపానానికి బానిసలైన 62,654 మంది వ్యక్తులను గుర్తించారు. దీంతోపాటు సదరు వ్యసనాల దుష్పరిణామాలపై గ్రామీణ సమాజాల్లో సామూహిక అవగాహన కల్పన, సమీకరణ, సమాచార ఆదానప్రదానం, చైతన్య-ప్రేరణ కల్పన దిశగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.

### (iii) నమామి గంగే-యువతరం (NYKS):

జాతీయ సంపద అయిన గంగానది ప్రక్షాళన-పునరుజ్జీవం, నదీజల కాలుష్య నివారణలపై సామూహిక అవగాహన కల్పన దిశగా జాతీయ గంగా పరిశుభ్ర కార్యక్రమం-NMCG నిర్వహణ వ్యవస్థతో 2015 జూన్ 8న నెహ్రూ యువకేంద్ర సంస్థ-NYKS ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. తదనుగుణంగా "నమామి గంగ కార్యక్రమంలో యువత భాగస్వామ్యం" పేరిట ఒక పథకాన్ని అమలు చేయడం ప్రారంభించింది. సుశిక్షితులైన, అత్యున్నత ప్రేరణ పొందిన స్థానిక యువశ్రేణులను రూపొందించడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. అన్నిరంగాలకు చెందిన ప్రజలలో నదీజలాల పరిశుభ్రత, ప్రక్షాళనపై అవగాహన కల్పించి, వారి మద్దతు సమీకరించడం, లక్షిత వర్గాలలో జల కాలుష్యం-దుష్పరిణామాలతోపాటు వాటి నివారణపై చైతన్యం తేవడం కూడా అందులో భాగమే. అంతేగాక గంగానదీ ప్రక్షాళనకు ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన పథకాలు, సేవల గురించి సమాచారం అందించే కర్తవ్యం నిర్వర్తించారు. గంగా పరీవాహక ప్రాంతం వెంబడిగల ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని 29 జిల్లాల్లోగల 1,203

పంచాయతీల్లోని 2,336 గ్రామాల్లో ఈ పథకం అమలవుతోంది. ఇందుకోసం గంగా తీరంలోని గ్రామాల్లో 13 వేల మంది "గంగా దూత"లు సభ్యులుగా 2,426 యువజన సంఘాలను ఏర్పాటు చేశారు.

### (iv) జల నాణ్యత సమస్యలు:

ఝార్ఖండ్ రాష్ట్రం జంషెడ్‌పూర్‌లోని కరీం సిటీ కళాశాలలోగల జాతీయ సేవా పథకం (NSS) శాఖ కార్యకర్తలైన విద్యార్థులు ఒక దత్తత గ్రామంలో ప్రజలు ఉపయోగించే తాగు, వాడకపు నీటి వనరులలోని జల నాణ్యత పరీక్ష నిర్వహించారు. ఈ మేరకు ఆయా వనరుల నుంచి సేకరించిన నీటిని తమ కళాశాల రసాయనశాస్త్ర ప్రయోగశాలలో పరీక్షించి జిల్లా యంత్రాంగానికి నివేదిక అందజేశారు. దీని ఆధారంగా జిల్లా అధికారులు పునఃపరీక్ష నిర్వహించి, జల కాలుష్య నివారణకు అవసరమైన చర్యలు చేపట్టడంద్వారా ప్రజలకు రక్షిత మంచినీరు అందించారు.

### (v) అళగప్ప చెట్టియార్ ప్రభుత్వ ఇంజనీరింగ్-సాంకేతిక కళాశాల కారైక్కుడి, తమిళనాడు (NSS):

ఈ కళాశాలలోని NSS శాఖ విద్యార్థి కార్యకర్తలు పలవాంగుడి గ్రామంలో నీటి పారుదల కాలువలు, ఆక్రమణలపై సర్వే నిర్వహించారు. అనంతరం ఈ కాలువలను అన్ని చెరువులతో అనుసంధానించడంపై విశ్లేషణ రూపొందించారు. ఇందులో భాగంగా కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన స్థానిక కేంద్రం సాయంతో గ్రామపు సమోన్నత రేఖాపటాన్ని తయారుచేశారు. అంతేకాకుండా స్థానిక ప్రజల సాయంతో కాలువలు లోతు చేయడం, ఆక్రమణలతోపాటు చెత్త తొలగింపు వంటి కార్యక్రమాలు చేపట్టారు. వారి కృషి ఫలించి అన్ని చెరువులూ వర్షపు నీటితో పూర్తిగా నిండాయి. జల ప్రవాహానికి అనువుగా అన్ని కాలువలనూ పూర్తిస్థాయిలో చదునుచేశారు. ఇలా వాన నీటి సేకరణ-సంరక్షణకు చేసిన కృషివల్ల గ్రామ ప్రజల నీటి అవసరాలు తీరడంతోపాటు నీటి కొరత సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది (దినమలర్ వార్తాపత్రిక, మదురై సంచికలో ప్రచురితం).

### (vi) సిద్ధి ఉద్ధరణ పథకం (NSS):

అహ్మదాబాద్ నగర శివారులోని సిద్ధి మురికివాడ సిద్ధి ముస్లింలు నివసిస్తుంటారు. దాదాపు దశాబ్దంపైగా ఈ బస్తీ చెత్త కుమ్మరించే ప్రదేశంగా ఉండటంతో అక్కడి జనజీవనం దుర్భరంగా ఉండేది. ఈ పరిస్థితుల్లో సారస్‌పూర్ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలోని NSS శాఖ సిద్ధి బస్తీని దత్తత తీసుకుంది. అటుపైన అక్కడి చెత్త, మురికిని తొలగించేందుకు NSS విద్యార్థి కార్యకర్తలు ప్రశంసనీయంగా కృషిచేశారు. అక్కడ మళ్లీ చెత్త గుట్టలు పడకుండా చూడటం కోసం పరిశుభ్రత ఉద్యమాన్ని ప్రారంభించి ఆ ప్రదేశమంతా చక్కగా, శుభ్రంగాఉండేలా చేశారు. అలా NSS కార్యకర్తల నాలుగేళ్ల నిరంతర కఠోర పరిశ్రమ ఫలితంగా నగరశివారుగా ఉన్న సిద్ధి బస్తీ చెత్తరహిత ప్రదేశంగా రూపుదిద్దుకుంది. విద్యార్థుల సామాజిక సేవ కారణంగా 300 మందికిపైగా సిద్ధి ముస్లింలు, సమీప కళాశాలకు చెందిన 200 మందికిపైగా విద్యార్థులు లబ్ధిపొందారు. ఆ బస్తీలోని ఇళ్లను సారస్‌పూర్ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల NSS కార్యకర్తలు శుభ్రం చేయడమేగాక వాటికి రంగులు కూడా వేశారు. అక్కడి మరుగుదొడ్లను నవీకరించి, వాడకానికి అనువుగా తయారుచేశారు. దీంతోపాటు "సిద్ధి ధమాల్" జానపద నృత్యాన్ని ప్రోత్సహించడంలోనూ NSS శాఖ ఎంతగానో తోడ్పడింది. అలాగే కంప్యూటర్ విద్యా కార్యక్రమాలు నిర్వహించి బాలికలుసహా 200 మందికిపైగా సిద్ధి విద్యార్థులకు శిక్షణ ఇచ్చింది. సిద్ధి బస్తీలో ఇళ్ల ముంగిటనే శిక్షణకు వీలు కల్పించి ఆటపాటలు, సాంస్కృతిక కార్య కలాపాల ద్వారా అక్కడి బాలికలు, మహిళలు, పిల్లలకు ''వినోదంతో విద్యాభ్యాసం'' చేయించారు.

### (vii) ఎల్ఈడీ బల్బుల శిబిరం (NSS):

కేరళలోని డైరెక్టరేట్ ఆఫ్ వొకేషనల్ హయ్యర్ సెకండరీ ఎడ్యుకేషన్ పరిధిలోని NSS శాఖలు 14 జిల్లాల్లో విడతలవారీగా రెండేసి రోజుల వంతున 308 వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించాయి. ఇందులో భాగంగా ఎల్ఈడీ బల్బుల తయారీ, ఇళ్లలో పాడైన-పారేసిన ఎల్ఈడీ బల్బుల సేకరణ-మరమ్మతు వంటి వినూత్న పథకాలు, కార్యక్రమాలు చేపట్టాయి. దీంతోపాటు ఆ బల్బులను సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు పంపిణీ చేసే బాధ్యతను కూడా స్వీకరించాయి. విద్యుత్ వినియోగంలో పొదుపుపై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. వీటన్నిటినీ విజయవంతం చేసే దిశగా ఎల్ఈడీ బల్బుల తయారీ, మరమ్మతు పనుల్లో కేరళ ఇంధన నిర్వహణ కేంద్రం NSS కార్యకర్తలకు 4 గంటలపాటు శిక్షణ ఇప్పించింది. అనంతరం వేసవి శిబిరాల నిర్వహణలో 15,400 మంది NSS కార్యకర్తలు, 308 మంది ప్రాజెక్టు అధికారులు పాలుపంచుకున్నారు. ■

**యోజన చందాదారులకు సూచన:**

యోజన తెలుగు మాస పత్రిక డిజిటలైజ్ అయింది. దీనితో ఒక సంవత్సర చందాదారునికి సాలుకు 12 సంచికలు పంపటానికి మాత్రమే వీలవుతుంది. అనగా ఇప్పటి వరకు జరుగుతున్నట్లుగా సంచిక అందలేదని తెలిపితే మరో కాపీని పంపటానికి ఇకపై వీలవదు. కనుక చందాదారులు తమ చిరునామాకు సంబంధించిన పోస్టల్ విభాగంతో తమ ఏర్పాట్లు తామే గట్టిగా చేసుకోవాలి, గమనించగలరు.

**- సీనియర్ ఎడిటర్**

**రెట్టింపు రాబడి**

**విశిష్ట వ్యాసం**

# రైతు సంక్షేమానికే అధిక ప్రాధాన్యత

- డాక్టర్ జగ్‌దీప్ సక్సేనా




ఉత్తమ పంట ఉత్తమ ఈ-నామ్
ఈ-జాతీయ వ్యవసాయ మార్కెట్ (నామ్)

**మన దేశంలో 85 శాతంపైగా రైతులు చిన్న, సన్నకారు రంగాలకు చెందినవారు. వీరికి మార్కెట్‌లో అమ్మకానికి ఉండే మిగులు ఉత్పత్తి తక్కువ. ఇందుకు వారు ఎక్కువ మొత్తంలో మార్కెట్ లావాదేవీల ఖర్చు భరించవలసి ఉంటుంది. దీనితో కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చరల్ మార్కెట్ (ఈ-నామ్)ను 2015లో ప్రవేశపెట్టింది. అనుమతులు, పన్నులకు సంబంధించిన ఇబ్బందులను తొలగించి ,రైతుల రాబడి పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. సుమారు 99 లక్షల మందికి పైగా రైతులు, లక్ష మంది ట్రేడర్లు ఈ సౌకర్యాన్ని చురుకుగా ఉపయోగించుకుంటున్నారు.**

కష్టపడి పనిచేసే కోట్లాదిమంది రైతులు భారతీయ ఆర్థిక వ్యవస్థకు మూలాధారం. అయితే వారి సంక్షేమానికి సంబంధించిన అంశం మాత్రం ఎంతో కాలం ఎవరికీ పట్టని అంశంగా ఉంటూ వచ్చింది. అయితే, కేంద్రంలో కొత్తగా కొలువుదీరిన, వివిధ సమస్యలపట్ల సున్నిత స్పందన కలిగిన కేంద్ర ప్రభుత్వం సామాజికంగా, ఆర్థికంగా ఎంతో కీలకమైన ఈ సమస్యను 2014లో ప్రాధాన్య తాంశంగా స్వీకరించింది. అప్పటినుంచి వ్యవసాయ అభివృద్ధికి, రైతు సంక్షేమమే కేంద్రంగా గల విధానాలను అనుసరిస్తున్నందు వల్ల గ్రామీణ ప్రజల రాబడి పెరగడంతోపాటు వారికి ఉపాధి అవకాశాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. ఫలితంగా వారు సుసంపన్నత సాధిస్తున్నారు. దీనికితోడు, ప్రధానమంత్రి, 2022 నాటికి, అంటే భారతదేశం తన 75వ స్వాతంత్ర్యదినోత్సవం జరుపుకునే నాటికి రైతుల రాబడిని రెట్టింపు చేసేందుకు గట్టి పిలుపు నిచ్చారు. ఇందుకు అనుగుణంగా, రైతుల రాబడిని పెంచేందుకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ ఏడు అంశాల వ్యూహాన్ని రూపొందించింది. ఇందులో రైతుల రాబడి పెంచే కీలక , ప్రాధాన్యతా అంశాలు ఉన్నాయి. పెట్టుబడి వ్యయాన్ని సమర్థంగా వినియోగించుకుంటూ, పంట భూముల దిగుబడిని ప్రతి యూనిట్‌కూ పెంచే చర్యలు చేపట్టడం జరిగింది. పంట చేతికి వచ్చిన తర్వాత తలెత్తే నష్టాలను గణనీయంగా తగ్గించడం, విలువ జోడింపు, వ్యవసాయ మార్కెటింగ్‌లో మార్పులు, ప్రధాన రిస్క్‌ల నుంచి తగిన భద్రత, వివిధ వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల (పండ్ల తోటల పెంపకం, పశుగణాభివృద్ధి, మత్స్యపరిశ్రమ, చేపల పెంపకం, తేనెటీగల పెంపకం, కోళ్లపెంపకం, సమీకృత వ్యవసాయం) వంటి వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టడం వంటివి ఈ వ్యూహంలో ప్రధానమైనవి.

### మార్కెటింగ్ మంత్ర

ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌లో (2018-19) ప్రభుత్వం 23 ప్రధాన రబీ, ఖరీఫ్ పంటల మద్దతు ధరను, వాటి ఉత్పత్తి ఖర్చుకు సుమారు ఒకటిన్నర రెట్లు ఉండేటట్టు చూసేలా గొప్ప నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ ప్రకటనకు అనుగుణంగా బహిరంగ మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు వాటి మద్దతు ధర కంటే తక్కువ ధరకు పడిపోయినా సరే వాటిని కనీస మద్దతు ధరకు కొనేందుకు సంబంధించిన యంత్రాంగం ఉండాలి. ఈ అంశాన్ని దృష్టిలోపెట్టుకుని ఇందుకు సంబధించి వివిధ రాష్ట్రప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వంతో

మాజీ ప్రధాన సంపాదకులు (హిందీ) భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసిఎఆర్) న్యూఢిల్లీ.
E-mail : jgdsaxena@gmail.com


సంప్రదించి అనుకూల పరిస్థితులలోనూ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ఒక వ్యవస్థకు రూపకల్పన చేసే అధికారాన్ని నీతి ఆయోగ్‌కు అప్పగించడం జరిగింది. అధిక దిగుబడి సందర్భాలలో కూడా వ్యవసాయదారుల నుంచి మిగులు ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. "భవాంతర్ భుగ్‌తాన్ యోజన" (ప్రైస్ డెఫిసిట్ ఫైనాన్సింగ్ స్కీమ్)ను మధ్య ప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం కింద ఎనిమిది వ్యవసాయ ఉత్పత్తుల ధరలకు మార్కెట్ హెచ్చుతగ్గుల నుంచి మధ్యప్రదేశ్ ప్రభుత్వం రక్షణకల్పిస్తుంది. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా లభించిన ప్రోత్సాహంతో ఈ పథకాన్ని ఇతర రాష్ట్రాలలో ఇలాంటి విధానాన్ని అనుసరించేందుకు సూచనలు చేయడం జరిగింది. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, డిమాండ్ అంచనా వేయడానికి,ఫ్యూచర్స్, ఆప్షన్‌మార్కెట్ వినియోగం, వేర్‌హౌస్ డిపాజిటరీ వ్యవస్థ విస్తరణ, ప్రత్యేకంగా ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన అంశాల విషయంలో సకాలంలో నిర్ణయం తీసుకోవడం వంటి వాటికి సంబంధించి తగిన విధానాలు, పద్ధతులకు రూపకల్పనకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది.

మన దేశంలో 85 శాతంపైగా రైతులు చిన్న సన్నకారు రంగాలకు చెందినవారు. వీరికి మార్కెట్‌లో అమ్మకానికి ఉండే మిగులు ఉత్పత్తి తక్కువ. ఇందుకు వారు ఎక్కువ మొత్తంలో మార్కెట్ లావాదేవీల ఖర్చు భరించవలసి ఉంటుంది. దీనితో కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చరల్ మార్కెట్ (ఈ-నామ్) ను 2015లో ప్రవేశపెట్టింది. అనుమతులు, పన్నులకు సంబంధించిన ఇబ్బందులను తొలగించి ,రైతుల రాబడి పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు 16 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలలో 585 వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీలు (ఎపిఎంసిలు,లేదా మండీలు) ఈ వేదికతో అనుసంధానమయ్యాయి. సుమారు 90 వరకు వ్యవసాయ ఉత్పత్తులు ఆన్‌లైన్ ద్వారా ట్రేడ్ అవుతున్నాయి. సుమారు 99 లక్షల మందికి పైగా రైతులు, లక్ష మంది ట్రేడర్లు ఈ సౌకర్యాన్ని చురుకుగా ఉపయోగించుకుంటున్నారు. ఈ పద్ధతి కింద లావాదేవీలు వివిధ ప్రాంతీయ భాషలలో జరపడానికి కూడా వీలుంది. అయితే ఎపిఎంసిలు అందుబాటులేని రైతులకు ఈ నామ్ ప్రయోజనాలు అందడం లేదు. దీనిని గమనించి ఇటీవల కేంద్రప్రభుత్వం, 22,000 గ్రామీణ సంతలను గ్రామీణ వ్యవసాయ మార్కెట్‌ల స్థాయికి అభివృద్ధి, వాటి స్థాయిపెంపు దిశగా సరైన చర్యలు చేపట్టింది. ఈ గ్రామీణ వ్యవసాయ మార్కెట్‌లను ఈ-నామ్‌తో ఎలక్ట్రానిక్ అనుసంధానత కల్పించారు. దీనిని ఎపిఎంసిల రెగ్యులేషన్ల నుంచి మినహాయించనున్నారు. దీనివల్ల మారుమూల ప్రాంతాలలోని రైతులు ఈ-నామ్ ప్రయోజనాలను పొందడానికి వీలు కలుగుతుంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ. 2000 కోట్ల రూపాయలతో అగ్రిమార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్‌ను మంజూరు చేసింది.

ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజన అనేది కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన మరో ప్రాధమ్య పథకం. ఇది రైతుల సంక్షేమం, వారి సుసంపన్నతకు ఉద్దేశించినది. మార్కెటింగ్ పరమైన మద్దతు నివ్వడంతోపాటు, ప్రాసెసింగ్, విలువ జోడింపు సదుపాయాలు కల్పించడం దీని లక్ష్యం. ఈ పథకం 20 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్గించడంతోపాటు, 2019-20 నాటికి సుమారు 5 లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పించనుంది. 31,400 కోట్ల రూపాయల పెట్టుబడికి అవకాశం కల్పించనుంది. ఈ పథకం ఛత్రం కింద మెగా ఫుడ్‌పార్కులు, సమీకృత శీతల గిడ్డంగులు, విలువ జోడింపునకు ఉపయోగపడే మౌలిక సదుపాయాలు, ఫుడ్ ప్రాసెసింగ్ సదుపాయాల విస్తరణ, నిల్వ సామర్థ్యాల పెంపు, ఆగ్రో ప్రాసెసింగ్ క్లస్టర్లకు మౌలిక సదుపాయాల అభివృద్ధి, రైతులకు ప్రయోజనం కలిగించే విధంగా సాగు నుంచి మార్కెట్ వరకు అన్ని రకాల అనుసంధానతలను అభివృద్ధి చేయడం వంటివి ఉన్నాయి. వివిధ రకాల పన్ను రాయితీలు కల్పించడం ద్వారా, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను ప్రోత్సహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. అగ్రి ప్రాసెసింగ్ పరిశ్రమలో నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించడం, నాబార్డ్‌లో రూ. 2000 కోట్ల రూపాయలతో ప్రత్యేక కార్పస్ నిధిని ఏర్పాటుచేసి అగ్రి ప్రాసెసింగ్ యూనిట్లకు సులభతర రుణాలు కల్పించేందుకు వీలు కల్పించడం జరిగింది. దేశ వ్యాప్తంగా ఏడాది పొడవునా విరివిగా ఉపయోగించే టమాటాలు, ఉల్లి, ఆలుగడ్డ వంటి వాటిని పెద్ద సంఖ్యలో రైతులు తమ జీవనోపాధి కోసంపండిస్తున్నారు. అయితే ఇవి త్వరగా పాడైపోయే గుణం కలిగి ఉండడం, వివిధ సీజన్లలో, వివిధ ప్రాంతాలలో దిగుబడు లలో హెచ్చుతగ్గుల కారణంగా రైతులు, వినియోగదారులకు డిమాండ్, సరఫరాకు సంబంధించి ఇబ్బందులు ఎదురౌతుంటాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ ఫ్లడ్ మాదిరిగా ఆపరేషన్ గ్రీన్స్‌ను ప్రారంభించింది. ఇందుకు 500 కోట్ల రూపాయలు కేటాయించింది. రైతులు, వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ఈ పథకం కింద అగ్రి లాజిస్టిక్స్, ప్రాసెసింగ్ సౌకర్యాలు, ఈ పంటల మార్కెటింగ్‌కు ప్రొఫెషనల్ మేనేజ్‌మెంట్ సదుపాయాలు కల్పించడం జరుగుతోంది. దీనికి తోడు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను సరళతరం చేయడం ద్వారా రైతులు ఎగుమతులకు వీలు కల్పించే పంటలను పండించడానికి ప్రోత్సాహం లభిస్తోంది.

## రైతులకు ఆర్థిక మద్దతు

బ్యాంకింగ్ రంగంలో పలు సంస్కరణలు తీసుకువచ్చినప్పటికీ, వ్యవసాయం కోసం సంస్థాగత రుణసదుపాయం పొందడంలో రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం, వ్యవసాయ రంగానికి వ్యవస్థాగత రుణసదుపాయాన్ని గణనీయంగా పెంచుతూ వస్తోంది. 2014-15 లో వ్యవసాయరంగానికి సంస్థాగత రుణసదుపాయం 8.5 లక్షల కోట్ల




రూపాయలు ఉండగా, ప్రస్తుతం అది 11 లక్షల కోట్ల రూపాయలకు పెరిగింది. ఇటీవల కిసాన్ క్రెడిట్ కార్డు సౌకర్యాన్ని మత్స్యకారులు, పశుగణాభివృద్ధి రైతులకు కూడా విస్తరింపచేశారు. ఇది వారు తమ కార్యకలాపాలకు నిర్వహణ మూలధనం సమకూర్చుకోవడానికి ఉపకరిస్తుంది. అర్హులైన రైతులందరికీ సకాలంలో, ఎలాంటి ఇబ్బందులు లేకుండా రుణం అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. స్వల్పకాలిక పంట రుణాలకు వడ్డీరాయితీ, తనఖాలేని పంట రుణాల మొత్తం పెంపు, సంయుక్త బాధ్యతా బృందాల ప్రోత్సాహం వంటి పలు చర్యలు ఇందులో భాగం. సహకార సంఘాలకు, వాటి సభ్యులకు ఆర్థిక సహాయం అందించేందుకు కేంద్రప్రభుత్వం జాతీయ సహకార అభివృద్ధి కార్పొరేషన్‌కు పెద్ద ఎత్తున నిధుల కేటాయింపును పెంచింది.

ప్రస్తుతం, రైతులలో ఎక్కువమంది భూ యజమానులు కారు. ఎక్కువమంది కౌలు రైతులు. భూ యజమానుల నుంచి భూమిని కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నవారు. వీరు పంట రుణాలను పొందలేకపోతున్నారు. ఫలితంగా కౌలు రైతులు సంప్రదాయ వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీరేటుకు, అలివిమాలిన షరతులతో రుణం తీసుకోవలసి వస్తోంది. కౌలు రైతులు ఎదుర్కొంటున్న ఈ కష్టాలను తీర్చేందుకు, భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు నీతి ఆయోగ్, వ్యవసాయ భూమిని లీజుకు ఇవ్వడానికి సంబంధించి ఒక నమూనా చట్టాన్ని రూపొందించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. దీని ఫలితంగా 2016లో ఆదర్శ వ్యవసాయ భూమి లీజింగ్ చట్టం 2016 వచ్చింది. ఇది కౌలు రైతులకు పలు ప్రయోజనాలను కల్పిస్తోంది. ప్రస్తుతం, వ్యవసాయ భూమిని వ్యవసాయం, అనుబంధ అవసరాలకు లీజుకు ఇవ్వడం అనేది భూ యజమానికి, లీజుకు తీసుకున్న వ్యక్తికి మధ్య పరస్పర అంగీకారంతో కుదిరే ఒప్పందం అవుతుంది. దీనితో, భూమి కౌలుదారులు ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందడానికి, పంట బీమాకు, విపత్తుల సందర్భంలో సహాయం పొందడానికి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ రకాల సహాయాలు పొందడానికి వీలు కలుగుతుంది. ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌లు మహిళా స్వయం సహాయక బృందాల కార్యకలాపాలకు తగిన ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా చిన్న రైతుల ఆదాయాన్ని పెంచేందుకు వీలు కలుగుతుంది. సహకార విధానంలో ఏర్పడిన ఎఫ్.పి.ఒల వార్షిక లావాదేవీలు 100 కోట్ల రూపాయలకంటే తక్కువగా ఉంటే ఆదాయపన్ను నుంచి మినహాయింపు ఇవ్వడం జరిగింది.

### భద్రమైన జీవనోపాధి దిశగా.....

రకరకాల ప్రకృతి వైపరీత్యాలు, పంటలను నాశనం చేసే చీడపీడలు, రకరకాల వాతావరణ సమస్యల వంటివి రైతుల ఆదాయం, జీవనోపాధిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇలాంటి అననుకూల పరిస్థితుల నుంచి రైతులను రక్షించి వారికి భద్రమైన జీవనోపాధి కల్పించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు అనుగుణంగా 2016లో కొత్త, మెరుగైన, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (ప్రధానమంత్రి పంట బీమా పథకం)ను తక్కువ రేటు ప్రీమియం, ఎక్కువ పంటలకు వర్తించే విధంగా తీసుకువచ్చారు. రైతులు చెల్లించవలసిన ప్రీమియం రబీ పంటలకు కేవలం 1.5 శాతం కాగా,ఖరీఫ్ పంటలకు 2 శాతంగా నిర్ణయించారు. వార్షిక పండ్ల తోటలకు గరిష్ఠంగా 5 శాతం ప్రీమియం నిర్ణయించారు.పంట కోసిన తర్వాత తలెత్తే రిస్క్‌లకు, 14 రోజుల వరకు నష్టాలకు బీమా సదుపాయం వర్తింప చేస్తున్నారు. రైతుల వ్యక్తిగత స్థాయిలో నష్టాన్ని మదింపు చేసే సమయంలో పంట నీట మునడగాన్ని స్థానిక విపత్తుగా చేర్చారు. పంట నష్టపోయిన సందర్భాలలో పరిహారం చెల్లింపును పారదర్శకంగా మరింత కచ్చితంగా చేపట్టేందుకు రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీ, ఐటి ఉపకరణాలను వాడడం ద్వారా సత్వరం పరిహారం చెల్లింపునకు , బీమా క్లెయిమ్‌ల పరిష్కారానికి వీలు కలుగుతోంది. రైతులకు మరింత ప్రయోజనం కలిగించే విధివిధానాలతో, పంట బీమా పథకాన్ని పెద్దఎత్తున విస్తరింప చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 2018–2019 కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులను గణనీయంగా 13,000 కోట్ల రూపాయలకు పెంచారు.

మరోవైపు, పర్యావరణ పరమైన విపత్తుల నుంచి తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు, రైతులు తమ జీవనోపాధిని కాపాడుకునేందుకు వివిధ వాతావరణ ప్రాంతాల రైతులకు తగిన శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. దేశంలోని 623 జిల్లాలకు రైతుల భాగస్వామ్యంతో జిల్లా స్థాయిలో అత్యవసర ప్రణాళికలను సిద్ధం చేసి వాటిని దేశవ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చారు. గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను తగ్గించి

పర్యావరణాన్ని కాపాడే సాంకేతిక పరిజ్ఞానంపై క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో ప్రదర్శనలు, శిక్షణ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నెట్ వర్క్ కలిగిన కృషి విజ్ఞాన కేంద్రాలు నిర్వహిస్తున్నాయి. కృషి విజ్ఞాన కేంద్రాలు పర్యావరణ హితమైన 151 క్లైమేట్ స్మార్ట్ గ్రామాలను ఏర్పాటు చేశాయి. ఇవి ఇతర గ్రామాలకు, రైతులకు ఆదర్శంగా ఉండనున్నాయి.

సమీకృత వ్యవసాయ పద్ధతులు, వ్యవస్థలు అననుకూల పరిస్థితులలో కూడా రైతుల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా చేస్తాయి. వివిధ పంటలు పండించడంతోపాటు, పండ్ల తోటల పెంపకం, పశుగణాభివృద్ధి, ఆక్వాకల్చర్, వంటి సమీకృత వ్యవసాయ విధానాలు రైతులకు మేలు చేస్తాయి. అలాగే, ఇలాంటి నూతన వ్యవసాయ విధానాలు ప్రతి యూనిట్ భూమిపై అధిక రాబడి వచ్చేలా చేయడంతోపాటు రిస్కును తగ్గిస్తాయి. ఒకదానిపై రాబడి తగ్గినా మరో దానిపై రాబడి వచ్చి రైతు నిలదొక్కుకోవడానికి వీలు కలుగుతుంది. శాస్త్రవేత్తలు గత నాలుగు సంవత్సరాలలో 31 సమీకృత వ్యవసాయ పద్ధతులను అభివృద్ధి చేశారు. ఈ మేలైన పద్ధతులు చిన్న సన్నకారు రైతులకు సరిపోయేవే కాకుండా దేశంలోని వివిధ వాతావరణ జోన్లకు తగినటువంటివి. గ్రామస్థాయిలో ఈ నమూనాలకు విస్తృత ప్రచారంకల్పించేందుకు ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నమూనాలలో ఎక్కువ భాగం నమూనాలలో పండ్ల తోటల అంశం ప్రధానంగా ఉంది. రైతుల రాబడిని గణనీయంగా పెంచగల దీనిని పెద్ద ఎత్తున విడిగా కూడా ప్రోత్సహించడం జరుగుతోంది. పండ్ల తోటల సమీకృత అభివృద్ధికి ఏర్పడిన నూతన మిషన్ ఈ దిశగా సమగ్ర చర్యలకు అండగా నిలుస్తోంది. పండ్ల తోటల పెంపకంలో యాంత్రీకరణ, శీతలీకరణ గిడ్డంగులు, ఇతర కోల్డ్‌స్టోరేజ్ సదుపాయాలు, తగిన సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, పండ్ల తోటల నాట్లకు సంబంధించి నాణ్యమైన విత్తనాలు, మొక్కలు, పరికరాలు వంటి వాటిపై దృష్టిపెట్టడం జరుగుతోంది. పండ్లతోటల పెంపకంపై కొత్త క్లస్టర్ విధానం ఈ రంగానికి ప్రయోజనకంగా ఉన్నట్టు రుజువైంది. ఉత్పత్తి నుంచి మార్కెటింగ్ వరకు అన్ని సదుపాయాలు ఒకే చోట అభివృద్ధి చేయడం ఈ విధానంలో ప్రధానమైనది.

**అదనపు రాబడి...**

వివిధ సాంకేతిక నివేదికల సిఫార్సులకు అనుగుణంగా, ప్రభుత్వం రైతు రాబడని గణనీయంగా పెంచే వివిధ అనుబంద వ్యవసాయ కార్యకలాపాలపై దృష్టిపెడుతున్నది.

***తరువాయి 48వ పేజీలో***

## సేంద్రీయ వ్యవసాయం – కీలక మలుపు

ఇటీవలి కాలంలో ఆరోగ్యపరమైన సమస్యలు పెరిగిపోవడంతో ప్రజల ఆహారపు అలవాట్లలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా వీరు సేంద్రియ ఉత్పత్తులపైపు మళ్లుతున్నారు. ఈ రకమైన పద్ధతి మన దేశంలోను, ఇతరదేశాలలోనూ శరవేగంతో విస్తరిస్తున్నది. దీనితో సేంద్రియ ఉత్పత్తుల ధరలు పెరుగుతున్నాయి. అదృష్టవశాత్తు వివిధ సేంద్రియ పంటలకు మన వాతావరణ, సామాజిక ఆర్థిక పరిస్థితులు ఎంతో అనువుగా ఉంటాయి. రైతులను ఈ దిశగా ప్రోత్సహించడం, వారికి తగిన మార్కెట్ సదుపాయాలు కల్పించడం ద్వారా ఈ రంగంలో గణనీయమైన వృద్ధి సాధించడానికి అవకాశం ఉంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం, పరంపరాగత్ కృషి వికాస్ యోజన పేరుతో ఒక పథకాన్ని ప్రారంభించింది. సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, వాటికితగిన మార్కెటింగ్‌నెట్‌వర్క్ కల్పించడం దీని ప్రధాన ఉద్దేశం. ఇందుకు క్లస్టర్ ఆధారిత విధానాన్ని అనుసరిస్తారు. యాభై మంది రైతులు యాభై హెక్టార్ల భూమితో ఒక క్లస్టర్‌గా ఏర్పడి మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉన్న, వ్యవసాయ ఉత్పత్తులు, పండ్ల తోటలను సేంద్రియ పద్ధతులలో సాగు చేస్తారు. ప్రతి రైతుకు మూడు సంవత్సరాల పాటు హెక్టారుకు 50,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తారు. దీనికి తోడు ఆర్గానిక్ ఉత్పత్తుల సేకరణ, మార్కెట్‌కు చేరవేయడానికి రూ. 1,20,000ల ఆర్థిక సహాయాన్ని సమకూరుస్తారు. గత నాలుగు సంవత్సరాలలో కేంద్రప్రభుత్వం ఈ పథకం కింద 947 కోట్ల రూపాయలను పంపిణీ చేసింది. ఈ ఏడాది చివరి నాటికి 10,000 క్లస్టర్ల ఏర్పాటు సాధించాలన్నది లక్ష్యం. ఆర్గానిక్ క్లస్టర్లను ప్రత్యేకించి గిరిజన, వర్షాధారిత, కొండప్రాంతాలు, మారుమూల ప్రాంతాలలోని రైతుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేయడం జరుగుతోంది. సేంద్రియ సాగు పద్ధతుల వల్ల సాగు వ్యయం 20 శాతం వరకు తగ్గుతుంది. ఫలితంగా రైతుల నికర లాభం 20 నుంచి 25 శాతం పెరుగుతోంది.

ఈ రంగంలో ఉన్న అత్యంత అనుకూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం, ఈశాన్యప్రాంతంలో ఆర్గానిక్ ఉత్పత్తులకు సంబంధించి విత్తన దశ నుంచి ఉత్పత్తి మార్కెటింగ్ వరకు గల వివిధ దశలను అనుసంధానం చేసే ప్రత్యేక మిషన్ –మిషన్ ఫర్ డవలప్‌మెంట్ ఆఫ్ ఆర్గానిక్ వాల్యూ చెయిన్ ఇన్ నార్త్ ఈస్ట్ రీజియన్‌ను అమలుచేస్తోంది. ఇందుకు 2015–2018లో 400 కోట్ల రూపాయలు కేటాయించారు. సిక్కింను దేశంలోనే తొలి సేంద్రియ రాష్ట్రంగా ప్రకటించారు. ఇది ఈశాన్యరాష్ట్రాలలో పెద్ద ఎత్తున ఆర్గానిక్ సాగును ప్రోత్సాహాన్నిస్తోంది. ఎగుమతులపై దృష్టిపెడుతూ, ఈశాన్య ప్రాంతం ఆర్గానిక్ ఉత్పత్తులకు కీలక కేంద్రంగా శరవేగంతో అభివృద్ధిచెందుతోంది.

# కేంద్ర రైతు సంక్షేమ పథకాలు

– ఏ. అమరయ్య



**ఎవరైనా రైతు రూ. 3 లక్షల వరకు స్వల్పకాలిక పంట రుణాలను తీసుకుని సకాలంలో చెల్లిస్తే కేంద్రం 3 శాతం వడ్డీ రాయితీ ఇస్తుంది. మిగతా రెండు శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయి. దీంతో రైతులకు వడ్డీ లేని రుణం సాధ్యమవుతుంది. ఈ పథకాన్ని వినియోగించుకునేలా ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డు వ్యవస్థను ప్రవేశపెట్టింది. దీనివల్ల చిన్న, సన్నకారు రైతులు లబ్ధిపొందేందుకు వీలుంది. ఇటువంటి విధానాలతో రైతులను ఆదుకునేందుకు కేంద్రం కృషి చేస్తోంది.**

వ్యవసాయాన్ని దండగ కాకుండా పండగ చేయాలన్న సంకల్పంతో నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను చేపట్టింది. వ్యవసాయదారుల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేయడానికి, పంటల బీమాను విస్తృతం చేయడానికి, సేంద్రీయ వ్యవసాయాన్ని పెంపొందించడానికి మోదీ ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. 1950లో జీడీపీలో 51.9 శాతంగా వ్యవసాయ వాటా క్రమేపీ క్షీణిస్తూ 13.9 శాతానికి చేరిన నేపథ్యంలో కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలు రైతుల మన్ననలు పొందుతున్నాయి. వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థ నుంచి పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థ వైపు మళ్లి, తిరిగి ఇప్పుడు మళ్లీ వ్యవసాయం వైపు ప్రభుత్వాలు దృష్టి సారించాయి. పశువుల్ని దేవతలుగా పూజించే దేశం మనది. ఇప్పటికీ నూటికి 60 శాతం మందికి జీవనాధారం వ్యవసాయమే. ఆదాయం తక్కువైనా వ్యవసాయాన్ని ఓ జీవనరీతిగా మలచుకుని ముందుకు సాగుతున్న ప్రజలు భారతీయులు. పట్టణీకరణ, పారిశ్రామికీకరణతో వ్యవసాయం ఏమాత్రం లాభసాటి వ్యాపారం కాకుండా పోయింది. చిన్నకమతాలతో గిట్టుబాటు కాక పెట్టుబడి వ్యయం పెరిగి, నీటి వసతి సరిగా లేక, మార్కెట్లు మందగించి, పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర నిరాశా నిస్పృహలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కేంద్రం నడుంకట్టింది. 2016–17 బడ్జెట్‌ప్రకారం 2.85 మిలియన్‌హెక్టార్ల భూమికి నీటి వసతి కల్పించాలని ప్రతిపాదించింది.

**ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజన:**

ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2016 ఏప్రిల్‌ఒకటిన ప్రారంభించింది. గతంలో ఉన్న జాతీయ వ్యవసాయ బీమా పథకం (ఎన్‌ఏఐఎస్), వాతావరణ ఆధారిత బీమా పథకం, ఆధునీకరించిన వ్యవసాయ బీమా పథకం స్థానంలో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రకృతి వైపరీత్యాలు, బీభత్సాల నుంచి రైతుల్ని కాపాడేందుకు ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజన పనికివస్తుంది. పంట దిగుబడిలో వచ్చే ఒడిదుడుకులు, నష్టాలకు పరిహారం ఇచ్చేలా ఈ పథకాన్ని రూపొందించారు. పంట కోత జరిగిన తర్వాత 14 రోజుల్లోగా జరిగే పంట నష్టాలకు కూడా ఈ పథకం కింద పరిహారం వస్తుంది. గత పథకాలకు ఈ పథకానికి వ్యత్యాసం ఏమిటంటే గతంలో ప్రీమియానికి పరిమితులు ఉండేది. బీమా చేసిన మొత్తంలో 8 నుంచి 12 శాతం లోపే ప్రీమియం పరిమితి ఉండేది. ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజనలో ఆ పరిమితులు లేవు. హెక్టారుకు పంట నష్టం ఎంత అనేది జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ నిర్ణయిస్తుంది. ఇది ఎంత అనేది రాష్ట్ర స్థాయి

సీనియర్ జర్నలిస్టు, హైదరాబాద్.
E-mail : journalistamar@gmail.com

కమిటీ ముందే అంచనా వేసి ప్రకటిస్తుంది. ఖరీఫ్‌లో అన్ని పంటలకు 2 శాతం, రబీలో 1.5 శాతం ప్రీమియంను రైతులు చెల్లించాలి. మిగతా ప్రీమియంను ప్రభుత్వం చెల్లిస్తుంది. దేశంలో ఆహార భద్రతను కాపాడేందుకు ఈ పథకం అత్యవసరం. ఈ పథకం కింద 2017-18 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం 10,701 కోట్లు కేటాయించగా 2018-19కి 13 వేల కోట్ల రూపాయలను కేటాయించింది. 2016-17లో పంటల బీమా క్లెయిమ్‌ల మొత్తం రూ.15,500 కోట్లుగా అంచనా వేసినప్పటికీ రూ.12,313 కోట్లు చెల్లించినట్టు ప్రభుత్వం ప్రకటించింది. 2016-17లో 5.70 కోట్ల మంది రైతులు ప్రధానమంత్రి పంటల బీమా పథకం కింద ప్రీమియం చెల్లించారు.

**నీలి విప్లవం...**

దేశంలో మత్స్యపరిశ్రమ అభివృద్ధికి ఉన్న అపార అవకాశాలను పరిగణలోకి తీసుకుని కేంద్రప్రభుత్వం కేంద్ర ప్రణాళిక పథకాన్ని (సీఎస్ఎస్) పునర్వ్యవస్థీకరించి మత్స్య పరిశ్రమలకు చెందిన అన్ని విభాగాలను నీలి విప్లవం (బ్లూ రివల్యూషన్) కిందకు తెచ్చింది. ఆక్వా రంగంలో మత్స్య ఉత్పత్తిని, ఉత్పాదకతను పెంపొందించేలా ఈ పథకాన్ని రూపొందించారు. సముద్రం లోపల, బయట కూడా మత్స్య సంపదను పెంపొందించేలా ఈ సమీకృత అభివృద్ధి, నిర్వహణ పథకం ఉంది. ఇది సీఎస్ఎస్‌లో అంతర్భాగంగా ఉంటుంది.

**సమర్థవంతమైన నీటిపారుదల వ్యవస్థ:**

పర్యావరణ మార్పులపై జాతీయ కార్యాచరణ పథకం (ఎన్ఏపీసీసీ) కింద చేపట్టిన 8 కార్యక్రమాలలో జాతీయ సుస్థిర వ్యవసాయ మిషన్ (ఎన్ఎంఎస్ఏ) ఒకటి. పర్యావరణ మార్పుతో ముడిపడి ఉన్న సమస్యలను పరిష్కరించడం దీని ఉద్దేశం. ఈ పథకం 2014-15 నుంచి అమల్లోకి వచ్చింది. భూ సార పరిరక్షణ చర్యలు, సమగ్ర భూసార పరిరక్షణ నిర్వహణ, సమర్థవంతంగా నీటి నిర్వహణ, వర్షాధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చి అధికోత్పత్తి, పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చేయడం ఈ పథకం ఉద్దేశం.

**పరంపరాగత్‌కృషి వికాస్‌యోజన:**

సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం పరంపరాగత్ కృషి వికాస్‌యోజనను తీసుకువచ్చింది. హరిత విప్లవం పద్ధతుల్లో సేంద్రీయ వ్యవసాయ విప్లవాన్ని తీసుకు రావాలన్నది ఉద్దేశం. దేశంలో విచ్చలవిడి రసాయన ఎరువుల వినియోగం వల్ల పర్యావరణం దెబ్బతినడంతో పాటు సామాజిక ఆర్థిక రంగాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఉత్పత్తి కూడా గణనీయంగా తగ్గుతోంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే ఈ విధానం అమలవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి సేద్యం పేరిట పెట్టుబడి లేని వ్యవసాయ విధానం అమల్లో ఉంది. ప్రస్తుతం 7 లక్షల ఎకరాల్లో ప్రకృతి సాగు విధానం అమల్లో ఉంది. సేంద్రీయ వ్యవసాయ విధానం వల్ల రైతులకు మేలు జరగడమే కాకుండా భూసారాన్ని కాపాడవచ్చు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాల కింద దేశంలో ప్రస్తుతం 23 లక్షల హెక్టార్లలో సేంద్రీయ వ్యవసాయ విధానం అమల్లో ఉన్నట్టు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి రాధా మోహన్‌సింగ్ ఇప్పటికే ప్రకటించారు. పరంపరాగత్ కృషి వికాస్ యోజన కింద 2 లక్షల హెక్టార్లను సేంద్రీయ సాగు విధానం కిందకు తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చేసింది. దీనివల్ల 5 లక్షల మంది రైతులు లబ్ధి పొందుతారు. ఈశాన్య రాష్ట్రాలలో 50 వేల హెక్టార్లను సేంద్రీయ వ్యవసాయ పద్ధతికి తీసుకురావాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంటే ఇప్పటికే 45,918 ఎకరాలను తీసుకువచ్చింది.

**రైతు సంక్షేమమే ధ్యేయంగా:**

రైతు సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. దేశానికి అన్నంపెట్టే రైతన్నను ఆదుకునేలా వ్యవసాయాన్ని ఆధునీకరించి రైతు ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు నడుం కట్టింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు నిండే 2022 సంవత్సరం నాటికి రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసే దిశగా పలు కార్యక్రమాలను ప్రవేశపెట్టింది. వాటిల్లో భూసార పరిరక్షణ (సాయిల్‌హెల్త్‌కార్డ్), వేపపూత పూసిన యూరియా సరఫరా, పరంపరాగత్‌కృషి వికాస్‌యోజన, ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన, జాతీయ వ్యవసాయ మార్కెట్ (ఈ-నామ్), ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజన, వడ్డీ రాయితీ పథకం వంటివి ఉన్నాయి. 2017 జూలై నాటికి 253 లక్షల మట్టినమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించాలన్నది లక్ష్యమైతే 97 శాతం పూర్తయింది. 2017 చివరి నాటికి 12 కోట్ల మందికి భూసార పరీక్షల కార్డులు ఇవ్వాల్సి ఉంటే 76 శాతం పూర్తయింది. వేపపూత పూసిన యూరియా సరఫరా వల్ల దుర్వినియోగాన్ని అరికట్టడమే కాకుండా రైతులకు ఎంత అవసరమో అంతే వినియోగించే సౌలభ్యం అందుబాటులోకి వచ్చింది. దీనివల్ల పది శాతం వినియోగం తగ్గింది. ఈనామ్ మార్కెట్ విధానం వల్ల రైతులు తమ ఉత్పత్తులను ఎక్కడి నుంచి ఎక్కడికైనా అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. 2018 మార్చి నాటికే దేశంలోని 585 మార్కెట్లను ఈ విధానం కింద అనుసంధానం చేశారు. ఒకే దేశం ఒకే మార్కెట్‌నినాదం కింద ఈనామ్‌వ్యవస్థను ప్రోత్సహిస్తున్నారు. 2017 జూలై 2 నాటికి ఈ విధానం కింద 47.95 లక్షల మంది రైతులు లబ్ధిపొందారు. రైతులకు స్వల్పకాలిక పంట రుణాలపై వడ్డీ లేని రుణాలను ఇప్పించేందుకు చర్యలు చేపట్టంది. ఎవరైనా రైతు రూ.3 లక్షల వరకు స్వల్పకాలిక పంట రుణాలను తీసుకుని సకాలంలో చెల్లిస్తే కేంద్రం 3 శాతం వడ్డీ రాయితీ ఇస్తుంది. మిగతా రెండు శాతాన్ని రాష్ట్రప్రభుత్వాలు చెల్లిస్తాయి. దీంతో రైతులకు వడ్డీ లేని రుణం సాధ్యమవుతుంది. ఈ పథకాన్ని వినియోగించుకునేలా ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డు వ్యవస్థను ప్రవేశపెట్టింది. దీనివల్ల చిన్న, సన్నకారు రైతులు లబ్ధిపొందేందుకు వీలుంది. ఇటువంటి విధానాలతో రైతులను ఆదుకునేందుకు కేంద్రం కృషి చేస్తోంది. ■



# విజ్ఞాన విపంచి

ప్రాతూరి పోతయ్య శర్మ

**1) 'సింధు సాధన' ఏమిటి ?**
ఎ) బే అఫ్ బెంగాల్ బౌండరీ లేయర్ ఎక్స్‌పెరిమెంట్ (BoBBLE) కోసం అనుసంధానించబడిన ఓడ ఇది.
బి) పుస్తకం పేరు
సి) పర్వతం పేరు
డి) సముద్రం పేరు

**2) ఏ కారణం చేత బంగాళాఖాతంలోని సముద్రపు నీటి ఉప్పదనం కన్నా భారత దేశానికీ పశ్చిమాన ఉన్న అరేబియా సముద్రపు నీటిలో ఉప్పదనం (salinity) ఎక్కువ?**
ఎ) గంగానది, బ్రహ్మపుత్ర నదులు బంగాళాఖాతంలో కలవటం చేత
బి) మహానది బంగాళాఖాతంలో కలవటం చేత
సి) గోదావరి నది బంగాళాఖాతంలో కలవటం చేత
డి) పైనదులన్నీ , ఎక్కువ నీటితో వచ్చి, నిరంతరం బంగాళాఖాతంలో కలవటం చేత

**3) ఇండియన్ సమ్మర్ మాన్‌సూన్ కాలం ఏది?**
ఎ) జూన్ నుండి సెప్టెంబర్ వరకు
బి) అక్టోబర్ నుండి డిసెంబర్ వరకు
సి) జనవరి నుండి మే వరకు
డి) ఇవేవి కావు

**4) ఐర్లాండ్ దేశం శాసనం చేయబోతున్న 'సవితా లా' దేనికి సంబంధించినది ?**
ఎ) వారసత్వం హక్కు
బి) గర్భం దాల్చిన తొలి 12 వారాలలోపు, అత్యవసర వైద్య సలహా ప్రకారం గర్భస్రావం అనుమతిం చేందుకు.
సి) మత స్వేచ్ఛ హక్కు
డి) విద్యా హక్కు

**5) 'ఆర్కిటిక్ కౌన్సిల్ వివరాలేవీ ?**
ఎ) 2017-19 కాలానికి ఫిన్లాండ్ దేశం దీనికి చైర్మన్
బి) ఇదొక అంతర్ ప్రభుత్వ (ఇంటర్ గవర్నమెంటల్ సంస్థ). దీనిలో 8 సభ్య దేశాలు, 6 స్వతంత్రంగా శాశ్వతంగా పాల్గొనే సంస్థలు ఉన్నాయి
సి) ఇండియా & చైనా వంటివి నాన్ - ఆర్కిటిక్ దేశాలు అబ్జర్వర్‌లుగా ఉన్నాయి
డి) పైవన్నీ

**6) RBI రేపో రేట్‌ను ఎంతకి పెంచింది?**
ఎ) 6.25 శాతం
బి) 5.25 శాతం
సి) 4.25 శాతం
డి) 7.25 శాతం

**7) 2018 సంవత్సరపు ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రధాన అంశం ఏది ?**
ఎ) 'బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ (ప్లాస్టిక్ కాలుష్యాన్ని తరిమి కొట్టండి)
బి) సముద్రాల ప్రక్షాళన
సి) వాయు కాలుష్య నిర్మూలన
డి) మట్టి కాలుష్య నిర్మూలన

**8) పెన్‌ట్రిచ్ నుండి పీటర్ మార్టిన్జ్ బర్గ్ వరకు (దక్షిణ ఆఫ్రికాలో) రైలు మార్గంలో 125 సంవత్సరాల క్రితం ఎవరు ప్రయాణించారు?**
ఎ) మహాత్మా గాంధీ
బి) నెల్సన్ మండేలా
సి) సుష్మా స్వరాజ్
డి) టాంబో

**9) సెప్టెంబర్ 8, 1522 నాడు తొలి సారిగా భూమి చుట్టూ సముద్రంలో ప్రయాణం పూర్తయ్యింది. క్రీస్తు శకం 1519లో స్పెయిన్ నుండి బయలు దేరిన ఈ యాత్ర ఎవరి యాత్రలో భాగం?**
ఎ) జువాన్ సెబాస్టియన్ డి ఎల్కానో
బి) ఫెర్డినాండ్ మాగెల్లాన్
సి) P. స్వాతి, INSV తారిణి
డి) వార్తికా జోషి

**10) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్?**
ఎ) కృష్ణ రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (KRMB) చైర్మన్ : S.K. సాహూ
బి) సెంట్రల్ వాటర్ & పవర్ రీసెర్చ్ స్టేషన్ (CWPRS), ముఖ్య కార్యాలయం : పూణే
సి) 2017-18లో ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలు కృష్ణానది నీటి విభజన నిష్పత్తి : 66:34
డి) పైవన్నీ

**11) గ్లోబల్ పీస్ ఇండెక్స్ (ప్రపంచ శాంతి ఇండెక్స్) ని ఎవరు విడుదల చేస్తారు?**
ఎ) వరల్డ్ బ్యాంకు
బి) ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ & పీస్ (IEP), ఆస్ట్రేలియా
సి) IMF
డి) ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు

**12) ఇటీవల విడుదల చేసిన గ్లోబల్ పీస్ ఇండెక్స్ ప్రకారం ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్?**
ఎ) ఇండియా ర్యాంక్ : 136
బి) నేపాల్ ర్యాంక్ : 84
సి) శ్రీలంక ర్యాంక్ : 67
డి) పైవన్నీ

**13) గ్లోబల్ పీస్ ఇండెక్స్ ప్రకారం 2008 నుండి ఇప్పటివరకు అత్యంత శాంతియుత దేశంగా ఏది కొనసాగుతోంది?**
ఎ) ఐస్ ల్యాండ్
బి) సిరియా
సి) భూటాన్
డి) బంగ్లాదేశ్

**14) ఇటీవల ప్రముఖంగా వార్తల్లో ఉన్న 'సేన్ సోటా దీవి' ఏ దేశంలో ఉంది ?**
ఎ) శ్రీలంక
బి) సింగపూర్
సి) మారిషస్
డి) ఫిలిప్పీన్స్

**15) భారతదేశపు వాయు కాలుష్యంలో, ప్రముఖంగా, ఏవేవి ఉన్నాయి?**
ఎ) నైట్రోజన్ కాలుష్యం (PM 2.5)
బి) మీథేన్ (వ్యవసాయ రంగం నుండి)
సి) అమోనియా (పశువుల వ్యర్థ పదార్థాల నుండి)
డి) పైవన్నీ

**16) జూలాజికాల్ సర్వే అఫ్ ఇండియా & బోటానికాల్ సర్వే అఫ్ ఇండియా ప్రచురణల ప్రకారం, 2017 లో భారతదేశంలో వృక్షాలు, జంతువులలో, ఎన్ని కొత్త స్పీసీస్ (జాతులు) కనుగొన్నారు?**
ఎ) 539
బి) 263
సి) 174
డి) 89

**17) ఇటీవల భారత ప్రధాన మంత్రి పాల్గొన్న 'షాంగ్రీ - లా డైలాగు' ఎక్కడ నిర్వహించారు?**
ఎ) ఇండోనేషియా
బి) మలేసియా
సి) సింగపూర్
డి) చైనా

**18) ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన దేశం ఏది?**
ఎ) ఇండియా
బి) భూటాన్
సి) నేపాల్
డి) బంగ్లాదేశ్

**19) ప్రపంచవ్యాప్తంగా, ఐక్యరాజ్యసమితి గుర్తించిన 10 పెద్ద నదులలో, సముద్రంలోకి పెద్ద మొత్తంలో ప్లాస్టిక్‌ని మోసుకు పోయే నదీ వ్యవస్థ భారత్‌లో ఏది?**
ఎ) గంగా - బ్రహ్మపుత్ర - మేఘన (రివర్ సిస్టం)
బి) గోదావరి
సి) కృష్ణ
డి) కావేరి

**20) 'S-400 ట్రయంఫ్ లాంగ్ రేంజ్ ఎయిర్ డిఫెన్సు సిస్టం' ను భారత దేశం ఎక్కడ నుండి కొనదల్చింది?**
ఎ) జర్మనీ
బి) రష్యా
సి) స్వీడన్
డి) ఇటలీ

**21) 2022 కంటే ముందే భారతదేశం ఎంత పునర్వినియోగ ఇంధనాన్ని (రెన్యూవబుల్ ఎనర్జీ) సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది?**
ఎ) 175 GW
బి) 225 GW
సి) 50 GW
డి) 100 GW

**22) చైనాలో ఎక్కడ షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (SCO) సమావేశం నిర్వహించారు?**
ఎ) క్వింగ్ డావో
బి) వూహాన్
సి) బీజింగ్
డి) షాంఘై

**23) పంకజ్ శరన్ కొత్తగా చేపట్ట బోయే పదవి ఏది?**
ఎ) ప్రధాన మంత్రి కార్యలయంలో డిప్యూటీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్
బి) రష్యా దేశంలో భారత రాయబారి
సి) జపాన్ దేశ రాయబారి
డి) ఇటలీ రాయబారి

**24) G-7 దేశాల సమావేశం ఇటీవల ఇక్కడ నిర్వహించారు ?**
ఎ) క్యూబెక్, కెనడా  బి) సోచి
సి) ప్యోంగ్ యాంగ్  డి) సియోల్

**25) UN భద్రతా మండలిలో 'నాన్ – పెర్మనెంట్ మెంబర్ సీట్' కోసం ఇటీవల (జూన్ 2018లో) ఎన్నికైన దేశం ఏది?**
ఎ) ఇండోనేషియా  బి) మాల్దీవులు
సి) జర్మనీ  డి) బెల్జియం

**26) ప్రస్తుతం GST పరిధిలో లేని వస్తువులు ఏవి?**
ఎ) పెట్రోలియం క్రూడ్ ; మోటార్ స్పిరిట్ (పెట్రోల్)
బి) హై స్పీడ్ డీజిల్ ; నాచురల్ గ్యాస్
సి) ATF  డి) పైవన్నీ

**27) బ్యాంకులలో/ఆర్థిక సంస్థలలో, స్ట్రెస్డ్ అసెట్స్‌లను పరిష్కారం కోసం ARC/AMC ల ఏర్పాటు గురించి అధ్యయనం కోసం నియమించిన కమిటీ చైర్మన్ ఎవరు?**
ఎ) సునీల్ మెహతా  బి) ఇందు భూషణ్
సి) JS. రాజ్ పుట్  డి) హర్పాల్ సింగ్

**28) బ్లూ హౌస్ ఏ దేశ అధ్యక్షుడి అధికారిక భవనం?**
ఎ) ఉత్తర కొరియా  బి) దక్షిణ కొరియా
సి) USA  డి) పాకిస్తాన్

**29) ప్రపంచంలో రెండవ అతి పెద్ద బొగ్గు గని అయిన దేవ్‌ఛా – పాచామీ కోల్ మైన్ (9 చదరపు కి.మీ. విస్తీర్ణంలో) ఎక్కడ ఉంది?**
ఎ) బీర్ భూమ్ జిల్లా, పశ్చిమ బెంగాల్
బి) బిహార్
సి) ఛత్తీస్‌గఢ్  డి) మధ్య ప్రదేశ్

**30) భారతదేశ ఆర్థికాభివృద్ధి మీద ఏ అంశాలు ప్రభావం చూపిస్తున్నాయి, RBI ప్రకారం?**
ఎ) భూ–రాజకీయ కారణాలు (జియో పొలిటికల్ రిస్క్‌లు)
బి) మార్కెట్ వాలటైలిటి (అవిరైపోవటం)
సి) ట్రేడ్ ప్రొటెక్షనిజం (వ్యాపార రక్షణలు)
డి) పైవన్నీ

**31) మాతృ మరణాల రేటు (MMR) ను గమనించటానికి, శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టం (SRS) డేటా కోసం, రాష్ట్రాలను ఎన్ని రకాలుగా వర్గీకరించారు?**
ఎ) ఎంపవర్డ్ యాక్షన్ గ్రూప్ (EAG)
బి) సథరన్ గ్రూప్
సి) ఇతరులు  డి) పైవన్నీ

**32) అటల్ భూ జల్ యోజన (ABHY) వివరాలు ఏవి?**
ఎ) రూ. 6,000 కోట్ల పథకాన్ని ప్రపంచ బ్యాంకు సాయంతో చేపడతారు.
బి) 2018–19 నుండి 2022–23 (5 ఏళ్ళు) వరకు ఈ పథకాన్ని అమలుచేస్తారు
సి) దీని ద్వారా భూగర్భ జల నిల్వలు పెరిగేటట్లు చేస్తారు.  డి) పైవన్నీ

**33) ఎలాంటి బ్యాంకులకు, స్మాల్ ఫైనాన్సు బ్యాంకులుగా మారటానికి, RBI పర్మిషన్ / అనుమతి ఇచ్చింది?**
ఎ) అర్బన్ కోపరేటివ్ బ్యాంకులు
బి) ప్రైమరీ కోపరేటివ్ బ్యాంకులు
సి) కోపరేటివ్ క్రెడిట్ సొసైటీలు
డి) సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లు

**34) 'ఎన్విరాన్మెంటల్ DNA (eDNA)' విధానంతో వేటిని కనుగొంటున్నారు ?**
ఎ) భౌతికంగా స్పెసిమెన్ (జంతువులు/మొక్కలు) సేకరించకుండా, జీవ వైవిధ్యాన్ని మానిటరింగ్ చేసేందుకు వాడుతున్నారు.
బి) దీనితో మంచి నీటి సరస్సులలో / కోనేరులలో ఉండే తాబేళ్లను అస్సాంలోని దేవాలయాలలో కనుగోనగాలిగారు.
సి) జూలాజికల్ సర్వే అఫ్ ఇండియా వారు ఈ పద్ధతిని అమలుచేస్తున్నారు.
డి) పైవన్నీ

**35) 'NOTTO' ఏమిటి? వివరాలేవి ?**
ఎ) నేషనల్ ఆర్గాన్ & టిష్యూ ట్రాన్స్ ప్లాంట్ ఆర్గనైజేషన్
బి) ప్రొఫెసర్ విమల్ భండారి, దీని డైరెక్టర్
సి) ఇది కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కింద పనిచేస్తోంది.
డి) పైవన్నీ

**36) ప్రధానమంత్రి మాతృ వందన యోజన ద్వారా గర్భిణి స్త్రీలకు, ఎంత నగదు సహాయం అందిస్తారు?**
ఎ) రూ. 2,000/–  బి) రూ. 6,000/–
సి) రూ. 1,000 /–  డి) రూ. 5,000 /–

**37) BIMSTEC ని ఎప్పుడు ఏర్పాటు చేశారు ?**
ఎ) 1995  బి) 1997  సి) 1971  డి) 19 75

**38) కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయదలచుకున్న క్రెడిట్ ఎన్‌హాన్స్‌మెంట్ ఫండ్ కోసం, ముందుగా, ఏ సంస్థ రూ.500 కోట్లు పెట్టుబడులు పెడుతుంది?**
ఎ) ఇండియా ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్సు కంపెనీ (IIFCL)
బి) AIIB  సి) LIC  డి) SBI

**39) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్ ?**
ఎ) మెర్ లయన్ : సగం సింహం, సగం చేప ఆకారం. ఇది సింగపూర్ దేశ అనధికారిక చిహ్నం.
బి) వివియన్ బాలకృష్ణన్ : సింగపూర్ దేశ విదేశాంగ మంత్రి.
సి) లీ. H.లూంగ్ : సింగపూర్ దేశ ప్రధాన మంత్రి
డి) పైవన్నీ (ఇటీవల USA–ఉత్తర కొరియా దేశాల అధ్యక్షుల చర్చల సందర్భంలో వార్తల్లో ఉన్నారు)

**40) బ్యాంకులు లోన్ శాంక్షన్ చేసేటప్పుడు ఏ ఏ దశలలో తగిన జాగ్రత్తలు తీసుకుంటారు?**
ఎ) లోన్ శాంక్షన్ చేసే అధికారి స్థాయిలో
బి) మేనేజ్ మెంట్ స్థాయిలో
సి) ఇంటర్నల్ ఆడిట్ స్థాయిలో
డి) పై మూడు స్థాయిలలో

**41) పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి RBI సమర్పించిన డేటా ప్రకారం, ప్రభుత్వ రంగ బ్యాంకులలో NPA లు ఎంత తగ్గాయి? (కోట్ల రూపాయలలో) (1.4.2017 నుండి 31.12.2017 మధ్య కాలంలో)**
ఎ) 1,50,960  బి) 84,272
సి) 41,391  డి) 25,297

**42) సిటిజెన్ షిప్ (అమెండ్ మెంట్) బిల్, 2016ను అధ్యయనం చేస్తున్న జాయింట్ పార్లమెంటరీ కమిటీ (JPC)కి ఛైర్‌పర్సన్ ఎవరు ?**
ఎ) సంతోష్ కుమార్ మొహంతి
బి) రాజేంద్ర అగ్రవాల్
సి) సుబ్రత భట్టాచార్జీ
డి) సంజీవ్ నాటియాల్

**43) నిఫా వైరస్ 1998లో తొలుత ఎక్కడ కనిపించింది?**
ఎ) బంగ్లాదేశ్  బి) మలేషియా
సి) పశ్చిమ బెంగాల్  డి) కేరళ

**44) 'నిఫా' వైరస్‌ని వ్యాప్తి చేసే 'గబ్బిలాలలో', భారత దేశంలో ఎన్ని జాతులున్నాయి, అంటున్నారు (టాక్సానమీ ఆర్డర్ ప్రకారం గబ్బిలం చిరోప్టేరా కిందకి వస్తుంది)?**
ఎ) 128  బి) 50  సి) 20  డి) ఇవేవి కావు

**45) రాష్ట్రాల గ్రీన్ GDP లెక్కించటానికి పైలట్ పద్ధతిన ఎన్ని జిల్లాలను ఎంచుకున్నారు?**
ఎ) 54  బి) 25  సి) 12  డి) 27

**46) RBI లో కొత్త డిప్యూటీ గవర్నర్ ఎవరు?**
ఎ) M.K. జైన్  బి) SS ముంద్ర
సి) R. గాంధీ  డి) విరల్ ఆచార్య

**47) అగ్ని–V క్షిపణి, 1.5 T వార్ హెడ్స్‌తో (అణు బాంబులతో) ఎంత దూరం ప్రయాణించగలదు (కి.మి.లలో)**
ఎ) 5,000  బి) 1,000  సి) 2,000  డి) 750

**48) APJ అబ్దుల్ కలాం దీవి (వీలర్ దీవి) నుండి ప్రయోగించిన క్షిపణిని, ఎన్ని రకాలుగా / స్టేషన్ల నుండి ట్రాక్ చేస్తుంటారు?**
ఎ) రాడార్  బి) ఎలక్ట్రో – ఆప్టికల్
సి) టెలిమెట్రి  డి) పైవన్నీ

**49) ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్ ?**
ఎ) అగలేగా దీవి : మారిషస్
బి) ఎ సంప్ షన్ : సీ షెల్స్
సి) చాగోస్ : డయాగో గార్షియా
డి) పైవన్నీ (హిందూ మహాసముద్రం ఉన్నాయి)

**50) యూనియన్ ఫైనాన్సు కమిషన్ (UFC) విధులను, భారత రాజ్యాంగంలో ఎన్నవ ఆర్టికల్‌లో పేర్కొన్నారు?**
ఎ) 280 (3)  బి) 212  సి) 74  డి) 52

**51) కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు, చట్టాల కల్పన, పనితీరును పరిశీలించటానికి లోక్‌సభ, రాజ్యసభలలో ఎన్ని స్టాండింగ్ కమిటీ లున్నాయి?**
ఎ) 24 (8 రాజ్యసభలో, 16 లోక్‌సభలో)
బి) 12  సి) 6  డి) 4

**52) 'బ్లూ ఫ్లాగ్ ట్యాగ్' (సర్టిఫికేషన్) అసియాలో తొలి సారిగా ఎక్కడున్న సముద్రపు బీచ్‌కి ఇచ్చారు?**
ఎ) చంద్రభాగ బీచ్ / సముద్రపు ఒడ్డు, కోణార్క్ తీరం, ఒడిశా.

బి) మెరీనా బీచ్ సి) చౌపాటి బీచ్
డి) విశాఖ పట్నం బీచ్

**53) 'బ్లూ ఫ్లాగ్ స్టాండర్డ్స్' ఎవరు స్థాపించారు?**
ఎ) WHO
బి) 1985లో కోపెన్ హెగెన్‌లో ప్రారంభించిన ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్
సి) ILO డి) UNIDO

**54) మే 2018లో మేకేను తూఫాన్ ఏ దీవిని తాకింది?**
ఎ) హవాయి బి) సోకోట్రా
సి) నికోబార్ డి) హెూప్ ఐలాండ్

**55) షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (SCO) సెక్రటరీ జనరల్ ఎవరు ?**
ఎ) రషీద్ అలిమోవ్
బి) షౌకత్ మిర్జి యో యేవ్
సి) చంద్ర భూషణ్ కుమార్
డి) మార్టిన్ విజ్ కార్ర

**56) 2009-10 లో భూమి చుట్టూ సముద్రంలో ప్రయాణించిన తొలి భారతీయుడు ఎవరు ?**
ఎ) కల్పనా చావ్లా బి) దిలీప్ దోండే
సి) రాకేష్ శర్మ డి) బంచేంద్రి పాల్

**57) ఇటీవల పేరు మార్చుకున్న, 'ఇండో పసిఫిక్ కమాండ్' ఏ దేశానికీ సంబంధించిన నావికా దళం?**
ఎ) USA బి) ఇండియా సి) జపాన్ డి) బ్రూనీ

**58) బ్రిటన్‌లో మహిళలకు 100 సంవత్సరాల క్రితం ఏ చట్టం ద్వారా ఓటు హక్కు కల్పించారు?**
ఎ) సిటిజెన్ షిప్ యాక్ట్
బి) రిప్రజెంటేషన్ ఆఫ్ ది పీపుల్ యాక్ట్ , 1918
సి) హయ్యర్ ఎడ్యుకేషన్ యాక్ట్
డి) ఇండస్ట్రియల్ యాక్ట్

**59) ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల సింగిల్స్ 11వ సారి కూడా గెల్చుకున్నది ఎవరు (2018లో)?**
ఎ) డొమినిక్ థీం బి) రాఫెల్ నాదాల్
సి) కె. శ్రీకాంత్ డి) రోజర్ ఫెదరర్

**60) ఇండియా - చైనాల మధ్య ట్రేడ్ డెఫిసిట్ US $ 36.73 బిలియన్‌లు. దీని తగ్గించు కోటానికి, భారతదేశం వేటిని చైనాకు ఎగుమతి చేయదల్చింది?**
ఎ) నాన్ - బాస్మతి బియ్యం & షుగర్
బి) సగ్గు బియ్యం
సి) సోయా బీన్స్ డి) కంది పప్పు

**61) భారతదేశానికి గల, 'చికెన్ నెక్' కారిడార్ దేన్ని కలుపుతుంది ?**
ఎ) ఈశాన్య రాష్ట్రాలు బి) ఆఫ్ఘనిస్తాన్
సి) పాకిస్తాన్ డి) శ్రీలంక

**62) 2018 ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ విజేత ఎవరు?**
ఎ) సిమోనా హాలెప్ బి) స్లోన్ స్టీఫెన్స్
సి) సెరేనా విలియమ్స్ డి) మరియా షెరపోవ

**63) అందరూ మహిళలే ఉన్న, INSV (ఇండియన్ నావెల్ సెయిలింగ్ వెస్సెల్) తారిణి ప్రత్యేకతలు ఏమిటి?**
ఎ) భూ మధ్య రేఖను రెండు సార్లు దాటటం
బి) అన్ని ప్రైమ్ మెరిడియన్‌లను దాటి, దక్షిణాన ఉన్న కేప్ లీవిన్, కేప్ హార్న్, కేప్ ఆఫ్ గుడ్ హెూప్ చేరటం.
సి) భూమి చుట్టు కొలత కన్నా (21,600 నాటికల్ మైళ్ళు), ఎక్కువ దూరం సముద్రంలో (అనగా 22,000 నాటికల్ మైళ్ళు) ప్రయాణించటం.
డి) పైవన్నీ

**64) ఛాంగీ ఎయిర్ పోర్ట్ ఎక్కడుంది?**
ఎ) సింగపూర్ బి) జపాన్
సి) తైవాన్ డి) చైనా

**65) 11వ వరల్డ్ హిందీ మీటింగ్ ఎక్కడ నిర్వహిస్తారు?**
ఎ) సీ షెల్స్ బి) మారిషస్
సి) సూరినాం డి) గ్వాటమాలా

**66) 18వ షాంఘై కోపరేషన్ ఆర్గనైజేషన్ (SCO)లో ఇండియా, పాకిస్తాన్ పూర్తి సభ్యత్వం ఉన్న దేశాలుగా క్వింగ్ డావో, చైనాలో పాల్గొన్నాయి. ఈ SCO గ్రూప్‌లో ఎన్ని దేశాలకి సభ్యత్వం ఉంది?**
ఎ) 3 బి) 8 సి) 10 డి) 7

**67) భారతదేశంలోనే తొలిసారిగా 'కాంప్రేహేన్సివ్ న్యూబోర్న్ స్క్రీనింగ్ (CNS) ప్రోగ్రాం అమలు చేస్తున్న రాష్ట్రం ఏది?**
ఎ) బీహార్ బి) కేరళ సి) హర్యానా డి) పంజాబ్

**68) 'బాడ్' బ్యాంకు అని వేటిని అనవచ్చును? వివరాలేవీ?**
ఎ) పబ్లిక్ సెక్టార్ అసెట్స్ రీహాబిలిటేషన్ ఏజెన్సీ (PARA)
బి) భారత దేశంలో ఉన్న 'ట్విన్ బాలన్స్ షీట్ ప్రాబ్లం' ను పరిష్కరించటానికి, ఇది పనికొస్తుంది.
సి) బ్యాంకుల NPA లను తీసుకుంటుంది.
డి) పైవన్నీ

**69) 19వ శతాబ్దంలో బంకిమ్ చంద్ర చటోపాధ్యాయ రచించిన 'ఆనంద్ మఠ్' నవలలో ఏ అంశం ప్రధాన ఇతివృత్తంగా ఉంది ?**
ఎ) సన్యాసి బిద్రోహి (18వ శతాబ్దం మలి భాగంలో జరిగిన సన్యాసుల విప్లవం ఆధారంగా దీని రాశారు)
బి) జలియన్ వాలా బాగ్
సి) బెంగాల్ విభజన
డి) సహాయ నిరాకరణోద్యమం

**70) ఇటీవల SCO మీటింగ్ సందర్భం గా భారత ప్రధాన మంత్రి తెలిపిన SECURE లో గల అంశాలు ఏవి?**
ఎ) S:సెక్యూరిటీ ఫర్ సిటిజన్స్ ; E: ఆర్థికాభివృద్ధి
బి) C: ప్రాంతంలో కనెక్టివిటీ ; U: యూనిటీ (ఐక్యత)
సి ) R: సార్వభౌమత్వానికి, ఇంటిగ్రీటికి గౌరవం ; E : పర్యావరణ పరి రక్షణ.
డి) పైవన్నీ

**71) USA & నార్త్ కొరియా దేశాలు ఒకరి నొకరు, ఎప్పటి నుండి శత్రువులుగా భావిస్తున్నాయి ?**
ఎ) 1950 - 53 నాటి కొరియా యుద్ధం నుండి
బి) మొదటి ప్రపంచ యుద్ధం
సి) ఫ్రెంచ్ విప్లవం
డి) అమెరికా సివిల్ వార్

**72) కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కావేరి వాటర్ మేనేజ్ మెంట్ అథారిటీ (CWMA) వివరాలేవీ? ఏమేమి చేస్తుంది? వివరాలేవీ?**
ఎ) ప్రతి సంవత్సరం జూన్ 1 నాటికి, నిర్ణయించిన రిజర్వాయర్లలో నీటి నిల్వలు నిర్ధారించటం
బి) ప్రతి రాష్ట్రానికి ఎంత నీరు విడుదల చెయ్యాలో తెలపటం
సి) దీని చైర్మన్ పదవీ కాలం 5 సంవత్సరాలు
డి) పైవన్నీ

**73) క్రీస్తు శకం 5వ శతాబ్దం నాటి బుద్ధ గుప్తా శిల ప్రకారం భారతదేశం నుండి ఏ దేశాలకి బౌద్ధ మతం వ్యాపించింది?**
ఎ) ఆగ్నేయ అసియా దేశాలకి
బి) రష్యాకి
సి) ఇంగ్లాండ్‌కి డి) ఫ్రాన్స్‌కి

**74) స్పెయిన్ దేశ కొత్త ప్రధాన మంత్రి ఎవరు?**
ఎ) మేరియానో రాజోయ్
బి) పెడ్రో శాంచేజ్ సి) విన్ మింట్
డి) కింజోంగ్ - ఉన్

**75) పాకిస్తాన్ దేశ నూతన ఆపద్ధర్మ ప్రధాన మంత్రి ఎవరు?**
ఎ) షాహిద్ ఖాకాన్ అబ్బాసీ
బి) నసీర్-ఉల్-ముల్క్
సి) మామ్ నూన్ హుస్సేన్
డి) నవాజ్ షరీఫ్

## జవాబులు (జూలై - 2018)

| | | | |
|---|---|---|---|
| 1-ఎ | 20-బి | 39-డి | 58-బి |
| 2-డి | 21-ఎ | 40-డి | 59-బి |
| 3-ఎ | 22-ఎ | 41-ఎ | 60-ఎ |
| 4-బి | 23-ఎ | 42-బి | 61-ఎ |
| 5-డి | 24-ఎ | 43-బి | 62-ఎ |
| 6-ఎ | 25-ఎ | 44-ఎ | 63-డి |
| 7-ఎ | 26-డి | 45-ఎ | 64-ఎ |
| 8-ఎ | 27-ఎ | 46-ఎ | 65-బి |
| 9-బి | 28-బి | 47-ఎ | 66-బి |
| 10-డి | 29-ఎ | 48-డి | 67-బి |
| 11-బి | 30-డి | 49-డి | 68-డి |
| 12-డి | 31-డి | 50-ఎ | 69-ఎ |
| 13-ఎ | 32-డి | 51-ఎ | 70-డి |
| 14-బి | 33-ఎ | 52-ఎ | 71-ఎ |
| 15-డి | 34-డి | 53-బి | 72-డి |
| 16-ఎ | 35-డి | 54-బి | 73-ఎ |
| 17-సి | 36-బి | 55-ఎ | 74-బి |
| 18-ఎ | 37-బి | 56-బి | 75-బి |
| 19-ఎ | 38-ఎ | 57-ఎ | |

# విమానయాన రంగంలో ఉడాన్ ప్రయోగం

- సింధు భట్టాచార్య

**ఎయిర్ పోర్ట్ అథారిటీ అఫ్ ఇండియా గణాంకాల ప్రకారం విమాన ప్రయాణాలలో ఢిల్లీ, ముంబై, బెంగుళూరు, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్ విమానాశ్రయాలదే పైచేయి. మొత్తం ఎయిర్ ట్రాఫిక్ (విమాన ప్రయాణీకులు) లో రెండింట మూడొంతుల వాటా ఈ ఆరు విమానాశ్రయాల ఖతాలోనే చేరింది. 'హవాయి చెప్పులు' (స్లిప్పర్స్) వేసుకున్న వారు కూడా 'హవాయి (విమాన) ప్రయాణం' చేయగలగాలి అనేది ప్రభుత్వ సంకల్పం. ఇందుకోసమే కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం ఏప్రిల్‌లో 'ఉడాన్' (UDAN) పథకాన్ని ప్రారంభించింది.**

మన దేశంలో విమానాశ్రయాలు చాలానే ఉన్నాయి. అయితే, చిత్రంగా అందులో కొన్ని పనిచేయని 'ఘోస్ట్' విమానశ్రయాలు గానే ఉండి పోయాయి. అలాగని అవేవి పనికి రానివి కాదు. పనికొస్తాయి. విమాన సేవలకు అనుకూలంగానే ఉన్నాయి. అయినా నిరుపయోగంగా ఉండి పోయాయి. ఒకటి రెండు కాదు వందల సంఖ్యలో అలాంటి 'ఘోస్ట్' విమానశ్రయాలు ఉన్నాయి. ఇదొక చిత్రమైన పరిస్థితి. మన దేశంలో విమానశ్రయాలు, ఎయిర్ స్ట్రిప్స్ అన్నీ కలిపి 400 లకు పైగా ఉన్నాయి. అయితే గత సంవత్సరం వరకు అందులో కేవలం 75 మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో కొన్ని 'ఘోస్ట్' ఎయిర్‌పోర్ట్స్ నిర్మించారు. యుద్ధం ముగిసిన తర్వాత అవి మూత పడ్డాయి. ఇందులో కొన్నిటికి మౌలిక సదుపాయాలు ఉన్నాయి. కొద్ది మొత్తాల్లో పెట్టుబడి పెడితే, ఇందులో చాలా వరకు తిరిగి పనిచేస్తాయి. ఇంకొన్ని విమానాశ్రయాలను వాణిజ్య ప్రయోజనాలకోసం కాకుండా కేవలం రాజకీయ అవసరాల కోసం, రాజకీయ ప్రయోజనాలను ఆశించి నిర్మించారు. అలాంటి వాటిలో చాలావరకు నిరుపయోగంగా ఉన్నాయి. అందులో కొన్ని అసలు ప్రారంభానికే నోచుకోలేదు, ఇంకొన్ని ప్రారంభమై అంతే వేగంగా మూత పడ్డాయి. మరో వంక మన దేశంలో విమాన సేవల వ్యాపారం చాలా వేగంగా అభివృద్ధి చెందుతోంది. అయినా, విమాన సేవలు ప్రధానంగా ఆరు నగరాలు ఆరు విమానాశ్రయాలకు పరిమితం. ఎయిర్ పోర్ట్ అథారిటీ అఫ్ ఇండియా గణాంకాల ప్రకారం ఢిల్లీ, ముంబై, బెంగుళూరు, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్ విమానాశ్రయాలదే పైచేయి. మొత్తం ఎయిర్ ట్రాఫిక్ (విమాన ప్రయాణీకులు) లో రెండింట మూడొంతుల వాటా ఈ ఆరు విమానాశ్రయాల ఖతాలోనే చేరింది. అలాగే, విమానాల రాక పోకలలో 60 శాతం వాటా ఈ ఆరు విమానాశ్రయాల నుంచే సాగుతోంది. అంటే, ఈ ఆరు విమానశ్రయాలు ఇటు విమాన సేవలు, అటు ప్రయాణీకుల సంఖ్య విషయంలో సర్వ సంతృప్తి స్థాయికి చేరుకున్నాయి అని వేరే చెప్పనక్కరలేదు.

ఇలా విమాన సదుపాయం కేవలం మహా నగరాలకే పరిమితం కావడంతో, ఇతర నగరాలు పట్టణాలు ఈ సదుపాయానికి నోచుకోవడం లేదు. చిన్నచిన్న విమానాశ్రయాలు వృధాగా పడిఉంటున్నాయి. ఇన్నేళ్ళ తర్వాత కేంద్ర ప్రభుత్వం ఈలోపాన్ని సరిదిద్దేందుకు నడుం బిగించింది. 'హవాయి చెప్పులు' (స్లిప్పర్స్) వేసుకున్న వారు కూడా 'హవాయి ప్రయాణం'

సీనియర్ జర్నలిస్టు, న్యూఢిల్లీ.
E-mail : sinjain@gmail.com

చేయగలగాలి అనేది ప్రభుత్వ సంకల్పం. ఇందు కోసంగా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, పట్టణాలలో విమాన ప్రయాణ సదుపాయం కల్పించాలని, సామాన్య ప్రజలకు కూడా, విమాన ప్రయాణ సదుపాయం అందుబాటులోకి తేవాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇలా చేయడంవలన వృథాగా పడి ఉన్న విమానాశ్రయాలు వినియోగంలోకి రావడంతో పాటుగా, గ్రామీణ ప్రాంతాల్లో నివశించే వ్యాపారులు, సామాన్య ప్రజలకు విమాన ప్రయాణ సదుపాయం కలుగుతుంది. ఇందుకోసమే కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం ఏప్రిల్ నెలలో 'ఉడాన్' (UDAN) పథకాన్ని ప్రారంభించింది. చిన్న చిన్న పట్టణాలు, ఇంతవరకు విమానాలు ప్రవేశించే అవకాశం లేని గిరిజన ప్రాంతాలు, అలాగే ఈశాన్య రాష్ట్రాలు అన్నీ కూడా ఇప్పుడు 'ఉడాన్' పథకం పరిధిలో మెల్లమెల్లగా ఏవియేషన్ మ్యాప్ లో చేరుతున్నాయి. ఉడాన్ (UDAN) అంటే, 'ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్', అంటే సామాన్య దేశ పౌరులకు విమాన సదుపాయం అని అనుకోవచ్చును. గత సంవత్సరం ఏప్రిల్ 27న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సిమ్లా – న్యూఢిల్లీ అలయన్స్ ఎయిర్ విమానానికి పచ్చ జెండా ఊపడంతో 'ఉడాన్' పథకాన్ని ప్రారంభించారు. అదే రోజున నాందేడ్ – కడప, కడప– హైదరాబాద్ విమానాలు కూడా ప్రారంభ మయ్యాయి. ఆసక్తిగల విమానయాన సంస్థలు పాల్గొనేందుకు వీలుగా రెండు మార్లు బిడ్డింగ్ నిర్వహించారు. తొలి బిడ్డింగ్ ద్వారా 31 ఘోస్ట్ ఎయిర్పోర్ట్స్ ను పునర్జీవింప చేయాలని రెండవ విడత బిడ్డింగ్ ద్వారా మరో 29 ఘోస్ట్ ఎయిర్పోర్ట్స్ను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది.

ఉదాహరణకు సిమ్లా విమానం విషయాన్ని తీసుకుంటే, మొదట్లో వారంలో ఐదు రోజుల పాటు ఈ విమానం నడిచింది. ఢిల్లీ– సిమ్లా మధ్య నడిచే ఈ విమానంలో మొత్తం 35 సీట్లున్నాయి. అయితే సిమ్లా విమానాశ్రయంలో అంక్షల కారణంగా తిరుగు ప్రయాణంలో 15 సీట్లు మాత్రమే ఉన్నాయి. ఈ విమానం రెక్కలు విచ్చుకోవడంతో 2012 నుంచి నిరుపయోగంగా ఉన్న సిమ్లా విమానాశ్రయం నుంచి మళ్ళీ విమానాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. అంతేకాదు, విమాన చార్జీలు అందరికి అందుబాటులో ఉండేలా నిర్ణయించారు. ఈ మార్గంలో విమానాలు నడపడం లాభదాయకం కాదని 2012 లో విమానయాన సంస్థలు ఆపరేషన్స్ అపివేసాయి. మరి అలాంటి విమానశ్రయాని ఎయిర్ ఇండియా మళ్ళీ ఎందుకు పునరుద్ధరించింది? ఎందుకంటే, 'ఉడాన్' పథకం పరిధిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ ఇచ్చేందుకు అంగీకరించాయి. ఇందుకోసంగా ముందుగానే వైయబిలిటి గ్యాప్ ఫండింగ్ (విజీఎఫ్) ఫార్ములాను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించాయి. ఇక, ఈవిమానం ఆర్థిక లావాదేవీల విషయంలోకి వస్తే, చాలా ఆసక్తి కలిగించే అంశాలు అనేకం ఉన్నాయి. ఈ విమానంలో ప్రతి సీటుకు ఇచ్చే సబ్సిడీ కొంచెం అటూఇటుగా రూ. 3,300 వరకు ఉంటుంది. ఉడాన్ విమానాల విజీఎఫ్ ఫార్ములా ప్రకారం ప్రతి విమానంలో ప్రతి సీటుకు 50 శాతం సబ్సిడీ ఉంటుంది. అలాగే మూడేళ్ళ పాటు ఆ రూటులో మరో విమానయాన సంస్థ కాలు పెట్టదు. అంటే, బిడ్డర్ సంస్థదే గుత్తాధిపత్యం. అదే విధంగా లాండింగ్ ఎయిర్ పోర్టులలో చీప్ ఫ్యూయల్, ఎయిర్ పోర్ట్ చార్జీల మినహాయింపు వంటి అనేక ఇతర రాయితీలు కూడా ఉంటాయి. ఇందుకు ప్రతిఫలంగా ఎయిర్ లైన్ ఆపరేటర్ ఉడాన్ సీట్ల చార్జీలకు గంటకు లేదా 500 కి.మీ ప్రయాణానికి రూ. 2,500 పరిమితిని విధించింది.

ఇక విజీఎఫ్ కు నిధులు ఎలా వస్తాయి? అనే విషయానికి వస్తే, రద్దీ ఎక్కువగా ఉండే విమానశ్రయం నుంచి బయలుదేరే ప్రతి విమానం ప్రభుత్వానికి రూ. 5000 చెల్లిస్తాయి. ఆ విధంగా ఉడాన్ చార్జీలకు క్రాస్ సబ్సిడీ లభిస్తుంది. ఈ లెవీ లాభదాయక రూట్లకు మాత్రమే వర్తిస్తుంది. ఉడాన్ ప్రారంభ సంవత్సరంలో రూ. 300 కోట్లు లెవీ వచ్చింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వరసగా మరో రూ. 60 కోట్లు, రూ. 200 కోట్లు అదనంగా సమకూర్చాయి. ఈ రూ. 560 కోట్లు ఉడాన్ తొలి సంవత్సరం 12 నెలల విజీఎఫ్ గా చెల్లించారు.

ప్రారంభం నాటి నుంచి మొదటి 12 నెలలో చూపించిన ప్రగతే ఉడాన్ విజయానికి కొలమానం. తొలి సంవత్సరంలో సిమ్లా – ఢిల్లీ విమానంలో 12,000 మంది ప్రయాణీకులు ప్రయాణించారు. సగటు లోడ్ ఫాక్టర్ 90 శాతం. (మొత్తం సీట్లలో భర్తీ అయిన సీట్ల శాతాన్ని లోడ్ ఫాక్టర్ అంటారు). సిమ్లా – ఢిల్లీ విమానంలో ఉడాన్ చార్జీలు సగటున సీటుకు రూ. 1970. ఇతర విమానాల సగటు చార్జి రూ. 4000.




ఉడాన్ ప్రాధాన్యతను తెలిపే మరో అంశం..మరో ఉదాహరణ...త్వరలోనే తూర్పు సిక్కిం రాష్టంలోని పాక్యోంగ్ (PaKyong) మన ఏవియేషన్ మ్యాప్లో చేరుతోంది. స్పైస్ జెట్ బొంబార్డియర్ క్యూ 400 డిల్లీకి విమానం నడిపేందుకు సంసిద్ధత తెలియచేసింది. స్పైస్ జెట్ సిక్కిం రాజధానికి 35 కి.మీ దూరంలోని పాక్యోంగ్ నుంచి ఢిల్లీకి మాత్రమే కాకుండా గౌహతి, కోల్కతాలకు కూడా విమానలను నడపాలని నిర్ణయించింది. ఉడాన్ పథకం పుణ్యాన తిరిగి ప్రాణం పోసుకున్న ఘోస్ట్ విమానాశ్రయాలలో పంజాబ్ లోని అదంపూర్, భటిండా, పఠాన్ కోట, రాజస్థాన్లోని బికనీర్, జైసల్మేర్, గుజరాత్లోని భావనగర్, జామ్నగర్,

ముంద్రా మరికొన్ని ఉన్నాయి. ఉడాన్ పథకం ద్వారా నిరుపయోగంగా పడిఉన్న ఘోస్ట్ ఎయిర్పోర్ట్స్ మాత్రమే కాదు, పరిమితంగా పనిచేస్తున్న విమానాశ్రయాలు కూడా ప్రయోజనం పొందుతున్నాయి.

ఉడాన్ పథకం కింద ఘోస్ట్, వాస్తవ సామర్థ్య స్థాయికి దిగువున పనిచేస్తున్న విమానాశ్రయాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూ. 4,500 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని ఎయిర్పోర్ట్ అథారిటీ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న విమానాశ్రయాలను వినియోగంలోకి తీసుకువచ్చి, విమానాల రాకపోకలు ప్రారంభానికి ముందు డిజీసీఏ లైసెన్స్ ఇవ్వవలసిన అవసరం ఉంది. ఈ దిశలో అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే, ఛత్తీస్ఘర్ లోని జగదల్పూర్ విమానశ్రయానికి లైసెన్స్ మంజూరైంది. అలాగే, అంబికాపూర్ కూడా లైసెన్స్ మంజూరుకి సిద్ధంగా ఉంది. బిలాస్పూర్లో పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఒరిస్సాలో ఝూర్సాగూడ నుంచి విమానాల రాక పోకలు ప్రారంభమయ్యాయి. ఉత్కేల్, జయపూర్ నుంచి త్వరలో ప్రారంభమవుతాయి. మన దేశంలో డొమెస్టిక్ ఏవియేషన్ మార్కెట్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ అభివృద్ధి సుస్థిరం కావాలంటే ప్రాతీయ కనెక్టివిటీ చాలా కీలకం. మెట్రో నగరాల్లో ఎయిర్పోర్ట్ సామర్థ్యాన్ని పెంచడం అవసరమే , కాదనేది లేదు, కానీ, అంతకంటే, ప్రాతీయ విమానాశ్రయాలను అభివృద్ధి చేయడం, ప్రాంతీయ కనెక్టివిటీని మెరుగుపరుచు కోవడం మరింత కీలకమని నిపుణులు చెపుతున్నారు.

ఉడాన్ పథకం పరిధిలో విజీఎఫ్ కేవలం స్థిరపడిన విమానయాన సంస్థలనే కాదు, కొత్తగా విమానయాన రంగంలో అడుగు పెట్టిన ఎయిర్ డెక్కన్, ఎయిర్ ఒడిషా వంటి సంస్థలను కూడా ఆకర్షిస్తోంది. మొదటిదశలో కొత్త విమాన సంస్థలు ఆర్సీస్ (RCS) రూట్లలో అధిక భాగాన్ని సొంతం చేసుకున్నాయి. ఇప్పుడు పెద్ద పెద్ద సంస్థలు కూడా ముందుకు వస్తున్నాయి. ఇండిగో, స్పైస్ జెట్, జెట్ ఎయిర్వేస్ వంటి దిగ్గజ సంస్థలు ఉడాన్ పథకంలో పాలుపంచుకునేందుకు ఉత్సాహం చూపుతు న్నాయి.

అయితే ఉడాన్ పథకం అంతా అనుకున్నట్లే ముందుకు సాగుతోందా అంటే లేదు. నిరుపయోగంగా ఉన్న లేదా పూర్తి సామర్థ్యం వినియోగంలోలేని విమానాశ్రయాలు అన్నీ వినియోగంలోకి రాలేదు. అలాగే, బిడ్స్ వేసిన (కొత్త పాత) విమానయాన సంస్థలు అన్నీ ఆయా రూట్లలో విమానాల రాకపోకలను ప్రారంభించలేదు. అదే విధంగా ఉడాన్ పథకం పరిధిలో హెలికాప్టర్ సేవలు అసలుకే ఆరంభం కాలేదు.

ఉడాన్ పథకం పరిధిలో రంగప్రవేశం చేసిన చాలా వరకు సంస్థలకు పూర్వ అనుభవం అంతగా లేదు. ఆర్థికంగా ఒడిదుడుకులను ఎదుర్కుంటున్నాయి. మారుమూల ప్రాంతాలకు విమానాలను నడిపేందుకు అవసరం అయిన లాజిస్టిక్స్ కుదరక సమస్యలు ఎదుర్కొంటున్నాయి. మొదటి బిడ్డింగులో ఐదు విమానయాన సంస్థలు 128 రూట్లలో విమానాలు నడిపేందుకు ముందుకొచ్చాయి. ఇవన్నీ కూడా 2017 సెప్టెంబర్ నాటికి విమానాలను నడపవలసింది. కానీ గడువు ముగిసి సంవత్సరం అవుతున్నా ఇంకా సగం రూట్లలో అయినా విమానాలు తిరగడం లేదు. అలయన్స్ ఎయిర్, స్పైస్ జెట్, ట్రూ జెట్ లాంటి పెద్ద సంస్థలు వాటికి కేటాయించిన చాలావరకు రూట్లలో విమానాలు నడుపుతున్నాయి. అయితే, ఎయిర్ ఒడిశా, ఎయిర్ డెక్కన్ లాంటి కొత్త సంస్థలు వాటికి కేటాయించిన రూట్లలో 15 శాతం రూట్లలో మాత్రమే విమానాలు నడుపుతున్నాయి. ఎయిర్ ఒడిశాకు మొత్తం 50 రూట్లను కేటాయిస్తే అందులో కేవలం ఎనిమిది రూట్లలో మాత్రమే విమానాలు ఎగురుతున్నాయి. అలాగే ఎయిర్ డెక్కన్ సంస్థకు మొత్తం 34 రూట్లను కేటాయిస్తే కేవలం 10 రూట్లలో మాత్రమే విమానాలు ఎగురుతున్నాయి. జెట్ జూన్లో, ఇండిగో, స్పైస్ జెట్ జూలై నెలలో ఆపరేషన్స్ ప్రారంభించవచ్చును.

ఇక సేవల నాణ్యత విషయానికి వస్తే, ఉడాన్ సేవలు ఆశించిన విధంగా లేవు. ఎయిర్ ఒడిశా, ఎయిర్ డెక్కన్ విమానాలలో డిజిసిఎ (DGCA) డేటా ప్రకారం ఏప్రిల్ మాసంలో కేవలం ఒక వంతు సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. అలాగే దేశీయ విమాన సర్వీసులలో రద్దయిన విమానాల లెక్కల్లోనూ ఈ రెండు సంస్థలే ముందువరసలో ఉన్నాయి. కనుకనే, సహజంగానే, ప్రయాణీకుల ఫిర్యాదులలో ప్రథమ స్థానంలో నిలిచాయి. కొత్తగా అరంగేట్రం చేసిన ఈ విమానయాన సంస్థలు మౌలిక సదుపాయాల సమస్యలతో సతమతమవుతున్నాయి. ఇంకొంత కాలం పోతేనే గానీ, కొత్త సంస్థలు గాడిన పడే అవకాశం కనిపించడం లేదు. హెలికాప్టర్ సేవలు లేక పోవడం ఉడాన్ ముందున్న మరో ప్రధాన సమస్య. విజిఎఫ్ తగినంతగా లేదన్న కారణంగా మొదటి రౌండ్లో హెలికాప్టర్లకు బిడ్స్ రాలేదు. రెండవసారి, షెడ్యూల్ హెలికాప్టర్ల నిబంధనలు ఖరారు కాకపోవడంతో ఉడాన్ పరిధిలో హెలికాప్టర్లకు ఇంకా స్థానం దక్కలేదు. అందుకే ఇంకా విధివిధానాలు సక్రమంగా, సంపూర్ణంగా రూపొందలేదు.

చివరగా చెప్పుకోవల్సిన మరో ముఖ్య విషయం, తమకు నచ్చిన ఉడాన్ రూట్లను సొంతం చేసుకున్న ఆపరేటర్లు మూడేళ్ళ విజీఎఫ్ కాలం ముగిసిన తర్వాత విమానాలను నడపలేక పోవచ్చును. ముఖ్యంగా చమురు ధరలు పెరుగుదల ప్రతిబంధకంగా మారే అవకాశం ఉంది. ఉడాన్ విమానాలను మరింత ఆకర్షణీయంగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం మూడు సంవత్సరాల నిబంధనను తొలిగించేందుకు ఇప్పటికే సిద్ధం అయింది. అయినా దీర్ఘ కాలంలో ఉడాన్ ఎంతవరకు లాభదాయకంగా ఉంటుంది, ఎంతవరకు నిలబడగల్గుతుంది, అనేది ప్రస్తుతానికి శేష ప్రశ్నగానే ఉంది. ■

# అందరికీ అందుబాటులో గృహాలు

– డాక్టర్ రంజిత్ మెహతా

సొంత ఇల్లు ఏర్పాటు అన్నది ప్రతి మనిషికి కనీస మానవ హక్కుగా గుర్తింపు పొందింది. భారత రాజ్యాంగంలోని జీవించే హక్కులో అది ఒక భాగంగా మారింది. ఇటీవల ప్రపంచ దేశాలు ఆమోదించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ) ప్రకటన కూడా 2030 నాటికి అందరికీ గృహవసతి కల్పనను సాకారం చేయాలని నిర్దేశించింది. నేటికీ దేశంలో దాదాపు అయిదు కోట్ల కుటుంబాలకు ఇళ్లు లేవు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు నిండేనాటికి దేశంలోని ప్రతి వ్యక్తికీ ఇల్లు ఉండాలన్న లక్ష్యంతో 'ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస యోజన'ను కేంద్రం ప్రారంభించింది.

మనిషి మనుగడకి నివాసం అనేది ఒక కనీస అవసరం. ఇల్లు అనేది, గ్రామీణ పేదలకి బతుకును అందిస్తుంది. సమాజంలో ప్రజలు స్పష్టమైన, సురక్షితమైన గుర్తింపు పొంది మర్యాదకర జీవనానికి నివాసం పునాది వేస్తుంది. పేదరికాన్ని తొలగించడానికి, గృహాల కొరతని తగ్గించడం చాలా ముఖ్యమైనది. ప్రతి పౌరుడు గౌరవప్రదంగా జీవించడానికి పరిశుభ్రమైన నివాసం ఎంతో అవసరం. ఎండ, చలి, వానల నుంచి కుటుంబానికి అది రక్షణ కల్పిస్తుంది. సామాజికంగానే కాదు, ఆర్థికంగానూ కుటుంబానికి భరోసా కల్పిస్తుంది. అందుకే సొంత ఇల్లు ఏర్పాటు అన్నది ప్రతి మనిషికి కనీస మానవ హక్కుగా గుర్తింపు పొందింది. భారత రాజ్యాంగంలోని జీవించే హక్కులో అది ఒక భాగంగా మారింది. ఇటీవల ప్రపంచ దేశాలు ఆమోదించిన స్థిర జీవనాభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ) ప్రకటన కూడా 2030నాటికి అందరికీ గృహవసతి కల్పనను సాకారం చేయాలని నిర్దేశించింది. భారత రాజ్యాంగంలోని 21వ అధికరణలో పొందుపరచిన జీవించే హక్కులో గృహకల్పన కూడా భాగమని దేశ అత్యున్నత న్యాయస్థానం అనేక సందర్భాల్లో స్పష్టీకరించింది.

మరోవైపు అదే క్రమంలో దేశజనాభా పెరుగుతూ వచ్చింది. పేదరికమూ కొనసాగుతోంది. దీంతో ఎప్పటికప్పుడు గృహనిర్మాణ పథకాలూ అవసరమవుతూ వచ్చాయి. నేటికీ దేశంలో దాదాపు అయిదు కోట్ల కుటుంబాలకు ఇళ్లు లేవు. శిథిలావస్థకు చేరుకుంటున్న ఇళ్లలో అనేకమంది బతుకులీడుస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి భారతీయుడికి, ముఖ్యంగా సొంతింటి కల నెరవేర్చాలన్న ఉద్దేశంతో మోడీ సర్కారు ఒక భారీ ప్రణాళికను చేపట్టింది. అదే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం. దీని ద్వారా పట్టణ పేదలకు ఆర్థిక సాయాన్ని అందించేందుకు ప్రయత్నిస్తున్నారు. 2015 జనవరిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2022 సంవత్సరాన్ని ఈ పథకానికి తుది గడువుగా నిర్ణయించారు. అప్పటికల్లా అందరికీ ఇళ్లు ఉండాలనేది ప్రధాని మోదీ తన స్వప్నమని చాటారు.

అనేక సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మించి ఇవ్వడానికి అనేకానేక పథకాలు రూపొందిస్తూ వచ్చాయి. మరోవైపు అదే క్రమంలో దేశజనాభా పెరుగుతూ వచ్చింది. పేదరికమూ కొనసాగుతోంది. దీంతో ఎప్పటికప్పుడు గృహనిర్మాణ పథకాలూ అవసరమవుతూ వచ్చాయి. నేటికీ దేశంలో దాదాపు అయిదు కోట్ల కుటుంబాలకు

పంజాబ్, హర్యానా, ఢిల్లీ వాణిజ్య మండలి అధ్యక్షుడు, న్యూఢిల్లీ.
E-mail : ranjeetmehta@gmail.com

ఇళ్లు లేవు. శిథిలావస్థకు చేరుకుంటున్న ఇళ్లలో అనేకమంది బతుకులీడుస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం '2022నాటికి అందరికీ ఇళ్లు' మిషన్‌ను ప్రారంభించింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు నిండేనాటికి దేశంలోని ప్రతి వ్యక్తికీ ఇల్లు ఉండాలన్న లక్ష్యంతో 'ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస యోజన'ను కేంద్రం ప్రారంభించింది. ఇందులో భాగంగా 2022నాటికి దాదాపు అయిదు కోట్ల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేయాలని సంకల్పించింది. వీటిలో మూడు కోట్ల గృహాలను గ్రామీణ భారతంలోనే నిర్మించాలని నిర్ణయించారు.

మన ఆర్థిక వ్యవస్థలో నల్లధనం పెరిగేకొద్దీ, సొంత ఇల్లు అనేది మధ్య తరగతి ప్రజలకి కలగా మారింది. దేశ ప్రక్షాళనకు నడుం బిగించిన ప్రధాని మోదీ నిరుపేదలు, మధ్య తరగతి ఇల్లు నిర్మించుకునేందుకు వారి సొంతింటి కల తీర్చేందుకు సిద్ధమయ్యారు. పట్టణ ప్రాంత వాసులందరికీ సొంత ఇల్లు ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. పథకంలో భాగంగా ఇందుకు కేంద్ర ప్రభుత్వం తన వంతు సాయం అందించేందుకు ముందుకు రావడం సంతోషం. సామాన్య, మధ్య తరగతి ప్రజలందరు రుణంపై ఇల్లు సమకూర్చుకునేందుకు వీలుగా కొంత భారాన్ని కేంద్రం మోస్తోంది. రుణంపై చెల్లించే వడ్డీలో సబ్సిడీ అందిస్తోంది.

**అందరికీ ఇళ్లు బృహత్తర ఆశయం..**

దేశ జనాభాలో 68 శాతం గ్రామాల్లోనే నివసిస్తున్నారు. వీరిలో ఎనభై లక్షల కుటుంబాలకు ఉండటానికి ఇళ్లు లేవని జాతీయ నమూనా సర్వే కార్యాలయం (ఎన్ఎస్ఎస్ఓ) అధ్యయనం తేల్చిచెప్పింది. సామాజిక, ఆర్థిక, కుల గణాంకాల అధ్యయనం (2011) ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని, కచ్చా ఇళ్లల్లో నివసిస్తున్న కుటుంబాలు కోటి వరకు ఉన్నాయి. 2019 నాటికి ఈ కుటుంబాలకు పక్కా ఇళ్లు నిర్మించాలని, 2022నాటికి మరో రెండు కోట్ల ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి ఆవాస యోజనలో గ్రామీణ ప్రాంత పథకాన్ని ప్రారంభించింది. వీటిలో ఇప్పటికి 19 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మరో 22 లక్షల ఇళ్ళు మంజూరు అయ్యాయి. ఈ సంవత్సరం 51 లక్షల ఇళ్ల నిర్మాణం కోసం కేంద్ర బడ్జెట్‌లో రూ.21వేల కోట్లను కేంద్రం ప్రత్యేకించింది. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారు కుటుంబానికి నిధులు మంజూరు చేస్తారు. మైదాన ప్రాంతాల్లో రూ. 1.20 లక్షలు, కొండ ప్రాంతాలు, తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలు, అననుకూల ప్రాంతాల్లోని వారికి రూ. 1.30 లక్షలు ఇస్తారు. నిర్మించుకున్న ఇళ్లకు వివిధ పథకాల ద్వారా రక్షిత మంచినీరు, వంటగ్యాస్, విద్యుత్ కనెక్షన్లు, మరుగుదొడ్డి సౌకర్యాలు కల్పిస్తారు. ఇంటి నిర్మాణ వ్యయంలో 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్రం భరిస్తాయి. 2019 నాటికి కోటి ఇళ్ల నిర్మాణాన్ని సాకారం చేయడానికి రూ. 1,30,075 కోట్లు ఖర్చవుతాయి. ఇందులో రూ. 60,000 కోట్లు కేంద్రం బడ్జెట్‌లో కేటాయిస్తుంది. మరో రూ. 21,975 కోట్లు నాబార్డ్ ద్వారా అంద జేస్తారు. మిగతా ఖర్చు రాష్ట్రాలు భరించాలి. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించే ఇళ్లలో 60 శాతం ఎస్సీ ఎస్టీలకు, 15 శాతం మైనారిటీలకు, మూడు శాతం వికలాంగులకు కేటాయిస్తారు. ఇంటి నిర్మాణంలో జాతీయ సాంకేతిక సహాయ సంస్థ అవసరమైన సహకారం అందిస్తుంది. ప్రభుత్వ నిధులతోపాటు అదనపు మొత్తాలు అవసరమైతే రూ.70 వేల వరకు బ్యాంకుల నుంచి రుణాలు పొందవచ్చు. లబ్ధిదారులు కాలేని గ్రామీణులు ఇంటిని నిర్మించుకోవడానికీ రుణ సబ్సిడీ పథకం అక్కరకు వస్తుంది. ఇందులో బ్యాంకులు, ఇతర సంస్థలు లబ్ధిదారులకు 20 ఏళ్లలో తీర్చేలా రెండు లక్షల రూపాయల రుణం మంజూరు చేస్తాయి. ఇందుకు స్వల్పంగా మూడు శాతం వడ్డీ విధిస్తారు.

**మొత్తం దేశ జనాభాలో పట్టణవాసులు 1901లో 11.4 శాతం. 2011 నాటికి వారి సంఖ్య 32 శాతానికి పెరిగింది. 2030నాటికి దేశంలోని సగం జనాభా పట్టణాల్లోనే నివాసం ఉంటుందని అంచనా.** పట్టణాల్లో ప్రతి మనిషికీ ఆవాసం ఏర్పాటు చేయడం ప్రభుత్వాల ముందున్న అతిపెద్ద సవాలు. 2015లో ప్రపంచ దేశాలు ఆమోదించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల ప్రకారం 2030నాటికి పట్టణాల్లో అందరికీ ఇళ్లు అందుబాటులోకి తేవాలని నిర్దేశించుకున్నారు. 'పట్టణాల్లో అందరికీ ఇళ్లు' పథకాన్ని 2015-2022 మధ్యకాలంలో మూడు దశలుగా దేశంలోని 4,041 పట్టణాల్లో అమలుచేస్తారు. మురికివాడల్లో నివసిస్తున్నవారికి పునరావాసం, ఆర్థికంగా వెనకబడిన, అల్పాదాయ కుటుంబాలకు తక్కువ వడ్డీతో ఇళ్ల నిర్మాణం, ప్రైవేటు భాగస్వామ్యంతో పరిమిత వ్యయంతో గృహవసతి ఈ పథకంలో ప్రధాన అంశాలు.

అలాగే మొత్తం దేశ జనాభాలో పట్టణ వాసులు 1901లో 11.4 శాతం. 2011 నాటికి వారి సంఖ్య 32 శాతానికి పెరిగింది. 2030నాటికి దేశంలోని సగం జనాభా పట్టణాల్లోనే నివాసం ఉంటుందని అంచనా. పట్టణాల్లో ప్రతి మనిషికీ ఆవాసం ఏర్పాటు చేయడం ప్రభుత్వాల ముందున్న అతిపెద్ద సవాలు.

**ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (2022 నాటికి అందరికీ ఇళ్లు) :**

ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు ఏడాది ఆదాయం రూ. 3 లక్షల లోపు ఉండాలి. వీరికి రకరకాల సబ్సిడీలు వస్తాయి. గృహ రుణానికి వడ్డీ రాయితీ లభిస్తుంది. మామూలుగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలంటే రూ. 3 లక్షల లోపు ఆదాయం ఉండాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని బట్టి మారుతూ ఉండొచ్చు.

మీరు ఆర్థికంగా వెనుకబడిన కేటగిరీలో ఉంటే 15 ఏళ్లకి మీరు తీసుకున్న దానికి 6.5 శాతం సబ్సిడీ వస్తుంది. రూ. 6 లక్షల వరకూ ఈ సదుపాయం ఉంది. దానికి మించి తీసుకునే రుణాలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద మార్కెట్ వడ్డీ రేటు అమలవుతుంది.

ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారి ఇల్లు ఉండే కార్పెట్ ఏరియా 30 చదరపు మీటర్లుగా ఉండాలి.

మీ కుటుంబ ఆదాయం రూ. 3 లక్షల లోపు ఉంటే కేంద్ర ప్రభుత్వం మీకు ఇల్లు కట్టుకోవడానికి రూ.లక్షా 50వేల ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ఇందుకోసం మీరు పట్టణ ప్రాంత స్థానిక, నగర పాలక సంస్థల అధికారులను మీకు ఉన్న స్థల పత్రాలను, ఇతర పత్రాలతో సంప్రదించాలి. ఇందుకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఈ పథకంలో ఆర్థిక సాయం చేస్తే ఇల్లు కట్టుకునే ఖర్చు మరింత తగ్గుతుంది.

రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కేంద్రం ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి రూ. 1.5 లక్ష సాయం అందిస్తోంది. అంతే కాకుండా ఇళ్లను లాభం, నష్టం లేకుండా నిర్మించే ప్రణాళికతో తక్కువ ధరకు ఇళ్లను నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారు

ప్రధాన మంత్రి ఆవాస యోజనలో మెచ్చుకోదగ్గ అంశం మురికి వాడల్లో ఉండే వారికి సొంత ఇళ్లను నిర్మించాలనుకోవటం. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సొంత స్థలం లేదా ప్రయివేటు భూములను వినియోగిస్తారు. పై ప్రయోజనాలతో పాటు మురికివాడల అభివృద్ధి ఉద్దేశంతో మురికివాడల పునరావాసానికై లక్ష రూపాయల గ్రాంటును ఇస్తున్నారు. ఇందులో రెండు అంశాలు ఉన్నాయి. మొదటిది మురికివాడల పునరావాసం, అంటే ఆ ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పన. ఇంకో అంశం డెవలపర్ ఆ ప్రాజెక్టును ప్రయివేటు రంగానికి విక్రయించడం.

అర్హత ఉన్న వ్యక్తులెవరైనా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా లబ్ది పొందొచ్చు. రూ. 3 లక్షల ఆదాయం అని నిర్దేశించి ఉన్నందున దేశంలో కొన్ని కోట్ల మంది ఆ కేటగిరీలోకి వస్తారు. అల్ప ఆదాయ వర్గం అనే కేటగిరీలో రూ. 3 లక్షల ఆదాయం నుంచి రూ. 6 లక్షల ఆదాయం ఉండాలని నిర్దేశించారు. ఈ కేటగిరీలో సైతం చాలా మంది ఉంటారు. అల్పాదాయ వర్గాల వారికి 60 చదరపు మీటర్లను అర్హతగా నిర్ణయించారు.

మీరు తీసుకునే గృహ రుణానికి వడ్డీ సబ్సిడీ ఇవ్వడమే కాకుండా, ఇల్లు కట్టుకునేందుకు నేరుగా ఆర్థిక సాయం చేయడం చెప్పుకో తగ్గ అంశం. అర్హత కలిగిన వారంతా దరఖాస్తు చేయడానికి ప్రయత్నించవచ్చు. **ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేముందు గుర్తుంచుకోవాల్సిన అంశం మీకు ఇంతకు ముందు సొంత ఇల్లు ఉండకూడదు.**

**ప్రధాన మంత్రి ఆవాస యోజన బడ్జెట్ కేటాయింపులు :**

- 2017 - 18 కేటాయింపులు రూ.23,000 కోట్లు.
- 2016-17లో కేటాయింపులు రూ.15,000 కోట్లు. పెంపు 53.3 %.
- 2022 కల్లా దేశంలో అందరికీ సొంతింటి కలను సాకారం చేస్తామంటున్న మోదీ సర్కారు ఈ బడ్జెట్‌లో చౌక గృహ నిర్మాణ రంగానికి ప్రోత్సాహకాలను ప్రకటించింది.
- జాతీయ హౌసింగ్ బ్యాంకులో అందుబాటు ధరల గృహాల నిధి(ఏహెచ్ఎఫ్) ఏర్పాటు.
- ప్రభుత్వ అధీకృత బాండ్లు, ఇతర మార్గాల ద్వారా నిధులు సమీకరణ.
- ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద గ్రామీణ ప్రాంతాల్లో 2018-19లో 51 లక్షల ఇళ్ల నిర్మాణం. ఇప్పటికే 2017-18లో 51 లక్షల ఇళ్ల కేటాయింపు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో కోటికిపైగా ఇళ్ల నిర్మాణానికి అవకాశం ఏర్పడుతుంది.
- పట్టణ ప్రాంతాల్లో 37 లక్షల గృహాల నిర్మాణానికి సాయం.
- దారిద్ర్యరేఖకు దిగువన (బీపీఎల్) ఉన్న కుటుంబాలు, ఎస్సీ/ ఎస్టీలు, వికలాంగులు, బీపీఎల్ మైనారిటీలు ఈ పథకంలో లబ్ధిదారులు. వీరికిచ్చే నిధుల్లో 75 శాతం కేంద్రం, 25 శాతం రాష్ట్రాలు భరిస్తాయి.
- ప్రధాన ప్రాంతాల్లో పేదలకు ఒక్కో ఇంటికి రూ.1.2 లక్షలు, కొండ ప్రాంతాలు, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో రూ.1.3 లక్షల చొప్పున సాయాన్ని ఇస్తున్నారు.
- స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ సెప్టిక్ మరుగుదొడ్డి నిర్మాణాన్ని తప్పనిసరి చేశారు.
- పీఎంఏవై కిందకు రాని గ్రామీణ కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం, ఆధునికీకరణకు తీసుకునే రుణాల్లో రూ.2 లక్షల వరకూ మొత్తంపై 3 శాతం వడ్డీ రాయితీని కూడా ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

**అందుబాటులో ఇళ్ల నిర్మాణానికి మౌలికరంగ హోదా :**

2018-19 బడ్జెట్‌లో సామాన్యుల సొంతింటి కలను సాకారం చేసేందుకు బడ్జెట్ మార్గం సుగమం చేసిందనే చెప్పాలి. 2019 నాటికి దేశంలో కోటి గృహాలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ ఆశయానికి ... కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ దానికి ప్రణాళిక రచించారు. అందుకు అనుగుణంగానే అందుబాటు గృహాల విభాగానికి మౌలిక రంగ హోదానిచ్చారు. గతేడాది రూ.15 వేల కోట్లుగా ఉన్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంవైఏ) కేటాయింపును ఈసారి బడ్జెట్‌లో రూ.23 వేల కోట్లకు పెంచారు. అలాగే అందుబాటు గృహాలను నిర్మించే డెవలపర్లను ప్రోత్సహించేందుకు గాను 80-ఐబీఏ సెక్షన్‌ను సవరించారు కూడా. ప్రస్తుతం మూడేళ్లుగా ఉన్న అందుబాటు ఇళ్ల ప్రాజెక్ట్ నిర్మాణ గడువును 5 ఏళ్లకు పెంచారు.

మౌలిక రంగ హోదా ఇవ్వటం వల్ల అఫర్డబుల్ ఇళ్లను నిర్మించే కంపెనీలకు ఇన్‌ఫ్రా రంగానికిచ్చే వడ్డీ రేటుతో రుణాలు లభించే అవకాశముంటుంది. అంటే తక్కువ వడ్డీకే అన్నమాట. దీనివల్ల అవి నిర్మాణానికి ముందుకొస్తాయి. ఆ మేరకు కలిగే లాభాన్ని

వినియోగదారులకు బదలాయించే అవకావం కూడా ఉంటుంది.

**నేషనల్ హౌజింగ్ బ్యాంక్ :**

గృహ రుణాలు అందించే బ్యాంకులకు 2017-18కి గాను నేషనల్ హౌసింగ్ బ్యాంక్ ద్వారా రూ.20 వేల కోట్ల రుణాలను అందించనున్నారు. మధ్య ఆదాయ వర్గాల కోసం కొత్తగా క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ పథకాన్ని ప్రకటించారు. ఈ పథకం కింద రూ.1,000 కోట్లు కేటాయించారు. అలాగే నివాస విభాగంలో అమ్ముడుపోకుండా ఉండిపోయే ఇళ్లపై (ఇన్వెంటరీ) పన్ను రాయితీలను ప్రకటించారు. కంప్లీషన్ సర్టిఫికెట్ పొందిన తర్వాత ఖాళీగా ఉన్న ఇళ్లపై అద్దెను ఆదాయ పన్నుకు లోబడి చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ప్రస్తుతం జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకోగానే ల్యాండ్ ఓనర్ చెల్లించే మూలధన రాబడిని కాస్త ప్రాజెక్ట్ పూర్తయ్యాక చెల్లించే వీలును కల్పించారు.

**అందుబాటులో ఇళ్ల నిర్మాణానికి ప్రాతిపదిక :**

గతేడాది బడ్జెట్‌లో అందుబాటు ఇళ్లను ప్రోత్సహించేందుకు ఆదాయ పన్ను రాయితీలను కల్పించిన జైట్లీ.. ఈసారి అందుబాటు గృహాల బిల్టప్ ఏరియాలను కార్పెట్ ఏరియాలుగా మార్పు చేశారు. అంటే గతంలో 30 చ.మీ., 60 చ.మీ. బిల్టప్ ఏరియాలుంటే అందుబాటు గృహాలుగా పరిగణించేవి కాస్త తాజా బడ్జెట్‌తో మెట్రో నగరాల్లో 30 చ.మీ., నాన్‌మెట్రో నగరాల్లో 60 చ.మీ. కార్పెట్ ఏరియాలుగా ఉండాలి. 60 చదరపు మీటర్లంటే 540 చదరపు అడుగుల స్థలం మాట. గతంలో సింగిల్ బెడ్ రూమ్ మాత్రమే అందుబాటు ఇళ్ల పథకం కిందకు వచ్చేది. ఇది చాలదనే భావనతో అల్పాదాయ, దిగువ మధ్య తరగతుల వారు కొనేవారు కాదు. దాంతో డిమాండ్ లేక వీటి నిర్మాణానికి సంస్థలు కూడా సాహసించలేని పరిస్థితి ఉంది. తాజా మార్పుతో దాదాపు 900 చదరపు అడుగుల బిల్టప్ ఏరియా (650-700 అడుగుల కార్పెట్ ఏరియా) అవుతుంది. ఈ విస్తీర్ణంలో చిన్న డబుల్ బెడ్ రూమ్స్ వస్తాయి. దీంతో అల్పాదాయ, దిగువ మధ్య తరగతి వారు ఈ పథకం కింద ఇళ్ల కొనుగోలుకు ముందుకు వస్తారని, నిర్మాణ సంస్థలు ప్రాజెక్టులు చేపట్టేందుకు ఉత్సాహం చూపిస్తాయని అధికార వర్గాల అంచనా!

**స్థిరాస్తి విక్రయ కాల పరిమితి 3 నుంచి 2 సంవత్సరాలకు కుదింపు :**

ఇప్పటివరకు 1980 కంటే ముందు కొన్న ఫ్లాట్, ప్లాట్ ఏదైనా స్థిర, చరాస్తులను ఎప్పుడు విక్రయించినా సరే 1981 ఏప్రిల్ 1 నాటి మార్కెట్ రేటు ఆధారంగా మూలధన లాభాలు (క్యాపిటల్ గెయిన్) విలువలను లెక్కగట్టేవారు. కానీ, తాజా బడ్జెట్‌లో విలువ లెక్కింపు సంవత్సరాన్ని 2001 ఏప్రిల్ 1కి మార్చారు. దీంతో విక్రయదారుడికి సరైన మార్కెట్ రేటు వస్తుంది. గతంలో మూడేళ్లుగా ఉన్న దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్ పన్ను ప్రయోజనాలను 2 ఏళ్లకు కుదించారు. మూడేళ్ల కంటే ఎక్కువున్న స్థిరాస్తుల దీర్ఘకాలిక మూలధన లాభాలు 20 శాతం చెల్లించాలి.

**ల్యాండ్ పూలింగ్ విధానం :**

అందరికీ ఇళ్లు లక్ష్యానికి ఇంటిస్థలాల లభ్యతే ప్రధాన ఆటంకంగా ఉంది. ఇటు గ్రామాలు అటు పట్టణాల్లో ఇళ్ల నిర్మాణానికి సరిపడా భూమి అందుబాటులో లేదు. గ్రామీణ ప్రాంతాల్లో స్థలాలు పేదలకు అందుబాటులో లేకపోవడం వల్ల ఇళ్లు నిర్మించుకోలేక పోతున్నారని గుర్తించిన ప్రణాళిక సంఘం ఇంటి స్థలాలు కొని ఇవ్వాలని ప్రతిపాదించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవలంబించిన ల్యాండ్ పూలింగ్ విధానం ద్వారా భూ స్వాధీన చట్టం ఉపయోగించకుండా వినూత్న విధానం అందరి దృష్టిని ఆకర్షించింది. ల్యాండ్ పూలింగ్ ద్వారా భూ సంబంధిత వివాదాలు తొలగే అవకాశం ఉంది.

**ముగింపు :**

దేశం 75వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకొనే నాటికైనా అందరికీ ఇళ్లు అందజేయాలన్న కేంద్ర సర్కారు ఆశయం గొప్పది. అయితే, గతంలో పథకాల అమలులో దొర్లిన తప్పిదాలను పునరావృతం కానివ్వరాదు. అన్ని వర్గాలను పథకంలో భాగస్వాములను చేయాలి. గృహ నిర్మాణం ఆగిపోకుండా ఎప్పటికప్పుడు తగినన్ని నిధుల లబ్ధిదారులకు అందజేయాలి. అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో కృషిచేయాలి. అవినీతికి తావులేకుండా గృహనిర్మాణ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి. అప్పుడే పేదోడి సొంతింటి కల సాకారమవుతుంది! ■


**యోజన చందాదారులకు సూచన:**

పోస్టులో పంపిన యోజన మాసపత్రిక అందడంలేదని పలువురు చందా దారులు ఫిర్యాదు చేస్తున్నారు. వీరందరికీ మనవి ఏమంటే, ప్రతినెలా రెండు, మూడు తారీకులలో ఠంచనుగా కాపీలను పోస్టు చేస్తాము. అయితే, ప్రతులు ఆర్డినరీ పోస్టులో వెళతాయి కనుక, ఒక్కొక్క సారి అందకపోయే అవకాశముంది. దీనికి యోజన బాధ్యతవహించదు. నెలకు ఒక ప్రతి అందకపోతే మరొకటి, మరొకటి పంపడానికి పాలనాపరమైన ఆటంకాలున్నాయి. ఒకవేళ రిజిష్టర్ పోస్టులో కావాలంటే, మామూలు ప్రతి ఒక్కింటికి రూ. 52/- లు, ప్రత్యేక సంచికకు రూ. 57/- లు చందాదారులు అదనంగా ముందుగా చెల్లించాల్సి ఉంటుంది. గమనించగలరు.

– సీనియర్ ఎడిటర్

# పరారీ ఆర్థిక నేరస్తుల బిల్లు - 2018

- డాక్టర్ సి.ఎం.ఏ. వి. మురళి




**ప్రస్తుత చట్టాలు నిర్దేశిస్తున్న సంక్లిష్టమైన ప్రక్రియ ద్వారా ఆర్థిక నేరస్తులను స్వదేశానికి తిరిగి రప్పించడానికి చాలాఏళ్లు పడుతుంది. దేశం విడిచి పారిపోతున్న ఆర్థిక నేరస్తులతో కఠినంగా వ్యవహరించడానికి ప్రస్తుత చట్టాలలో లొసుగులను, లోపాలను సవరించడం ద్వారా స్పష్టమైన చట్టాలను రూపొందించు కోవాల్సి ఉంది. ఆర్థిక నేరస్తులు అక్రమంగా కూడబెట్టుకున్న సొమ్ముతో సంపాదించుకున్న ఆస్తులను జప్తు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకోకపోతే యథేచ్ఛగా పరారయ్యే అవకాశం ఉంటుంది.**

ఇప్పుడు ప్రపంచమంతటా ఆర్థిక పరిస్థితులు అస్థిరంగా ఉన్నాయి. దీనికి తోడు ప్రపంచీకరణకు మన దేశం కూడా తలుపులు బార్లా తెరవడంతో దాని ప్రభావం ఇక్కడ కూడా కనిపిస్తున్నది. అంతకుముందు ప్రపంచ వ్యాప్తంగా వివిధ ఆర్థిక వ్యవస్థలు చవిచూసిన సంక్షోభం నుండి మన దేశం మాత్రం కొంతవరకు నిలదొక్కుకో గలిగింది. సరళీకరణ చేపట్టిన తరువాత మనం కూడా చాలా ప్రకంపనలను అనుభవించాల్సివచ్చింది. భారతీయ వ్యాపారాలు వృద్ధి చెందడంతో వాటి రెక్కలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించాయి. తమ వ్యాపార విస్తరణకు అవసరమైన మూలధనం కోసం వ్యాపారాలు అనేక బ్యాంకులను ఆశ్రయించాయి. గతంలోని రుణాల మంజూరు విషయంలో చాలా మొండిగా వ్యవహరించిన బ్యాంకులు ఇప్పుడు వ్యాపారం విస్తరిస్తున్నదన్న ఆశ కొద్దీ తమ ఖాతాదారులకు ఉదారంగా రుణాలు పంపిణీ చేయడం ప్రారంభించాయి. దురదృష్టవశాత్తు వారు ఇప్పుడు రుణాల వసూళ్ల కోసం అనేక పిల్లిమొగ్గలు వేయాల్సివస్తోంది.

భారత దేశంలో భారత శిక్ష స్మృతి (ఇండియన్ పీనల్ కోడ్ – ఐపీసీ), అవినీతి నిరోధక చట్టం, మనీ లాండరింగ్ నిరోధక చట్టం వంటివి ఉన్నప్పటికీ ఆర్థిక నేరస్తులను లక్ష్యంగా చేసుకునే ఒక నిర్దిష్టమైన చట్టాన్ని తీసుకుని రావలసిన అవసరం ఇప్పుడు ఎంతగానో ఉందని ప్రభుత్వం భావించింది. అందువల్ల, ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా రుణగ్రహీతలకు సంబంధించి ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు, వేలంద్వారా విక్రయాలపై వచ్చే మొత్తాలను జమ చేసుకునేందుకు ప్రభుత్వానికి అధికారాలను కల్పించేలా ఒక చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. నీరవ్ మోదీ, మెహల్ చోక్సీ మోసగించడం వల్ల పంజాబ్ నేషనల్ బ్యాంక్ దెబ్బతినడంతో కేంద్ర ఆర్థిక మంత్రి వెంటనే ఆర్థిక నేరాలను అరికట్టి, మోసగాళ్లపై చావుదెబ్బ కొట్టేందుకు, బ్యాంకింగ్ వ్యవస్థలో పెట్టుబడిదారులు, బ్యాంక్ వినియోగ దారుల విశ్వాసాన్ని పెంపొందించడానికి ఈ బిల్లును ఆమోదించారు.

## బిల్లు ప్రసంగ పాఠంలోని ఉద్దేశ్యం

వ్యాపార ఒప్పందాలు వికటించినప్పుడు వ్యాపారాలు తాము తీసుకున్న రుణ వాయిదాలను సకాలంలో చెల్లించలేకపోతే దాని ప్రభావం బ్యాంకింగ్ రంగంపై పడుతుంది. అలాకాకుండా మోసపూరితంగా రుణాలు ఎగవేసేందుకు సిద్ధమైనవారు ప్రమాదసూచికలు కనిపించగానే దేశం విడిచి పారిపోతారు. అంతకంటే పెద్ద

మాజీ ఛైర్మెన్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా.
E-mail : victorgrace321@gmail.com

వ్యాపారాలు చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు చట్టాలను అమలు చేసే నియంత్రణాధికారులు రంగంలోకి దిగకముందే తీరం దాటి తరలిపోతాయి. కోట్లాది రూపాయల సొమ్ము వారి సొంత ఖజానాలో మూలుగుతున్న ప్పటికీ బ్యాంకులకు చెల్లించాల్సిన రుణాలు, ఓవర్ హెడ్స్ ఇతర ఖర్చులు సకాలంలో చెల్లించకపోవడం వల్ల బ్యాంకులు తీవ్రంగా నష్టపోతాయి. దేశంలోని బ్యాంకులు, దర్యాప్తు సంస్థలు, ప్రాసిక్యూషన్ ఏజెన్సీల వంటి వారందరిపైనా సవారీ చేసే ఇలాంటి వారు ముందుగానే ఒక పథకం ప్రకారం మన చట్టాలు వర్తించని విదేశాలకు తరలించి అక్కడి వివిధ సంస్థలలో పెట్టుబడులు పెట్టి, వివిధ బ్యాంకులలో దాచుకుని గణనీయమైన మొత్తాల్లో అక్రమార్జనలు కొనసాగిస్తూ అక్కడే ఖుషీగా కాలం గడిపేస్తుంటారు. ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్న ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రస్తుత ఆర్థిక, క్రిమినల్ నిబంధనలు సరిపోవు.

ప్రస్తుత చట్టాలు నిర్దేశిస్తున్న సంక్లిష్టమైన ప్రక్రియ ద్వారా ఆర్థిక నేరస్తులను స్వదేశానికి తిరిగి రప్పించడానికి చాలాఏళ్లు పడుతుంది. దేశం విడిచి పారిపోతున్నఆర్థిక నేరస్తులతో కఠినంగా వ్యవహరించడానికి ప్రస్తుత చట్టాలలో లొసుగులను లోపాలను సవరించడం ద్వారా స్పష్టమైన చట్టాలను రూపొందించుకోవాల్సి ఉంటుంది. ఆర్థిక నేరస్తులు అక్రమంగా కూడబెట్టుకున్న సొమ్ముతో సంపాదించుకున్న ఆస్తులను జప్తు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకోకపోతే యథేచ్ఛగా పరారయ్యే అవకాశం ఉంటుంది. ఆర్థిక నేరాలకు పాల్పడి, అక్రమంగా ఆర్జించిన సొమ్ముతో జల్సాగా విదేశాలకు ఉడాయించవచ్చునని భావించేవారికి ఈ చట్టంద్వారా తీసుకునే చర్యలు ముందస్తు హెచ్చరికలా కనువిప్పు కలిగించే విధంగా ఉండాలి. ఐక్యరాజ్య సమితి సమావేశంలో ఆమోదించిన నిబంధనల ప్రకారం అవినీతి కేసులలో నిందితులను అరెస్ట్ చేసే అవసరం లేకుండానే వారి స్వదేశంలో అక్రమ ఆస్తులను జప్తు చేసి అవకాశం లభించింది. దీనివల్ల స్వదేశాల్లో ఆర్థిక నేరాలు చేసి చట్టాల నుంచి తప్పించుకోవడానికి విదేశాల్లో తలదాచుకుందామని తలచే తుంటరులకు ఇక తంటాలు తప్పవు.

పరారైన ఆర్థిక నేరస్తుల బిల్లు 2018 (ది ఫ్యుగిటివ్ ఎకనామిక్ ఆఫెండర్లు బిల్-2018) ను 2018 మార్చి 12న లోక్‌సభలో ప్రవేశ పెట్టారు. “విదేశాలకు పారిపోతే దేశీయ చట్టాల పరిధినుంచి, భారతీయ న్యాయస్థాన అధికార పరిధినుంచి తప్పించుకో గలమన్న ధీమా ఆర్థిక నేరస్తులలో కలగకుండా చేయడానికి, నేరసంబంధమైన అంశాలలో చట్టం తప్పక కఠినంగానే ఉంటుందన్న భయం కల్పించడానికి, భారతీయ చట్టాల పవిత్రతను కాపాడ డానికి ఈ బిల్లు తోడ్పడుతుంది” అని బిల్లు ప్రవేశికలో స్పష్టంగా పేర్కొన్నారు.

## బిల్లు స్వరూపం

రూ. 100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ మొత్తం ఉన్న ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసులు ఈ బిల్లు పరిధిలోకి వస్తాయి. తమ నేరాలకు సంబంధించిన కేసుల విచారణను ఎదుర్కోవలసిఉన్న ఆర్థిక నేరస్తులు విదేశాలకు పారిపోయిన సందర్భంగా వారిని బలవంతంగానైనాసరే స్వదేశానికి రప్పించి విచారణ చేయడం ద్వారా చట్ట నియమాలను తిరిగి స్థాపించాలని భావిస్తున్నారు. పరారైన ఆర్థిక నేరస్తుని ఆస్తులను జప్తు చేసేందుకు లేదా స్వాధీనం చేసుకునేందుకు ఈ బిల్లుద్వారా అవకాశం లభిస్తుంది. పరారైన వ్యక్తుల నుంచి రుణమొత్తాలను తిరిగి రాబట్టేందుకు బ్యాంకులు తదితర ఆర్థిక సంస్థలకు సహాయం చేయడానికి ఈబిల్లు ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఒక వ్యక్తిని ఆర్థిక నేరస్తుడిగా ప్రకటించటానికి ముందే అతడు భారతదేశానికీ తిరిగి వచ్చి సంబంధిత న్యాయస్థానానికి లొంగిపోయి చట్టప్రకారం విచారణకు సిద్ధమైతే ఈ బిల్లులో ప్రతిపాదించిన ఇతర చర్యలు ఉపసంహరించుకుంటారు.

తనపై మోపిన నేరాలకు సంబంధించి నిందితుడు భారతదేశంలోను లేదా విదేశాలలోని ఉన్నత న్యాయ స్థానాలలోదరఖాస్తు చేసుకునేందుకు, తన వాదన వినిపించుకోవడానికి వీలైన రక్షణ కల్పిస్తూ నోటీసులు జారీ చేసే అవకాశం ఈ బిల్లు వల్ల లభిస్తుంది. చట్ట నియమాలను అనుసరించి ఆస్తుల నిర్వహణ, విక్రయం చేపట్టేందుకు ఒక పాలనాధికారిని నియమించే అవకాశం కల్పిస్తుంది.

## పరారైన ఆర్థిక నేరస్తుడు అంటే నిర్వచనం:

## పరారైన ఆర్థిక నేరస్తుడు అంటే:

షెడ్యూల్డ్ నేరానికి సంబంధించి భారతదేశంలోని ఏ కోర్టు నుండైనా తనపై అరెస్టు వారెంట్ జారీ అయినపుడు i) నేర విచారణ నుంచి తప్పించుకోవడానికి భారతదేశం విడిచిపెట్టిన; లేదా ii) విదేశాల్లో ఉంటూ నేర విచారణను ఎదుర్కొనేందుకు భారతదేశానికి తిరిగి రావడానికి నిరాకరించే వ్యక్తి అన్నమాట.

## అమలు తీరు:

డైరెక్టర్ అనగా మనీ లాండరింగ్ చట్టం 2002లోని 49 (1) సెక్షన్ కింద నియమితుడైన వ్యక్తి నిర్దేశించిన వ్యక్తి డిప్యూటీ డైరెక్టర్ అనగా మనీ లాండరింగ్ చట్టం 2002 లోని 49 (1) సెక్షన్ కింద నియమితుడైన వ్యక్తి ఆవిధంగా నియమితులైన డైరెక్టర్ లేదా డిప్యూటీ డైరెక్టర్ పరారైన ఆర్థిక నేరస్తులపై చర్య తీసుకోవడానికి అనుమతించ వలసిందిగా 2002 ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (హవాలా కార్యకలాపాల నిరోధక చట్టం) కింద ఏర్పాటైన ప్రత్యేక కోర్టులో దరఖాస్తు దాఖలు చేయవలసి ఉంటుంది.

## దరఖాస్తులో ఉండాల్సిన అంశాలు:

i) ఒక వ్యక్తి పరారైన ఆర్థిక నేరస్థుడని నమ్మడానికిగల కారణాలు.

ii) అతడు ఎక్కడున్నాడో దానికి సంబంధించి ఏదైనా సమాచారం.

iii) అతని నుంచి స్వాధీనం చేసుకోవలసిన ఆస్తులలో నేరమయ సొమ్ముతోనే

సంపాదించుకున్నవాటి జాబితా.

iv) స్వాధీనం చేసుకోవాల్సిన ఆస్తులలో బేనామీగా లేదా ఇతరుల పేర్లతో దేశ,విదేశాల్లో కొన్న అక్రమఆస్తుల జాబితా

v) ఈ ఆస్తులలో వాటాలు కలిగిన వ్యక్తుల జాబితా(అనగా ఆస్తిపై ఎవరికైనా హక్కులు దఖలుపడినా లేదా కోరుతున్నటువంటి వ్యక్తులు).

vi) ఇలా అన్ని వివరాలతో ఈ దరఖాస్తు అందినప్పుడు, ప్రత్యేక న్యాయస్థానం సంబంధిత వ్యక్తి/వ్యక్తులకు.

నోటీసు జారీ చేస్తుంది, ఆ వ్యక్తిని/వ్యక్తులను నోటీసులో పేర్కొన్న ప్రదేశంలో నిర్ణీత సమయంలో హాజరుకావాలని ఆదేశిస్తారు. ఈ గడువు ఆరు వారాలకు తక్కువగాకుండా ఉంటుంది. నోటీసులో పేర్కొన్న స్థలంలో నిర్ణీత సమయానికి హాజరు కాకపోతే ఆ వ్యక్తిని పరారైన నేరస్తుడిగా పరిగణించి ఆస్తిని జప్తు చేస్తారు.ఒకవేళ ఆ వ్యక్తి నిర్ణీత సమయానికి నిర్దేశించిన స్థలంలో హాజరైనప్పుడు ఆ ప్రత్యేక కోర్టు ఈ బిల్లులోని నిబంధనల కింద చేపట్టవలసిన భవిష్య కార్యకలాపాలను రద్దు చేస్తుంది.

**జప్తుచేయడం లేదా స్వాధీనం చేసుకోవడం :**

దరఖాస్తులో పేర్కొన్న ఆస్తులను జప్తుచేయటానికి లేదా స్వాధీనం చేసుకోవడానికి ప్రత్యేక కోర్టు రాతపూర్వకంగా అనుమతించిన వెంటనే డైరెక్టర్ లేదా డిప్యూటీ డైరెక్టర్ ఆ ఆస్తులను స్వాధీనం చేసుకుంటారు.

**తాత్కాలిక స్వాధీనం :**

ప్రత్యేక కోర్టు ముందు దరఖాస్తుతో సంబంధం లేకుండానే పరారైన ఆర్థిక నేరస్తుడు అక్రమ సొమ్ముతో కొనుగోలు చేసిన ఆస్తులని నిర్ధారించుకున్న తర్వాత డైరెక్టర్‌గానీ, డిప్యూటీ డైరెక్టర్‌గానీ ఈ చట్టంలోని నాలుగో సెక్షన్ కింద అలాంటి ఆస్తులను తాత్కాలికంగా స్వాధీనం చేసుకుని, నేరస్తుడు ఆ ఆస్తులను విక్రయించి లేదా బదలీచేసి సొమ్ముచేసుకోకుండా కాపాడవచ్చు. ఆ తర్వాత తగిన చర్యలు తీసుకుంటుందన్న విశ్వాసంతో 30 రోజులలోగా కోర్టుకు నివేదించవచ్చు. ప్రత్యేక కోర్టు అనుమతిస్తే తప్ప ఇలా జప్తు చేసిన ఆస్తులను 180 రోజుల కంటే ఎక్కువగా తమ అధీనంలో ఉంచుకోరాదు.

అయితే అలా జప్తు చేసిన /స్వాధీన పరచుకున్న స్థిరాస్తిలో వాటాకలిగిన లేదా అనుభవిస్తున్నవ్యక్తిని నిరోధించే నిబంధన ఏదీ విధించడం లేదని ఈ బిల్లు స్పష్టంగా తెలియ జేస్తోంది. విచారణలో ఎవరైనా ఒక వ్యక్తి పరారైన ఆర్థిక నేరస్తుడని రుజువుకాకపోతే విచారణ అనంతరం అతని ఆస్తులను అతనికే అప్పగిస్తారు.

**డైరెక్టర్ అధికారాలు :**

డైరెక్టర్ లేదా అతని అనుమతి పొందిన ఏ అధికారికైనా సివిల్ కోర్టుకు ఉన్న అధికారాలన్నీ ఉంటాయి. ఒక అధికారి తన పరిశీలనలో ఉన్నసమాచారం లేదా సాక్ష్యాధారాల బలంతో (ఈ కారణాలు, సాక్ష్యాధారాలన్నీ రాతపూర్వకంగా ఉండాలి) ఒక వ్యక్తిని పరారైన ఆర్థిక నేరస్తుడిగా భావించినప్పుడు వాటిని పరిశీలించడానికి తన అధికార పరిధిలోని లేదా పై అధికారి అప్పగించిన అధికారంతో ఎక్కడికైనా వెళ్లి తనిఖీ చేయవచ్చు.

అలాంటి ప్రదేశంలో ప్రవేశించిన అధికారి తనకు కావలసిన రికార్డులను తనిఖీ చేసేందుకు అవసరమైన సదుపాయాలు కలగజేయాలని అక్కడవున్న యజమానిని, లేదా ఉద్యోగి లేదా మరే ఇతర వ్యక్తినైనా కోరవచ్చు, అతన్ని నేరసంబంధమైన లావాదేవీలకు సంబంధించిన పత్రాలను తనిఖీ చేయడానికి లేదా ధృవీకరించుకోవడానికి అవసరమైన సహాయసహకారాలు అందించాలని కోరవచ్చు. ఈ నిబంధన కింద పనిచేసే డైరెక్టర్ లేదా అతని అనుమతి పొందిన ఇతర అధికారి తాము తనిఖీ చేసిన రికార్డులపై స్పష్టమైన గుర్తులు ఉంచవచ్చు, వీటికి తగినన్ని నకళ్లు తయారు చేసుకోవచ్చు.

**పాలనాధికారి:**

చట్టంలోని 15వ సెక్షన్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం సంయుక్త కార్యదర్శి కంటే తక్కువ కానీ హోదా గల అధికారిని ఒక పాలనాధికారిగా నియమించవచ్చు. అలా నియమితుడైన పాలనాధికారి ఆ ఆస్తిని స్వాధీన పరచుకుని నిర్వహిస్తారు. అడ్మినిస్ట్రేటర్ ఆర్డర్ చేసిన సంబంధించి ఆస్తిని అందుకుంటారు మరియు నిర్వహిస్తారు. అలా కేంద్ర ప్రభుత్వానికి దఖలుపడిన ఆస్తులను వేలం వేసేందుకు లేదా విక్రయించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం లేదా పాలనాధికారి ఆదేశాలు జారీ చేసిన తేదీనుంచి 90 రోజుల వరకు ఎటువంటి ఆస్తిని విక్రయించకూడదు.

**అప్పీలు :**

ప్రత్యేక కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా హైకోర్టులో అప్పీలు చేసుకోవచ్చు. ప్రత్యేక కోర్టు ఆదేశాలపై 30 రోజులలోగానే హై కోర్టు ముందు అప్పీలు చేసుకోవలసి ఉంటుంది ఈ 30 రోజుల గడువు మీరిన తర్వాత కూడా దరఖాస్తుదారుడు తన అప్పీలు ఆలస్యం కావడానికి చూపిన కారణాలు సరైనవేనని సంతృప్తి చెందినప్పుడు హై కోర్టు ఆ అప్పీలును స్వీకరించవచ్చు.

**ముగింపు :**

ఆర్థిక మోసాలకు పాల్పడిన తరువాత విచారణ తదితర చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకోవడానికి దేశం విడిచి పరారైన పెద్దలకు సంబంధించిన ఆస్తులను కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి ఈ బిల్లు ఎంతగానో తోడ్పడుతుంది. ఈ పెద్దల అక్రమాస్తుల విక్రయాల మూలంగా రాబట్టగలిగిన సొమ్ముతో ప్రభుత్వ ఖజానా బలపడుతుంది. ఇప్పటికే ఆర్థికనేరాలకు పాల్పడిన వారితోబాటు కొత్తగా మోసాలకు పాల్పడిన వారు, పాల్పడాలనుకున్నవారి ప్రయత్నాలు సఫలం కాకుండా ఈ చట్టం నిరోధిస్తుందని భావిస్తున్నారు. ■

# ఆదాయాభివృద్ధిలో తెలంగాణ ప్రథమం

21 శాతం ఆదాయాభివృద్ధి రేటు కలిగిన ధనిక రాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. "సంపద సృష్టించాలి. సృష్టించిన సంపదను ప్రజలకు పంచాలి" అనే సూత్రం ప్రాతిపదికగా ప్రభుత్వం పనిచేస్తున్నది.

ఇటీవల జరిగిన రాష్ట్ర అవతరణ ఉత్సవాలలో భాగంగా జరిగిన ఒక సభలో ముఖ్య మంత్రి ప్రసంగిస్తూ, భవిష్యత్తు పట్ల ఆశలు చిగురింపచేయాలని ప్రజాసంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యతనివ్వాలని అన్నారు. 42 లక్షల మంది అసహాయులకు నెలకు వెయ్యి రూపాయల చొప్పున పెన్షన్లు అందిస్తూ ఆసరాగా నిలుస్తున్నది. దేశంలో ఎవరూ, ఎక్కడా, ఎన్నడూ ఇవ్వని విధంగా బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు, బోదకాలు బాధితులకు, మజీదుల్లో ప్రార్థనాదికాలు నిర్వహించే ఇమామ్, మౌజన్‌లకు ప్రభుత్వం జీవన భృతి కల్పిస్తున్నది. ఆడపిల్ల పెళ్లి వల్ల కుటుంబాలు ఆర్థికంగా చితికి పోవద్దని కళ్యాణలక్ష్మి పథకం ద్వారా 1,00,116 ఆర్థిక సహాయం అందిస్తున్నది. ఎదిగే పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలని బడి పిల్లలందరికీ సన్నబియ్యం బువ్వ పెడుతున్నది. దేశంలో 40వేల కోట్లతో, 40 పథకాల ద్వారా ప్రజా సంక్షేమం కోసం పెద్ద ఎత్తున పాటుపడుతున్నాయని చెప్పారు.

రైతు రుణాల మాఫీ, సకాలంలో ఎరువులు-విత్తనాల సరఫరా, ఐదువేల ఎకరాలకు ఒక వ్యవసాయ విస్తరణాధికారి నియామకం, డ్రిప్ ఇరిగేషన్ కు-పాలీ హౌజ్ లకు, యంత్ర పరికరాలకు భారీ సబ్సిడీలు ఇవ్వడం, పెద్ద ఎత్తున గోదాముల నిర్మాణం, రైతన్నలు చెల్లించాల్సిన నీటితీరువా బకాయిల రద్దు, వ్యవసాయ ట్రాక్టర్లపై రవాణాపన్ను రద్దు, తదితర కార్యక్రమాల ద్వారా వ్యవసాయ రంగానికి కొత్త ఉత్తేజాన్ని కలిగించారు. 24 గంటల పాటు నాణ్యమైన నిరంతర ఉచిత విద్యుత్ సరఫరాతో వ్యవసాయ ఉత్పత్తులు గణనీయంగా పెరిగినాయి.

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన మిషన్ కాకతీయ సత్ఫలితాలనిచ్చింది. దీంతో సాగు భూమి విస్తీర్ణం పెరగటంతో పాటు, భూగర్భ జల మట్టం కూడా పెరిగింది. గ్రామసీమల్లోని చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. 46,500 చెరువులను పునరుద్ధరించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే ప్రధానమైన చెరువుల పనులు పూర్తయ్యాయి. చిన్న చెరువులు, కుంటల పనులు పురోగతిలో ఉన్నాయి. రాష్ట్రంలోని రైతులందరికీ ఎకరానికి 8 వేల రూపాయల చొప్పున ఈ ఏడాది నుంచే పంట పెట్టుబడి సాయం అందిస్తున్నారు.

నిరుపేద నిండుగర్భిణీలు, బాలింతలు కూలీకి వెళ్ళకుండా, వారు నష్టపోయే కూలీనిప్రభుత్వమే చెల్లించే విధంగా అవసరమైన ఆర్థిక సహాయం ప్రభుత్వమే అందజేస్తోంది. ఈ పథకం క్రింద నిరుపేద గర్భిణీలకు నాలుగు విడతలుగా 12,000 రూపాయలు చెల్లిస్తున్నారు. ఆడపిల్లను ప్రసవించిన తల్లికి ప్రోత్సాహకంగా మరో రూ. 1,000 లు అదనంగా చెల్లిస్తున్నారు. దీనితోపాటుగా నవజాత శిశువులకు కావల్సిన 16 రకాల వస్తువులతోకూడిన 2,000 రూపాయల విలువైన కిట్‌ను కూడా అందించడం జరుగుతోంది. ఈ పథకం అమలు తర్వాత ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరగడంతో పాటు, మాతా, శిశు సంరక్షణ కూడా సమర్థవంతంగా అమలవుతోంది.

రాష్ట్రంలో పచ్చదనాన్ని 33 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో తెలంగాణ హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించి పెద్ద ఎత్తున అమలుచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్దసంఖ్యలో భాగస్వాములు కావడం ఆనందదాయకం. ఈ కార్యక్రమం ప్రారంభించిన మూడేళ్ళలో సుమారు 82 కోట్ల మొక్కలు నాటారు.

పరిశ్రమల స్థాపనకోసం ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు రాష్ట్రంలో అమలుచేస్తున్న టి.ఎస్ - ఐ.పాస్ సింగిల్ విండో విధానంలో కేవలం 15 రోజుల్లోనే పరిశ్రమల స్థాపనకు అన్ని రకాల అనుమతులు ఇవ్వడం జరుగు తోంది. ఈ నూతన పారిశ్రామిక విధానం అమలులోకి వచ్చిన తరువాత రాష్ట్రంలోకి అనేక కొత్త పరిశ్రమలు తరలి వస్తున్నాయి. ఇప్పటి వరకు రాష్ట్రంలో 7,155 పరిశ్రమలు అనుమతి పొందాయి. లక్షా 29వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 5 లక్షల 74 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించాయి.

తెలంగాణ రాష్ట్రం ఐ.టి రంగంలో బలీయమైన శక్తిగా ఎదిగింది. ప్రపంచంలో హైదరాబాద్ నగరం ఒక ప్రముఖ ఐ.టి హబ్‌గా గుర్తింపు పొందింది. ఐ.టి రంగాన్ని ప్రభుత్వం ఇప్పుడు ద్వితీయ శ్రేణినగరాలకు కూడా విస్తరింప చేస్తున్నది. అంకుర పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఏర్పాటుచేసిన టి-హబ్ ఎంతో మంది ఔత్సాహికులకు ప్రేరణగా నిలుస్తున్నది. ■

తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ సౌజన్యంతో....

# జాతిసిగలో కోహినూర్ - శ్రీహరికోట రాకెట్ కేంద్రం

- డా॥ అయినాపురపు రామలింగేశ్వరరావు



**1969లో భారత ప్రభుత్వం శ్రీహరికోటను అంతరిక్ష కేంద్రంగా ప్రకటించింది. 1971లో తమ మొదటి రాకెట్ రోహిణి-121ను భారత్ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో శ్రీహరికోట నుంచి ప్రయోగించి రాకెట్ ప్రయోగాలకు శ్రీకారం చుట్టింది. శ్రీహరికోట షార్ కేంద్రం అంతరిక్ష పరిశోధనలను నిర్వహించే ఇస్రోకు ఉపగ్రహవాహక నౌకలను అందించే ఏకైక వేదిక. ఇస్రో సమకూర్చుకున్న భారత ఉపగ్రహ వాహక నౌకలను ప్రయోగించి తద్వారా వివిధ లక్ష్యాలను నిర్దేశించి తయారుచేసిన ఉపగ్రహాలను అంత రిక్షంలో వాటివాటి కక్ష్యలలో ప్రవేశపెట్టి విశ్వ అంతరిక్ష చరిత్ర పుటలలో సువర్ణ అధ్యాయాన్ని తన స్వంతం చేసుకుంది.**

ఫిబ్రవరి 16, 2017న, అంతరిక్ష పరిశోధనలతో భారతదేశం ప్రపంచ రికార్డులను బద్దలు చేసింది. 104 ఉపగ్రహాలను ఒకేసారి PLSVC 37 రాకెట్ తీసుకు వెళ్ళి నిర్దేశించిన కక్ష్యలలో ఉపగ్రహాలన్నింటిని దిగ్విజయంగా ప్రవేశపెట్టి ప్రపంచ అంతరిక్ష శాస్త్రవేత్తలను ఇస్రో (ఇండియన్ స్పేస్ రీసెర్చి ఆర్గనైజేషన్) ఆశ్చర్యానికి గురిచేసింది. అద్భుతమైన ఈ ప్రయోగం జరిగిన అంతరిక్ష వాహక నౌకాప్రయోగ కేంద్రం 'షార్' పేరు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాలో మారు మోగింది.

2017లో కేవలం రెండు నెలల వ్యవధిలో GSLV-F 09, GSLV MK III D1 మరియు PSLV-C-38 వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇస్రో సమకూర్చుకున్న భారత ఉపగ్రహ వాహక నౌకల (రాకెట్లు)ను ప్రయోగించి తద్వారా వివిధ లక్ష్యాలను నిర్దేశించి తయారుచేసిన ఉపగ్రహాలను అంత రిక్షంలో వాటివాటి కక్ష్యలలో ప్రవేశపెట్టి "స్పేస్ పోర్ట్ ఆఫ్ ఇండియా" విశ్వ అంతరిక్ష చరిత్ర పుటలలో సువర్ణ అధ్యాయాన్ని తన స్వంతం చేసుకుంది.

జనవరి 12, 2018న PSLV-C-40 రాకెట్ ద్వారా మరో పర్యాయం తన రెండు స్వదేశీ ఉపగ్రహాలతో పాటు 28 విదేశీ ఉపగ్రహాలను నిర్దేశించిన కక్ష్యలలో ప్రవేశపెట్టి తన విజయ పరంపరలను విశ్వానికి మరోసారి తెలియజేసిన మహోన్నత ప్రదేశం శ్రీహరికోట రాకెట్ కేంద్రం.

చంద్రయాన్ ప్రయోగమైనా, మంగళయాన్ ప్రయోగమైనా విజయకేతనాన్ని తన స్వంతం చేసుకుంటూ 65 పైగా ఉపగ్రహ వాహక నౌకల ప్రయోగాలను, 532కు పైగా సౌండింగ్ రాకెట్ ప్రయోగాలను పూర్తిచేసుకొని భారతావనిలో గౌరవప్రదమైన స్థానాన్ని పొంది అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న "శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగాలకు ఓ తపో భూమి" అని చెబితే అతిశయోక్తి కాదేమో!

భారతవనిలో "రాకెట్" పేరు చెప్పిన వెంటనే అందరిక స్ఫురించేది శ్రీహరికోట. శ్రీహరికోట షార్ కేంద్రం అంతరిక్ష పరిశోధనలను నిర్వహించే "ఇస్రోకు ఉపగ్రహవాహక నౌకలను అందించే ఏకైక వేదిక. అంతరిక్ష రంగానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చే, మేధావులైన అంతరిక్ష శాస్త్రవేత్తలు మేధస్సును రంగరించి, పరిశోధనలు చేసి, అంతరిక్ష అద్భుతాలను ఆవిష్కరిస్తూ దేశఖ్యాతిని విశ్వవిఖ్యాతం చేయడంలో ఎల్లవేళలా ముందుంటారు.

సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ సైన్స్ రచయితల సంఘం, శ్రీహరికోట.
E-mail : ainapuraprrao@gmail.com

## శ్రీహరికోట ఎక్కడఉంది?

శ్రీహరికోట ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నెల్లూరు జిల్లా, సూళ్ళురు పేట మండలంలో వుంది. మద్రాసు, కలకత్తా రహదారిపై సూళ్ళురుపేటకు తూర్పుదిశగా 17 కి.మీటర్ల దూరంలో శ్రీహరికోట ఉంది. 175 చదరపు కిలోమీటర్ల (43,360 ఎకరాల) విస్తీర్ణం. 50 కిలోమీటర్ల సముద్రం తీరం కలిగిన శ్రీహరి కోట ఒకద్వీపం. దీనికి మూడు వైపుల బంగాళా ఖాతం. ఒక వైపు పులికాట్ సరస్సు ఉన్నాయి. సూళ్ళురుపేట నుంచి శ్రీహరికోటకు రోడ్ మార్గంలో చేరకోవచ్చు. రోడ్‌కు ఇరువైపుల ఉన్న పులికాట్ సరస్సులో నవంబర్ నుంచి జనవరి వరకు వివిధ దేశలనుంచి వచ్చే వలస పక్షులు సందర్శకులకు స్వాగతాన్ని పలుకు తాయి. చెన్నై నుంచి 83 కి.మీ. నెల్లూరు నుంచి 96 కి.మీ. తిరుపతి నుంచి 79 కి.మీ. దూరంలో శ్రీహరికోట ఉంది.

భారత అంతరిక్ష పరిశోధనలకు, ప్రయోగాలకు అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేసి రాకెట్ ప్రయోగాలకు కేంద్రాన్ని ఏర్పాటు చేసే భాధ్యత భారత అంతరిక్ష విజ్ఞాన పితామహుడు డా॥ విక్రమ్ సారాభాయికి అప్పగించడం జరిగింది. 80 డిగ్రీలు ఉత్తర అక్షాంశం, 13 డిగ్రీలు దక్షణ రేఖాంశంపై ఉన్న శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగాలకు ఎంతో అనువైన ప్రాంతంగా డా॥ విక్రమ్ సారాభాయి బృందం గుర్తించింది. శ్రీహరికోట తూర్పు కోస్తాతీరంలో ఉంది. దీనివల్ల భూభ్రమణం ద్వారా లభించే అదనపు వేగం ప్రయోగ సమయంలో రాకెట్‌కు లాభిస్తుంది! 50 కిలోమీటర్లకు పైగా సముద్ర తీరం రాకెట్ ప్రయోగాలకు ఎంతో అనుకూలం.

1969 లో భారత ప్రభత్వం శ్రీహరికోట ను అంతరిక్ష కేంద్రంగా ప్రకటించింది. 1971వ సంవత్సరంలో తమ మొదటి రాకెట్ రోహిణి–121ను భారత్ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో శ్రీహరికోట నుంచి ప్రయోగించి రాకెట్ ప్రయోగాలకు శ్రీకారం చుట్టింది.

## ప్రపంచస్థాయి సౌకర్యాలు

శ్రీహరికోట షార్ కేంద్రంలో రెండు రకాల రాకెట్లను ప్రయోగిస్తారు. మొదటివి చిన్న తరహా రాకెట్లు. వీటిని RH రాకెట్లు లేదా సౌండింగ్ రాకెట్లు అంటారు. వీటిని వాతావరణ పరిశోధనలకై ప్రయోగిస్తారు. ఇప్పటి వరకు సుమారు 532 సౌండింగ్ రాకెట్లను శ్రీహరికోట నుంచి ప్రయోగించడం జరిగింది.

రెండవ తరహా రాకెట్లు చాలా పెద్దవిగా ఉంటాయి. వీటిద్వారా ఉపగ్రహాలను నిర్దేశించిన కక్ష్యలతో ప్రవేశపెడతారు. SLV, ASLV, PSLV, GSLV, GSLV-MIC III వంటి అతి భారీ రాకెట్లు ప్రయోగించడానికి అవసరమైన అత్యున్నత సాంకేతికను కలిగిన, ఆధునిక పరిజ్ఞానంతో రూపొందించిన ప్రపంచస్థాయి సౌకర్యాలు శ్రీహరికోటలో ఉన్నాయి. ఇప్పటివరకు ప్రపంచస్థాయికి ధీటుగా **షార్ కేంద్రంలో ద్వారా ఇప్పటివరకు 65 రాకెట్లను విజయవంతంగా ప్రయోగించడం జరిగింది.**

రాకెట్ ప్రయోగాలకు అవసరమైన అత్యాధునికమైన రెండు లాంచ్‌ప్యాడ్‌లు ఉన్నాయి. దీనికి తోడు మరోక లాంచ్‌ప్యాడ్ నిర్మాణం జరుగుతోంది. ప్రయోగాలకు అవసరమైన వివిధ పరీక్షలు (స్టాటిక్ టెస్ట్‌లు) నిర్వహించడానికి అవసరమైన సౌకర్యాలు షార్‌లో ఏర్పాటు చేశారు. రాకెట్‌కు కావలసిన ఇంధన తయారీకేంద్రం, ఉపగ్రహం మరియు రాకెట్లు కదలికలను గమనించే ఆధునిక రాడార్ వ్యవస్థలు, రాకెట్ ప్రయోగ సమయంలో ప్రయోగాన్ని నిర్వర్తించడానికి అవసరమైన నియంత్రణ కక్ష్య (కంట్రోల్ సెంటర్), రాకెట్ విడి దశలను అనుసుధానించేందుకు అవసరమైన సౌకర్యాలు శ్రీహరికోటలో ఉన్నాయి. అత్యధునికమైన, ఉన్నత సాంకేతికతను కలిగిన, ప్రస్తుత మరియు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలను సమకూర్చుకొని భవిష్యత్ ప్రణాళికలను ఇస్రో సిద్ధం చేసుకొంటున్నది. ఇస్రో రానున్న నాలుగు సంవత్సరాలలో 40 రాకెట్ ప్రయోగాల ను శ్రీహరికోట ద్వారా నిర్వహించడానికి కావలసిన సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవ దానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం పొందింది. సంవత్సరానికి 15 PSLV రాకెట్లు మరియు GSLV-MIC III ప్రయోగానికి కావలసిన సౌకర్యాలను షార్ సమకూర్చుకుంటున్నది.

## ఛైర్మన్ శివన్ మరియు డైరెక్టర్ కున్హి కృష్ణన్ సారధ్యంలో... Sriharikota High Altitude Range (SHAR)

షార్ కేంద్రం శ్రీహరికోట ప్రస్తుత స్థాయిని చేరుకోవడానికి ప్రముఖ శాస్త్రవేత్త సతీష్‌ధావన్ అంతరిక్ష పరిశోధనలకు చేసిన అపారమైన సేవలకు చిహ్నంగా షార్ కేంద్రానికి సతీష్ ధావన్ షార్ కేంద్రంగా నామకరణం చేయడం జరిగింది.

ఇస్రో ఛైర్మన్‌గా భాద్యతలు చేపట్టిన డా॥ కె. శివన్ 'రాకెట్‌మ్యాన్' గా పేరుగడించారు. డా॥ శివన్ PSLV, GSLV మరియు GSLV-MIC III ల నిర్మాణంలో ప్రముఖ భూమిక నిర్వహించారు. PSLV రాకెట్‌ద్వారా 104 ఉపగ్రహాలను దిగ్విజయంగా ప్రయోగించి ప్రపంచ రికార్డును సృష్టించడంలో ప్రముఖ పాత్రను పోషించారు. డా॥ శివన్ రూపొందించిన "సితారా" (SITARA) సాఫ్ట్‌వేర్ అంతరిక్ష పరిశోధనలలో అత్యంత ప్రధానమైనది. ప్రయివేటు భాగస్వామ్యంతో అంతరిక్ష ప్రయోగాలను భవిష్యత్తులో మరింత వేగవంతం చేసి గుణాత్మకమైన ఫలితాలను సాధించే దిశగా డా॥ శివన్ ఇస్రోను మరియు షార్ కేంద్రంలో సౌకర్యాలను మెరుగుపరుస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఎనలేని ఖ్యాతి గడించిన షార్ కేంద్రం శ్రీహరికోట విజయానికి కేంద్రబిందువుగా షార్ డైరెక్టర్ డా॥ కున్హి కృష్ణన్ నిలుస్తారు. వరుసగా 13 PSLV రాకెట్ ప్రయోగాలకు మిషన్ డైరెక్టర్‌గా వ్యవహరించి విజయాలను నమోదు చేసిన డా॥ కున్హి కృష్ణన్ సేవలు ఇస్రో చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతాయి. షార్‌లో ప్రపంచస్థాయి ఉన్నత సాంకేతికతతో కూడిన లాంచింగ్ సౌకర్యాలను సమకూర్చడంలో డా॥ కున్హి కృష్ణన్ భూమిక మరువరానిది. డా॥ కృష్ణన్ చేసిన సేవలకు

మెచ్చి ఇస్రో వ్యక్తిగత మెరిట్ అవార్డులతో సత్కరించింది. యాస్ట్రోనాటికల్ సోసైటీ ఆఫ్ ఇండియా అవార్డు, స్వదేశీశాస్త్ర పురస్కారాలతో పాటు అనేక అవార్డులు షార్ డైరెక్టర్ స్వంతం చేసుకున్నారు.

**ఇస్రో కల్చర్ స్పెషల్**

ఎన్నో విజయాలను స్వంతం చేసుకున్న ఇస్రోకు ఓ ప్రత్యేకమైన వర్క్ కల్చర్ ఉంది. ఆ ప్రత్యేకమైన వర్క్ కల్చర్ అన్ని విజయాలు సొంతం చేసుకోవడానికి కారణం అని ఇస్రోలో ముఖ్య భూమికను నిర్వహించే ప్రముఖ శాస్త్రవేత్తలు అనేక సందర్భాలలో వ్యక్త పరుస్తుంటారు. ఎంతటి పెద్ద విజయమైనా అది అందరి భాగస్వామ్యంతోనే సాధ్యమైందని అందరి ఎదుట ప్రకటించడమే కాదు అందరినీ అభినందించడం ఇస్రో ఉద్యోగులలో ఉత్సాహాన్ని నింపుతుంది. సహకారం, సమిష్టి కృషి, గుర్తింపు, ఇలా ఎన్నో ప్రోత్సాహకరమైన పద్ధతులు, పరిస్థితులు వారివారి నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంలో సఫలమై ఇస్రోకు అపారమైన విజయాలకు కారణమవుతున్నాయి.

**అంతరిక్ష పరిశోధనల వల్ల ఎన్నో లాభాలు**

వేలకోట్లు వెచ్చించి చేసే అంతరిక్ష పరిశోధనల వల్ల ప్రజలకు, సమాజానికి, దేశానికీ ఎన్నో లాభాల సమకూరుతున్నాయి. ప్రాంతీయ సంపదలను వెలికి తీయడం, ప్రకృతి వైపరీత్యాలను ముందుగా పసిగట్టి సమాచారాన్ని అందజేయడం, వ్యవసాయం, అడవులు, జలసంపద మొదలైన వాటి విస్తీర్ణాన్ని తెలుసుకొని ప్రణాళికలు రచించడం, వాతావరణం, కమ్యూనికేషన్, విద్య, వైద్య రంగాలలో కావలసిన టెక్నాలజీని అందజేయడం మొదలైన ఎన్నో సేవలను అంతరిక్ష విజ్ఞానం అందజేస్తోంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, పరిపాలనా సౌలభ్యానికి అవసరమైన టెక్నాలజీ పొందడానికి ఇస్రోతో ఒప్పందం కుదుర్చుకుంది. దేశంలోని అనేక రాష్ట్రాల సమగ్రాభివృద్ధికి ఇస్రోతో కుదుర్చుకున్న ఒప్పందాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలను కాపాడుకోవడంలో ఇస్రో అందించిన సాంకేతికత ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఇస్రో ద్వారా ప్రయోగించిన ఉపగ్రహాలు అందిస్తున్న సేవలు, కమ్యూనికేషన్ రంగంలో, టెలివిజన్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు తెరతీయడం మనమందరం చూస్తున్నాము. ఉపగ్రహాల ద్వారా అందించేసే అనేక విషయాలు దేశాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయి. రానున్న కాలంలో ఉపగ్రహ సేవలు మరిన్ని రంగాలలో విస్తరించి మానవ జీవనాన్ని సుఖమయం చేయడానికి ఎంతగానో ఉపయోగపడతాయి.

**అవుట్‌రీచ్ – ఓ అద్భుత కార్యక్రమం**

అంతరిక్ష పరిశోధనలు, వాటి ఫలితాలు కేవలం చదువుకున్న వారికి అవగాహన ఉన్నా వారికే పరిమితం కాకుండా సామాన్య ప్రజలకు చేరువకావలన్న సదుద్దేశ్యంతో ఇస్రో, అంతరిక్ష విభాగం అంతరిక్ష విజ్ఞానాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అనేక కార్యక్రమాలను చేపడుతున్నది. అందులో భాగంగా షార్ కేంద్రం. శ్రీహరికోట షార్ డైరెక్టర్ డా॥ కున్హికృష్ణన్ ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాలుగా ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు అక్టోబర్ 4 నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. (అక్టోబర్ 4, 1957లో మానవ నిర్మితమైన మొట్టమొదటి కృత్రిమ ఉపగ్రహాన్ని స్పుత్నిక్–1 ను ప్రయోగించారు. అక్టోబర్ 10, 1967న అంతరిక్ష పరిశోధనలు, ప్రయోగాలు కేవలం శాంతి ప్రయోజనాలకే ఉపయోగ పడాలని ఒప్పందం జరిగింది. ఈ రెండు తీర్మానాల ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని అక్టోబర్ 4 నుంచి అక్టోబర్ 10 వరకు ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష వారోత్సవాలు జరుపుకుంటారు). ఈ సంవత్సరం (2017) షార్ కేంద్రం శ్రీహరికోట పరిధిలో, షార్ యాజమాన్యం ఆధ్వర్యంలో 22 కేంద్రాలలో ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలతో పాటు 5 రాష్ట్రాలలో అంతరిక్ష వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వారోత్సవాల ద్వారా మరియు 'ఔట్‌రీచ్' కార్యక్రమం ద్వారా అంతరిక్ష కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యాయి అనడంలో సందేహంలేదు.

**మేధావులైన చిన్నారుల కోసం**

**మేధావులైన విద్యార్థుల కోసం, వారిని**



**అంతరిక్ష ప్రయోగాలు వైపు ఆకర్షించడం కోసం ఇస్రో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్సు అండ్ టెక్నాలజీ ప్రారంభించింది. ఈ ఇనిస్టిట్యూట్‌లో సీటు పొందిన విద్యార్థులకు ఉచిత ఇంజనీరింగ్ విద్యతో పాటు ఇస్రోలో ఉద్యోగం కూడా లభిస్తుంది.** వివిధ విశ్వవిద్యాలయాలలో ఇస్రో అంతరిక్ష పరిశోధనలు చేయడానికి ప్రోత్సాహిస్తున్నది. ఇస్రో చేస్తున్న వివిధ కార్యక్రమాల ద్వారా ఎందరో విద్యార్థులు అంతరిక్ష విజ్ఞాన పరిశోధనలు వైపు ఆకర్షితులవుతున్నారు.

**షార్ శ్రీహరికోటను చూడాలంటే**

అంతరిక్ష కేంద్రం షార్ శ్రీహరికోటను సందర్శించాడానికి విద్యార్థులకు, సందర్శకులకు అనుమతి లభిస్తుంది. పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్, షార్ శ్రీహరికోట – 524124 నెల్లూరు జిల్లాను సంప్రదించి ముందస్తు అనుమతిని తీసుకొని సందర్శించవచ్చును.

రాబోయే రోజులలో షార్ కేంద్రం శ్రీహరికోట ద్వారా మరిన్ని ఫలవంతమైన రాకెట్ ప్రయోగాలు జరిగి దేశఖ్యాతిని ఇనుమడింపచేయడంలో శ్రీహరికోట ముందు వరసలో ఉండగలదని ఆశిద్దాం.

■

ప్రపంచ జనాభాదినోత్సవ ప్రత్యేక వ్యాసం

# జనహో భారత్

– టంగుటూరి శ్రీరామ్



**ప్రస్తుతం మన జనాభాలో సుమారు సగం మంది 25 ఏళ్ళలోపువాళ్ళు. ఇది అత్యంత ఆశాజనకం. మరో పక్క విషాదకరమైన విషయం మనదేశంలో రెండు పూటలా కడుపు నిండా ఆహారం దొరకని వారి సంఖ్య దేశ విభజన 1947 నాటికంటే (35 కోట్లు) ఎక్కువే. మరి దీనికి కారణం. దారిద్ర్యమా, అవిద్యా, సంపదా? అధిక జనాభానా? వనరుల దుర్వినియోగమా? వాటి తరుగదలా? సమాధానాలు శోధించడం, తగిన దిద్దుబాటు చర్యలను అందించడమే ప్రపంచ జనాభా దినోత్సవం ముఖ్యోద్దేశ్యం.**

జనం బలమా! బలహీనతా?

జనం జనం ప్రభంజనం, జనం ఒక శక్తి, జనం ఒక యుక్తి, జనం ఒక వరం, అయితే అది ఒక శాపం కాకూడదు. జనాభా ఈ భూమండలానికి సంపదను పెంచే వనరు కావాలి. జనాభా సమస్యను నివారించే, అధిగమించే ఆయుధం కావాలి. నిజానికి మానవుడు తలచుకుంటే అసాధ్యాన్ని సుసాధ్యాం చేయగలడు. ఒకరి కోసం ఒకరు అన్నట్లుగా నిలిస్తేనే మనిషి మనుగడ సురక్షితం ప్రకృతికి క్షేమం.

ప్రపంచంలో మూడొంతులు జలంతో నిండి ఉందన్నది భౌగోళిక వాస్తవం. ఒక వంతు భూమిలో భగవంతుడు సహజ వనరులను కల్పించాడు. భూప్రపంచమంతా జనంతో నిండి పోతున్నది కూడా నేడు ప్రపంచ దేశాలను కలవర పరుస్తున్న చేదునిజం. ఇది మానవుడు సృష్టిస్తున్న వికృతి. ప్రపంచ జనాభా అదుపు లేకుండా పెరుగుతోంది. కొన్ని దేశాలలో అతి వేగంగా మరికొన్ని దేశాలలో మంద కొడిగా పెరుగుతున్నది. ప్రపంచం మొత్తంగా ఒకవైపు జనాభా హద్దుమీరిన పెరుగుదల మరోవైపు సహజ వనరుల ఆందోళన కరంగా తగ్గుదల. ఈ పరిస్థితిని జన విస్ఫోటనం అంటారు. మానవ బాంబుగా పరిగణిస్తారు. విజ్ఞాన శాస్త్ర పరంగా జనాభా అనేది బలమా? బలహీనతా? అని తెలుసుకునే పరిస్థితులలో ప్రపంచ దేశాలు తల మునకలవుతున్నాయి. అన్ని దేశాల మానవులు ఒకే జాతి కాబట్టి అందరు కలిసికట్టుగా నిలబడాలి, నడవాలి, నడుం బిగించాలి.

### ప్రపంచ జనాభా దినోత్సవాలు ఎందుకు?

అధిక జనాభా వలన భూమాతకు అన్ని కోణాల్లో నష్టం వాటిల్లుతున్నది. మానవ జాతి తన అవసరాలనూ, తీర్చుకోడానికి సహజ వనరులను ఉపయోగించినంతగా సృష్టిలో మరే జాతి ఉపయోగించదు. అందువల్ల నీరు, ఇంధనం, కొండలు, అడవులు, ఖనిజాలు, సూర్యరశ్మి, వృక్షాలు, పక్షులు, జంతువులు, మానవుడి విలాసాలకు బలిఅయి అంతరించి పోయే స్థాయికి చేరుకున్నాయి. అంతేకాకుండా మానవుడు సృష్టించుకున్న మానవ వనరులు కూడా నశించిపోతున్నాయి. అందుకే ఈ వినాశనాన్ని ఆపడానికి, జనాభా పెరుగుదలను తగ్గించి, స్థిరీకరించడానికిగాను ప్రపంచ దేశాల వాతవరణ, పర్యావరణ, జనాభా నియంత్రణ, జీవశాస్త్ర మొదలగు శాస్త్రవేత్తలూ, నిపుణులు, అధికారులు కలసి ఏకతాటిపైకి వచ్చి, అవసరమయ్యే విధి విధానాలను, సూత్రాలను, రూపకల్పన చేసుకోడానికే ప్రతి సంవత్సరం

అధ్యక్షుడు, ప్రకాశం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డవలప్‌మెంట్ స్టడీస్, విజయవాడ.
E-mail : tanguturi01@gmail.com

జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. ఈ సమావేశంలో తమ తమ దేశాలలోని జనాభా స్థితిగతులకు అనుగుణంగా, దేశాలు సమగ్రాభివృద్ధి సాధించ డానికీ, తద్వారా భూమాత తాపాన్ని తగ్గించ డానికి తీసుకోవలసిన చర్యలను రూపొందించు కుంటారు. అందుకని జులై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (యు.ఎన్.డి.పి.) 1989లో నిర్ణయం తీసుకుంది. జులై 11న, 1987 రోజు మానవ చరిత్రలో మరుపునాని రోజు ఎందుకంటే ఈ రోజు ప్రపంచ జనాభా 500 కోట్లకు చేరుకుంది. తరువాత 1989 సం॥ నుంచి ఐక్యరాజ్యసమితి (ఐ.రా.స.) ప్రతి ఏడాది, క్రమం తప్పకుండా ఈ దినోత్సవాన్ని తప్పని సరిగా జరుపుతున్నది.

## ప్రపంచంలో భారతం

యునైటెడ్ నేషనల్ పాపులేషన్ ఫండ్ (UNFPA) తమ లెక్కల్లో అక్టోబర్ 31, 2011న ప్రపంచ జనాభా 700 కోట్లకు చేరుకుంది. ఇక్కడ ఆసక్తికరమైన విషయం – ప్రపంచ జనాభాలో ఏడు వందల కోట్లవ శిశువు సంఖ్య భారతానికే దక్కడం. ఆ చిన్నారి లక్నో సమీపంలో పుట్టిన ఆడ శిశువు కావడం, ఆ చిన్నారినే "బేబి సెవెన్ మిలియన్"గా పిలవడం, ఆమె మన భారతమాత బిడ్డ కావడం మన అదృష్టంగా భావించాలి. ప్రపంచంలో గత యాభై ఏళ్ళలో నమోదైన పెరుగుదల అంతకుముందు ఇరవై లక్షల ఏళ్ళకన్నా ఎక్కువ. 2050 స॥నికి ప్రపంచ జనాభా 705 కోట్ల నుంచి 1000 కోట్ల మధ్య ఉండవచ్చునని అంచనా. ఇక మొత్తం జనాభాలో 60 శాతం అసియాలోనే ఉన్నారు. భారతదేశం విషయానికి వస్తే దేశ జనాభా 121 కోట్లపై చిలుకే. మన దేశ జనాభా అమెరికా, ఇండోనేషియా, బ్రెజిల్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, జపాన్ల మొత్తం జనాభాకు సమానం. ప్రపంచ జనాభాలో 17.5 శాతం జనాభా మనదే. అంటే ప్రపంచం మొత్తం మీద ప్రతి ఆరుగురిలో ఒకరు భారతీయుడన్న మాట.

జనాభా అసమానతలను, నిశితంగా గమనిస్తే ఆందోళనకరమైన విషయాలు బయటకు వస్తున్నాయి. ప్రపంచంలో 80 శాతం సంపద కేవలం 20 శాతం సంపన్న దేశాలు మాత్రమే అనుభవిస్తున్నాయి. సంపన్న దేశాల్లో వార్షికాదాయం 22,060 (సుమారు) డాలర్లు కాగా అదే పేద అభివృద్ధి చెందుతున్న దేశాల వార్షికా దాయం 3,580 డాలర్లుగా నమోదైంది. యూరప్ దేశాల జనాభా పెరుగుదల స్థంభించగా అసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాల్లోనే పెరుగుదల అతి వేగంగా సాగుతోంది. పర్య వసానం–మానవుల, దేశాల మధ్య యుద్ధాలు, జలయుద్ధాలు, భూయుద్ధాలు, ఆధి పత్యపోరులు, రాజకీయ, సామాజిక, ఆర్థిక అసమానతలు వీటి వల్ల మానవ జాతి మనగ డకూ, ముప్పు వాటిల్లుతున్నది. వీటిని అధిగమిం చడానికే ప్రపంచ జనాభా దినోత్సవాల వేదికలు జనాభాకన్నా సహజ మానవ వనరులకు పేగుబంధం ఉంది. అది విడదీయలేనిది. జనాభా పెరుగుదల, తరుగుదల అనేవి మాత్రమే సమస్యే కాదు, జనాభా ఎలా పెరుగుతోంది దానితో పాటు వనరుల, లభ్యత వాటిని ఉపయోగించే తీరు. వాటి తరుగుదల, మీద ప్రధానంగా ఆధారపడి ఉంటుంది. ఆ మాట కొస్తే దేశ ప్రగతి వనరుల దుర్వినియోగము మీద కూడా చాలా మటుకు, ఆధారపడి ఉంటుంది. కనుకనే నోబెల్ గ్రహీత ఆమర్త్యసేన్ ఇలా అన్నారు. ఓజోన్‌పొర, భూతాపంపై ఒక అమెరికన్ కలిగించే ప్రభావం కంటే డజన్ల సంఖ్యలో భారతీయులు లేదా జింబాబ్వే ప్రజలు కలిగించేది చాల తక్కువ అని.

ఇక భారతావని విషయాన్ని పరిశీలిస్తే భరతమాత పేదరాలు కాదు. భారతీయులు మాత్రమే పేదవారు. ఇందులో అతియోశక్తి లేదు. అక్షర సత్యం కూడా సహజ వనరులలో, ఖనిజ సంపదలో, భారతదేశం ఏ ఇతర దేశాలకన్నా తీసిపోదు. దేశ ప్రగతికి అత్యవసరమైన మానవ వనరులలో భారత దేశానిదే ప్రపంచంలో పై చేయి.

విజ్ఞానశాస్త్రంలో కనీవినీ ఎరుగని రీతిలో ప్రగతి సాధిస్తూ, ఆర్థికరంగంలో, వాణిజ్య సంస్కరణల్లో, జీవవైవిధ్య పరిరక్షణలో, అగ్ర రాజ్యాల జాబితాలో స్థానం సంపాదించుకొంది. ప్రపంచ సంపన్నుల జాబితాలో భారతీయులు కూడా ఉన్నారు. ప్రస్తుతం మన జనాభాలో సుమారు సగం మంది 25 ఏళ్ళలోపువాళ్ళు. ఇది అత్యంత ఆశాజనకం. మరో పక్క విషాదకరమైన విషయం మనదేశంలో రెండు పూటలా కడుపు నిండా ఆహారం దొరకని వారి సంఖ్య దేశ విభజన 1947 నాటికంటే (35 కోట్లు) ఎక్కువే. మరి దీనికి కారణం. దారిద్ర్యమా, అవిద్యా, సంపదా? అధిక జనాభానా? వనరుల దుర్వినియోగమా? వాటి తరుగదలా? సమాధానాలు శోధించడం, తగిన దిద్దుబాటు చర్యలను అందించడమే ప్రపంచ జనాభా దినోత్సవం ముఖ్యోద్దేశ్యం. రానున్న రోజులలో భారత దేశం జనాభా పరంగా చైనాను అధిగ మించనున్నది. అత్యధిక 'ఉత్పదక శక్తి'గా అవత రించబోతున్నది. అని ప్రపంచ పరిశోధనలు, అంచనాలు వెల్లడిస్తున్నాయి. ఇందుకోసమై "7 మిలియన్ క్యాంపెయిన్" లోని సందేశాలను క్రింద తెలిపిన విధంగా తూ.చ. తప్పకుండా ఆచరిస్తున్నది మన దేశం.

1. దారిద్ర్యన్ని అసమానతలనూ, తగిస్తూ, జనభా పెరుగుదల, వేగాన్ని నియంత్రిం చడం.
2. మహిళలు, యువతల శక్తి యుక్తులను వినియోగించడం ద్వారా సుస్థిర ప్రగతిని సాధించడం.
3. ప్రపంచాన్ని, భవిష్యత్తుని మార్చడంలో జనాభాలో అత్యధికంగా ఉన్న యువ తరాన్ని ప్రోత్సహించడం వారికి శిక్షణ కల్పించడం.
4. సురక్షిత ప్రసవాల ద్వారా చిన్న, బలమైన, ఆరోగ్యకరమైన కుటుంబాలకు దారి చూపడం.
5. ఏడు బిలియన్ల పై చిలుకు ప్రజానీకం మనుగడయే ఈ భూ గ్రహపు ఆరోగ్యం మీద ఆధారపడి ఉందనే నగ్న సత్యాన్ని గ్రహించి మెసలుకోవడం.
6. తక్కువ సంతానం, దీర్ఘాయుస్సుల వలన వృద్ధుల శకం రావటం.

7. సుమారు 2 బిలియన్లపై మేరకు ప్రజలు నగరాలకే పేరుకు పోతున్నందుకు తగు ప్రణాళికలను సిద్ధం చేసుకోవడం.

వీటితోపాటు ఇంతవరకు ప్రపంచ జనాభా దినోత్సవం నాడు ప్రజలలో ఈ అంశాలపై అవగాహన కల్పించాలి. కుటుంబ నియంత్రణ, స్త్రీ, పురుష సమానత్వం, మాతాశిశు సంక్షేమం, పేదరిక నిర్మూలన, ప్రాథమిక హక్కుగా ఆరోగ్యం, లైంగిక విద్య, లైంగిక రోగాలు, బాల్య వివాహాలు గర్భనిరోధక సాధనాలవలన జరిగే నష్టాలపై విశిష్టంగా యువతకు అవగాహన సదస్సులు నిర్వహించడంపై మనదేశం దృష్టి సారించాలి. ఆహార పదార్థాల పెంపుకు, ఆర్థిక పుష్టి విషయాలపై ప్రజలలో అవగాహన పెంచి తద్వారా ఆరోగ్యలని పెంచడం. "తిండి కలిగితే కండ కలదోయ్ కండ కలవాడే మనుజుడోయ్" అనే మన పూర్వీకుల సందేశాన్ని అమలు పర్చాల్సిన అవసరం ఆసన్నమైనది. ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే జనాభాను నియంత్రించనందున చైనా యువ జనాభా లేని దేశమవుతోందని భారతదేశం 2050 కల్లా అత్యధిక యువ జనాభా దేశంగా ఆవిర్భవించనుందని గ్రహించి చైనా "ఒక్కరు చాలు లేక అసలు వద్దు సంతానం" దశనుంచి "పిల్లలను కనండి" అనే ప్రచారం ఇటీవల ప్రారంభించింది. దీనికి భిన్నంగా మనదేశం కుటుంబ నియంత్రణను నిర్బంధం చేయకుండా అవగాహన పెంచి, స్వచ్ఛందంగా పాటించేలా చేసినందున మన యువత ప్రపంచాన్ని జయించగలదన్న నమ్మకాన్ని సాధించింది.

జూలై 11, 2018న ప్రత్యేకించి ఐక్యరాజ్యసమితి పాలక మండలి జనాభా సమస్యల మీద కుటుంబ నియంత్రణ మీద ప్రత్యేక శ్రద్ధ వహించాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరింది. ఈ సం॥ 1968 నాటి "ఇంటర్ నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ హ్యూమన్ రైట్స్" 50వ వార్షికోత్సవ సందర్భంగా కుటుంబ ప్రణాళికను ప్రపంచం యావత్తూ మానవ హక్కుగా నిర్ణయించింది. టెహ్రాన్ ప్రకటన ప్రకారం కుటుంబ నియంత్రణ, ప్రణాళికను మొట్ట మొదటిసారి తల్లిదండ్రులు స్వచ్ఛంధంగా బాధ్యతాయుతంగా వారి పిల్లల సంఖ్య మరియు అంతరాన్ని గుర్తించడాన్ని ఒక ప్రాథమిక మానవ హక్కుగా వెలుగులోకి తెచ్చింది. సురక్షిత, స్వచ్ఛంధ కుటుంబ ప్రణాళిక, లింగ సమానత్వం స్త్రీల సాధికారిత మొదలగు అంశాలను ఈ ప్రపంచ జనాభా దినోత్సవంలో చర్చించనున్నారు. 2017 జనాభా దినోత్సవంలో జులై 2020 నాటికి 120 మిలియన్ల మంది మహిళలకు స్వచ్ఛంధ కుటుంబ ప్రణాళికను విస్తరింపచేయడానికి గాను "FT2020 కుటుంబ ప్లానింగ్ ఇనిషియేటివ్" ను రచించారు.

మహాత్మగాంధీ కలగన్న గ్రామస్వ రాజ్యాన్ని నిజం చేయడానికిగాను గ్రామీణ ప్రజలలో ముఖ్యంగా గ్రామీణ యువతకు, గ్రామాలలో, పల్లెలలో అవసరమైన శిక్షణ ఇవ్వడం అత్యవసరం అని గ్రహించారు. తెలుగు తెజం ఆంధ్రకేసరి టుంగుటూరి ప్రకాశం పంతులుగారు, గ్రామీణ యువతకు వ్యవసాయం మీద, వ్యవసాయ ఆధారిత రంగాల మీద అవగాహన, శిక్షణ ఇవ్వడానితి తన సొంత ఖర్చుతో జాతీయ బడులని (FT) ప్రారంభించారు. అందులో వ్యవసాయ పనిముట్ల తయారీ, చేనేత, వస్తుపంపిణీ విధానాలపై తరగతులను నిర్వహించేవారు. ప్రకాశంగారి దూరదృష్టికి ఇది ఒక సజీవ ఉదాహరణ ఈ రోజుకీ మనదేశం వ్యవసాయ ఆధార దేశమే. సుమారు 60 శాతం ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు. కనుక మన ప్రధాని గ్రామీణ యువతకు వారిని ఉత్పాదక శక్తిగా తీర్చిదిద్దడానికి అనేకానేక పథకాలను చేపట్టారు.

జనాభా ఎక్కువ ఉంటే తక్కువ అభివృద్ధి, తక్కువ జనాభా ఉంటే ఎక్కువ అభివృద్ధి అనే సూత్రం నిజంకాదు, చైనా, భారత్‌లు ఎక్కువ జనాభా ఉన్నప్పటికీ వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. మూడవ స్థానంలో ఉన్న అమెరిగా ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశంగా అవతరించింది. మలేషియా, నేపాల్ దేశాల జనాభా దాదాపు సమానమే అంటే ఈ సంఖ్య సుమారు 24 మిలియన్లు కానీ మలేషియా తలసరి ఆదాయం నేపాల్ తలసరి ఆదాయం కంటే ఆరు రెట్లు ఎక్కువ. జాంబియా, బెల్జియం పరిస్థితి కూడా అంతే. బెల్జియం తలసరి ఆదాయంలో కేవలం మూడు శాతం తలసరి ఆదాయం మాత్రమే జాంబియా కలిగి ఉంది. ఇలాగే ఎన్నో దేశాలని కూడా పోల్చి చూడవచ్చును. అభివృద్ధి అనేది ఉత్పాదక దశలో ఉన్న ప్రజలు తమ శక్తి యుక్తులను, పరిజ్ఞానాన్ని ఏ విధంగా వినియోగిస్తున్నారు? ఎటువంటి విద్య పొందియున్నారు, పొందుతున్నారు. ఎలాంటి శిక్షణ తీసుకొంటున్నారు అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. అంతేకాదు ఆదేశంలో ఉన్న మానవ వనరులను ఏ మేరకు వాడుకోగలుగుతున్నారు లేక వృధాగా పాడు చేస్తున్నారా లేక నిరుపయోగంగా ఉంటున్నాయా అన్న అంశం మీద కూడా ఆధారపడి ఉంటుంది. వీటికి తోడు ప్రభుత్వ విధానాలు, ప్రజల సంస్కృతి, ఆచార వ్యవహారాలు, సాంప్రదాయ పద్ధతులు, భౌగోళిక స్వరూపం కూడా "జనం అభివృద్ధి" పై పెద్ద మొత్తంలో ప్రభావము చూపుతాయి. నిరుద్యోగమంటే పని చేయగల సత్తా, ఆరోగ్యము పరిజ్ఞానం ఉన్న ప్రజలకు ఉపాధి అవకాశాలు లేక పోవడం మాత్రమే.

భారత యువతను విజ్ఞానవంతులుగా, నిపుణులుగా ఉపాధి మార్గాలుగా తయారు చేయడానికి కొన్ని పథకాలు ఇవి. 'ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన' నైపుణ్య భారత్, ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవెలప్‌మెంట్ (ఓ.ఈ.స.డి.) "నాట్ ఇన్ ఎంప్లాయ్‌మెంట్, ఎడ్యుకేషన్, ఆర్ ట్రైనింగ్ (నీట్) పరిధిలోకి తీసుకొచ్చి వారిలో నైపుణ్యాన్ని కలిగించే ప్రయత్నాన్ని ప్రతిష్ఠాత్మకంగా కౌశల్య యోజన, అంత్యోదయ యోజన మొదలైనవి. ఇంకా చాల రకాల వైవిధ్యంగల ప్రజాసంక్షేమ పథకాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మానవ వనరుల విశ్వరాజధాని కానున్న భారతవని ప్రగతికి సాధించడానికి కృషి చేస్తున్నాయి.

■

*25వ పేజీ తరువాయి...*

## రైతు సంక్షేమానికే అధిక ప్రాధాన్యత

సమీకృత తేనెటీగల అభివృద్ధికేంద్రాల ఏర్పాటు, వాటికి నిధుల కేటాయింపును చెప్పుకోదగిన స్థాయిలో పెంచడంతో తేనె ఉత్పత్తి గత నాలుగు సంవత్సరాలలో రికార్డు స్థాయికి చేరింది. కనీసం 50 పెట్టెల స్థాయిలో సాగే చిన్న స్థాయి తేనె వ్యాపారం కూడా రైతులకు 2 నుంచి 2.5 లక్షల రూపాయల రాబడిని క్రమం తప్పకుండా అందిస్తుంది. అలాగే వెదురు నుంచి కూడా రాబడి పెంచుకోవచ్చు. దీనికున్న విలువను బట్టి దీనిని హరిత బంగారంగా కూడా పరిగణిస్తుంటారు. అటవీయేతర ప్రాంతాలలో కూడా వెదురును చెట్టు కింద పరిగణిస్తుండడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనవలసి వచ్చేది. దీనితో కేంద్ర ప్రభుత్వం దీనిని అటవీయేతర ప్రాంతంలో గడ్డిరకం కింద వర్గీకరించి రైతులకు వెసులుబాటు కల్పించింది. ఫలితంగా వెదురు సాగు, కోత, రవాణా, చేతివృత్తులలో ముడి సరకుగా వాడకానికి సంబంధించి వెసులుబాటు కలిగింది. ఇటీవలే కొత్తగా పునర్ వ్యవస్థీకృత జాతీయ వెదురు మిషన్‌ను 1290 కోట్ల రూపాయల పెట్టుబడితో ప్రారంభించారు. వెదురు రంగాన్ని ప్రోత్సహించేందుకు తీసుకున్న సానుకూల చర్య ఇది. రైతులకు మంచి అదనపు రాబడినివ్వగల పంట పుట్టగొడుగుల పెంపకం. దీనికి దేశీయంగా, విదేశీ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దీని వ్యాపార అవకాశాలనూ రైతులు అందిపుచ్చుకోవచ్చు. పుట్టగొడుగుల పెంపకానికి సంబంధించి రైతులకు తగిన ఆర్థికసహాయం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం జరుగుతోంది. అలాగే ప్రభుత్వం కోళ్లు, మేకలు, పందులు, వివిధ చెరువులలో చేపల పెంపకానికి రైతుకు అదనపు రాబడిగా తగిన చేయూతనిస్తోంది. మేరా గావ్, మేరా గౌరవ్ అనే వినూత్న పథకం కింద నలుగురు వంతున వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం ఒక్కొక్క బృందం ఐదు గ్రామాలను దత్తత తీసుకుని వాటిలో వ్యవసాయ అనుబంధ రంగాల కార్యకలాపాలలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని ప్రదర్శించి చూపుతుంది. ఆ రకంగా రైతులకు ఆయా రంగాలపై అవగాహన కల్పించి వారికిసాధికారత కల్పించడంతోపాటు నైపుణ్యాన్ని పెంచి రాబడి పెరిగే మార్గాలపై సమాచారం అందిస్తారు.

మరో గొప్ప ముందడుగు ఏమంటే, రైతులు తమ బీడు భూములలో సౌరవిద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు ప్రోత్సహించేలా ప్రభుత్వం విధివిధానాలను రూపొందిస్తోంది. ఇది రెండు రకాల ప్రయోజనాలు ఇవ్వనుంది. ఒకటి, రైతులు తమ పంట పొలాలకు సౌర విద్యుత్ పంపులను బిగించుకోవచ్చు, రెండవది మిగులు సౌర విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేసి అదనపు రాబడి పొందవచ్చు. రైతులు గ్రిడ్‌కు సరఫరా చేసే మిగులు సౌర విద్యుత్‌పై రైతులకు లాభసాటి ధర వచ్చే విధంగా తగిన యంత్రాంగాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వాలను ప్రోత్సహించడం జరుగుతుంది.

2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు కేంద్రప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తున్నది. ఇందుకు తగిన విధానాలు, అనువైన కార్యక్రమాలు చేపట్టడంతోపాటు అవసరమైన బడ్జెట్ కేటాయింపులూ చేస్తోంది. అయితే ఇంతకాలంనుంచీ ఉన్న పొలం నుంచే ఎక్కువ రాబడి వచ్చేలా చేయాలంటే అందుకు రాష్ట్ర ప్రభుత్వాలు, సహకార సంఘాలు, రైతు సంస్థలు, వ్యవసాయంతో సంబంధం ఉన్న వివిధ పరిశ్రమలు, రైతులు ఏకతాటిపై సమున్నత లక్ష్యసాధన దిశగా దృఢదీక్షతో కృషి చేయవలసి ఉంది. ■


### యోజన చందా ఆన్‌లైన్‌లో

భారత ప్రభుత్వ ప్రచురణల విభాగం వారి యోజన, ఇతర పత్రికలకు చందాను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. www.Bharatkosh.gov.in వెబ్ సైట్‌లో Publications' Division వారి linkను క్లిక్ చేసి సూచనలను అనుసరించండి. చెల్లింపులు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్ ద్వారా చెయవచ్చు.

చందా వివరాలు సంవత్సరానికి రూ. 230/–, రెండు సంవత్సరాలకు రూ. 430/–, మూడు సంవత్సరాలకు రూ. 610/–లు.

*– సీనియర్ ఎడిటర్*


■


యోజన

ఆగష్టు, 2018 సంచిక

సామాజిక సాధికారత

# డిజిటల్ భారతం

- ఎం. ఎస్. లక్ష్మి



**డిజిటల్ ఇండియా కార్యక్రమం కింద గ్రామ పంచాయితీ స్థాయిలో 2.5 లక్షల కామన్ సర్వీస్ సెంటర్ల (CSC)ను ఏర్పాటు చేయటం ద్వారా స్వయం నిర్భర నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసి, వివిధ పౌర సేవలను అందించటం CSC 2.0 ఉద్దేశ్యం. దేశ వ్యాప్తంగా ఒకే వేదిక ద్వారా e-సేవలను అందించే విధంగా, లావాదేవీల ఆధారితంగా, సేవల డెలివరీ ఆధారిత నమూనాగా దీన్ని రూపొందించారు. విద్యుత్, మంచి నీరు, మొబైల్, బ్రాడ్ బ్యాండ్ DTH, వంట గ్యాస్, వంటి చార్జీల చెల్లింపులకు భారత్ BillPay వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. RBI దిశా నిర్దేశం మేరకు National Payments Corporation of India (NPCI) దీన్ని నిర్వహిస్తోంది.**

ఎలక్ట్రానిక్ పాలన అంటే... e-పాలనను పటిష్టం చేయటానికి గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలు, పలు మంత్రిత్వ శాఖలు ఎన్నో చర్యలను అమలు చేశాయి. పౌర సేవలను మెరుగు పరిచి, పౌరులు వాటిని పొందే ప్రక్రియను సరళతరం చేయటానికి పలు స్థాయిల్లో నిరంతర కృషి జరుగుతోంది. దేశంలో e-పాలన ....ప్రభుత్వ విభాగాల కంప్యూటరీకరణ దశ నుంచి.....పౌర సేవల కేంద్రితంగా మారి, సుపరిపాలన కోసం సాంకేతికతను సద్వినియోగం చేసుకునే దిశగా పరిణామం చెందుతోంది. e-పాలన కోసం ప్రభుత్వాలు, వివిధ శాఖలు అమలు చేస్తున్న పలు అంశాలను అనుసంధానించి మెరుగైన ఫలితాలను సాధించే స్థితికి ఈ పరిణామం విస్తరించింది. ప్రస్తుతం ప్రగతిశీల e-పాలన వ్యూహాన్ని రూపొందించుకునే క్రమంలో గతంలోని e-పాలన పాఠాలు కీలక పాత్ర పోషిస్తాయి. e-పాలన వల్ల పెద్ద ఎత్తున ఖర్చులు తగ్గించుకోగల సామర్థ్యం లభించటంతోపాటూ, పాలనలో ప్రమాణాలను సాధించుకోవటం, సేవలను వేగంగా అందించటం సాధ్యం అవుతుంది. అన్నిటినీ మించి వ్యవస్థలో పారదర్శకత వస్తుంది. ప్రజాధనం సంపూర్ణంగా సద్వినియోగం అయ్యే వెసులుబాటు లభిస్తుంది. e-గవర్నెన్సును వేగవంతం చేయటానికి జాతీయ, రాష్ట్ర, స్థానిక స్థాయిల్లో ప్రభుత్వాలు పలు చర్యలు తీసుకుంటున్నాయి.

డిజిటల్ ఇండియా సాధన దిశగా గత కొన్నేళ్లుగా కృషి జరుగుతున్నా, ఇటీవల కేంద్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ద్వారా చేపట్టిన పలు చర్యల వల్ల డిజిటల్ ఇండియా కార్యక్రమం వేగం పుంజుకుంది. సమగ్ర, వ్యూహాత్మక ధోరణితో, బహుముఖంగా చేపట్టిన ఈచర్యల్లో మూడు అంశాలలో గణనీయమైన ప్రగతి చోటుచేసుకుంటోంది. స్థూలంగా చెప్పాలంటే, డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పన, డిజిటల్ పౌర సేవలు, సాధికార కల్పన అంశాలలో ప్రభుత్వం చేపట్టిన పలు చర్యలు సత్ఫలితాలి స్తున్నాయి. ఆయా రంగాల్లో ఇటీవల తీసుకుం టున్న చర్యలు ఏ విధంగా అమలు జరుగు తున్నాయో, ఎవరికి ఉపయోగపడుతున్నాయో చూద్దాం.

### డిజిటల్ మౌలిక సదుపాయాలు:

డిజిటల్ కార్యకలాపాల నిర్వహణలో మౌలిక సదుపాయాల కల్పన అతి కీలకమైంది. టెక్నాలజీ ద్వారా లభించే సులువైన, వేగవంత మైన సేవలు ప్రజల చెంతకు రావటానికన్నా ముందు... అందుకు అవసరం అయిన మౌలిక సదుపాయాలను భారీ ఎత్తున నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తూ, పలు

సీనియర్ జర్నలిస్టు, హైదరాబాద్
E-mail : lakshmiair@hotmail.com

కార్యక్రమాలను మిషన్ మోడ్‌లో చేపట్టింది.

**భారత్ బ్రాడ్ బ్యాండ్ నెట్‌వర్క్ (BBNL):**

దేశ వ్యాప్తంగా జాతీయ ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ (NOFN) ను ఏర్పాటు చేసేందుకు 1000 కోట్ల రూపాయిల మూలధనంతో కేంద్ర ప్రభుత్వం కంపెనీల చట్టం కింద ఏర్పాటుచేసిన ప్రత్యేక ప్రయోజనాల వాహకం ఈ భారత్ బ్రాడ్ బ్యాండ్ నెట్‌వర్క్. దేశ వ్యాప్తంగా 641 జిల్లాలలో ఉన్న 2,50,000 గ్రామ పంచాయితీలను అనుసంధానించాలని ప్రతిపాదించింది. గత నాలుగేళ్ళుగా ఈ కార్యక్రమం గణనీయమైన ప్రగతి సాధించిందని ప్రాజెక్ట్ నివేదికలు చూపుతున్నాయి. సరసమైన ధరలకు గ్రామీణ ప్రాంతాలకు హైస్పీడ్ డిజిటల్ సేవలు అందించటం, గ్రామీణ ప్రాంతాల సామాజిక ఆర్థిక అభివృద్ధికి బ్రాడ్ బ్యాండ్ సేవలను విస్తరించటం, తద్వారా డిజిటల్‌గా భారత్‌ను సాధికార-విజ్ఞానాధారిత ఆర్థిక వ్యవస్థగా మెరుగు పరుచుకోవటం ఈ కార్యక్రమ ఉద్దేశ్యం. ఈ ఏడాది జూన్ రెండో వారం నాటికి దేశ వ్యాప్తంగా లక్షా 11 వేల పైగా గ్రామ పంచాయితీలు సేవలకు సిద్ధం అయ్యాయి. 2,73,693 కిలో మీటర్ల మేర ఆప్టిక ఫైబర్ పైపు లైను నిర్మాణం జరిగింది.

ప్రస్తుతం ఆప్టికల్ ఫైబర్ కేబుల్ నెట్‌వర్క్ అన్ని రాష్ట్రాల రాజధానులు, జిల్లా కేంద్రాలు, బ్లాక్ స్థాయి వరకు అందుబాటులో ఉంది. దీన్ని గ్రామ పంచాయితీల స్థాయిలో అనుసంధానించ టానికి ప్రస్తుతం ఉన్న BSNL, Railtel, పవర్ గ్రిడ్ ఫైబర్‌ను ఉపయోగించు కుంటూ, దాన్ని మరింత పొడిగించే పనులు చేపట్టారు. ఈ జాతీయ ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ (NOFN)తో గ్రామ పంచాయితీలన్నిటికీ అవసరం అయినంత మేర బ్యాండ్ విడ్త్ సేవలు అందుబాటులోకి వస్తాయి. పంచాయితీలు, బ్లాకులు, జిల్లాలతో అనుసంధానం కావటంలో ప్రస్తుతం ఉన్న అంతరాలు దీనితో అంతరించి పోతాయి. డిజిటల్ సేవలందించే అందరకీ సమంగా NOFN ను అందుబాటులో ఉంచు తారు. దాంతో గ్రామీణ ప్రాంతాల్లో కూడా టెలికాం సేవలందించే సంస్థలు, కేబుల్ టీవీ ఆపరేటర్లు, సమాచార సంస్థలు పనిచేయగలవు. దాంతో e-హెల్త్, e-విద్య, e-పాలన వంటి అప్లికేషన్ సేవలను కూడా గ్రామీణ ప్రాంతాలలో అందించటం సులభసాధ్యం అవుతుంది. Universal Service Obligation Fund(USOF) కింద ఈ ప్రాజెక్టుకు రూ. 20,000 కోట్లు కేటాయించారు.

**IOT తో స్మార్ట్ ఫార్మింగ్:**

వ్యవసాయ రంగంలో రైతులకు మెరుగైన ఫలితాలు అందించేందుకు మార్కెట్లో ఎన్నో సాధనాలు, సంకేతిక పరిజ్ఞానాలు అందుబాటులో ఉన్నాయి. అయితే చాల మంది రైతులకు మార్కెట్ లో అందుబాటులో ఉన్న అవకాశాల గురించి తెలియటం లేదు. భవిష్యత్ వ్యవసాయ రంగంలో బిగ్ డేటా, స్మార్ట్ ఫార్మింగ్, IOT కీలక పాత్ర పోషించనున్నాయి. ముఖ్యంగా తెగుళ్ళ నివారణ, క్రిమి నిర్మూలన లాంటి అంశాలలో సాంకేతిక పరిజ్ఞానం కీలకం కానుంది. భవిషత్‌లో డిమాండు ఎక్కువ ఉండే పంట విస్తరణలో ఉన్న తేడాలను కనిపెట్టే ఏరియల్ సర్వే నిర్వహణ, రోబోటిక్ ఆర్మ్స్, గ్రామం ప్రాతిపదికగా వాతావరణ హెచ్చరికల వంటి రంగాలలో పరిశోధనాభివృద్ధి పై దృష్టి సారిస్తున్నారు.

**హెల్త్ కేర్ ఇకో సిస్టం:**

ఆరోగ్య పరిరక్షణ వాతావరణాన్ని భవిష్యత్‌లో తీర్చిదిద్దేది బిగ్ డేటా, IOT, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ లాంటి అంశాలే. హెల్త్ కేర్ రంగం హెల్త్ టెక్ రంగంగా మార నుంది. ప్రస్తుతం 100 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత ఆరోగ్య సంరక్షణ రంగం సమూలంగా మారిపోనుంది. అందుకు తగిన విధంగా సాంకేతిక మౌలిక సదుపాయాలను కల్పించేం దుకు ప్రభుత్వ కృషి కొనసాగుతోంది. స్టార్ట్-అప్‌ల ఆవిష్కారాలు, సృజనాత్మక పరిష్కారాలు తక్కువ ఖర్చుతో, రోగులకు మరింత సౌకర్యంగా ఉండే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఆచరణాత్మకంగా ఉండే సృజనాత్మక పరిష్కారాలకు ప్రోత్సాహంతో పాటూ, ఇతర హెల్త్ కేర్ భాగస్వాములతో కలసి పని చేసేందుకు అవకాశాలు దీని ద్వారా లభిస్తాయి.

**పరిశ్రమ 4.0:**

తర్వాతి తరం పారిశ్రామిక విప్లవం కోసం co-creation కార్యక్రమం. మానవ ప్రమేయం లేకుండా ఒక ఉత్పాదక కేంద్రాన్ని ఊహించండి. రోబోటిక్ ఆర్మ్స్‌తో యాంత్రిక, డిజిటల్ మిషన్లను కలుపుతూ, వాటికి అవే నిర్ధారణ చేసుకుంటూ, ముందస్తు మెయింటనెన్స్ కోసం అవసరం అయిన స్పెషలిస్టులను అవే పిలుచుకోవటం. అదే 4 వ తరం పారిశ్రామిక విప్లవం. అదే సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ సహ ఉత్పాదన కార్యక్రమం భవిష్యత్‌లోకి దూసుకుపోవటం.

**Industry 4.0 మోడల్**

స్టార్ట్ అప్ అయినా, ఫ్రీలాన్సర్ అయినా తర్వాతి తరం పారిశ్రామిక విప్లవానికి దోహదం చేసే సెన్సర్, గేట్‌వే, అనలిటిక్స్ లాంటి సాంకేతిక అంశం... ఏదైనా అభివృద్ధి చేస్తే, లేదా ఒక పూర్తి పనిని చేయగల వ్యవస్థను రూపొందిస్తే లేదా ఒక పరిశ్రమ నిర్వహణా సామర్థ్యం పెంచే అంశాన్ని రూపొందించగలిగే వారికి co-creation కార్యక్రమం సరైన వేదిక అవుతుంది. దీని కింద పరిశ్రమలు, వినియోగ దార్లు, సాంకేతిక సృజనశీలురు, సిస్టం ఇంటిగ్రేటర్లు, వ్యాపార భాగస్వాములను ఒక్క చోటికి తెచ్చి, వాస్తవంగా క్షేత్ర స్థాయి సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలను కనుగొని, అభివృద్ధి చేసి వాటిని పరీక్షించాల్సి ఉంటుంది. అందుకు తగిన వాతావరణం, వేదికను ప్రభుత్వం దీని ద్వారా ఏర్పాటు చేస్తోంది.

**కామన్ సర్వీస్ సెంటర్స్ (CSC 2.0):**

డిజిటల్ ఇండియా కార్యక్రమం కింద గ్రామ పంచాయితీ స్థాయిలో 2.5 లక్షల కామన్ సర్వీస్ సెంటర్ల (CSC)ను ఏర్పాటు చేయటం ద్వారా స్వయం నిర్భర నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసి, వివిధ పౌర సేవలను అందించటం CSC 2.0 ఉద్దేశ్యం. దేశ వ్యాప్తంగా ఒకే వేదిక ద్వారా e-సేవలను అందించే విధంగా,

లావాదేవీల ఆధారితంగా, సేవల డెలివరీ ఆధారిత నమూనాగా దీన్ని రూపొందించారు. వివిధ శాఖలు, విభాగాల ద్వారా ప్రభుత్వం నుంచి పౌరులకు అందాల్సిన – G2C సేవలను అందించటం CSC మౌలిక ఉద్దేశ్యాలలో ఒకటి. మారుమూల, గ్రామీణ ప్రాంతాలలో సేవలు డిజిటల్ సేవా పోర్టల్ ద్వారా CSC నెట్‌వర్క్ ద్వారా ఏకీకృతం అయ్యాయి. విద్యుత్, మంచి నీరు, మొబైల్, బ్రాడ్ బ్యాండ్ DTH, గ్యాస్, వంటి చార్జీల చెల్లింపులకు భారత్ BillPay వ్యవస్థ ఒకే సురక్షితమైన వేదికగా అందుబాటు లోకి వచ్చింది. RBI దిశా నిర్దేశం మేరకు National Payments Corporation of India (NPCI) దీన్ని నిర్వహిస్తోంది. మరిన్ని వివరాలను https://csc.gov.in వెబ్ సైటు చూడవచ్చు. CSC ద్వారా అపరిమితంగా విస్తరించిన సేవల్లో కొన్నింటిని ఇక్కడ ప్రస్తావిస్తున్నాం.

జాతీయ రహదారులపై ఎలక్ట్రానిక్ పద్ధతిలో టోల్ వసూలుకు ఏర్పాటు చేసిన వ్యవస్థ FASTag. సరళమైన, రీ–లోడబుల్ ట్యాగ్. దీని వల్ల దానంతటదే టోల్ చార్జీలు వసూలయి, టోల్ ప్లాజా వద్ద వాహనాలు ఆగకుండా వెళ్ళిపోయే అవకాశం ఏర్పడుతుంది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 425 టోల్‌ప్లాజాల్లో ఇది అందుబాటులో ఉంది.

**సైబర్ స్వచ్ఛత కేంద్ర:**

డిజిటల్ ఇండియా కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం మాల్‌వేర్ విశ్లేషణ, బాట్ నెట్ క్లీనింగ్ కేంద్రంగా దీన్ని ఏర్పాటుచేసింది. దేశంలో బాట్ నెట్ వైరస్ లను గుర్తించి, దాన్ని శుభ్రం చేసి, మరిన్ని వైరస్‌ల నుంచి సిస్టంలను కాపాడటం దీని పని. జాతీయ సైబర్ సెక్యూరిటీ విధానం కింద ఈ కేంద్ర ఏర్పాటయింది. యాంటీ వైరస్ కంపెనీలు, ఇంటర్ నెట్ సర్వీసు ప్రొవైడర్లతో కలసి పని చేస్తుంది. http://www.cyberswachhtakendra.gov.in పై మరిన్ని వివరాలు పొందవచ్చు.

**డిజి లాకర్:**

డిజిటల్ సాధికార సమాజంగా, నాలెడ్జ్ ఎకానమీగా దేశాన్ని మార్చుచేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ముఖ్యమైన కార్యక్రమం డిజి లాకర్. వ్యక్తులకు పబ్లిక్ క్లౌడ్‌లో డిజిటల్‌గా వ్యక్తిగత ప్రదేశాన్ని పంచటం. అందులో వారి వ్యక్తిగత సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు, ఈ క్లౌడ్‌లో దాచుకునే వీలుంది. కాగిత రహిత పాలనకు వెసలుబాటు కల్పించటం దీని ఉద్దేశ్యం. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి దాదాపు 1.25 కోట్ల మంది డిజి లాకర్‌తో నమోదు అయ్యారు. 242.67 కోట్ల పైగా సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. డిజిటల్ పద్ధతిలో సర్టిఫికెట్ల జారీ, వెరిఫికేషన్ చేసే ప్రక్రియ అమలు చేయటం డిజి లాకర్ ఉద్దేశ్యం. ఆధార్ ప్రాతిపదికగా ఈ డిజి లాకర్‌లో నమోదు చేసుకోవచ్చు. వివరాలకు https://digilocker.gov.in చూడవచ్చు.

**డిజి సేవక్– వాలంటీర్ నిర్వహణా వ్యవస్థ (VMS):**

డిజిటల్ ఇండియా కార్యక్రమానికి సంబంధించి పౌరులు స్వచ్ఛందంగా ఆన్‌లైన్ ద్వారా సేవలు అందించే కార్యక్రమం డిజి సేవక్. వివిధ ప్రభుత్వ శాఖలు, విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, వాటితో కలసి పని చేస్తున్న సంస్థలూ ఈ వేదికను ఉపయోగించుకోవచ్చు. స్వచ్ఛందంగా చేయగలిగే పనులను గుర్తిస్తారు. పౌరులు తమ నైపుణ్యం బట్టి, సామర్థ్యం బట్టి తాము స్వచ్ఛందంగా చేయగలిగే పనులను ఎంచుకోవచ్చు. స్వచ్ఛందంగా నమోదుచేసుకున్న దగ్గర నుంచి, వారెంచుకుని, పూర్తి చేసే పనులకు గుర్తింపు, రివార్డ్లు ఉంటాయి. మరిన్ని వివరాలను http://digisevak.gov.in పై చూడవచ్చు.

**ఎలక్ట్రానిక్ డెవలప్మెంట్ ఫండ్ (EDF):**

డిజిటల్ ఇండియా కార్యక్రమం కింద 2020 నాటికి ఎలక్ట్రానిక్ సిస్టం డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్ (ESDM) రంగంలో దిగుమతులను పూర్తిగా నికరంగా సున్నాకు తెచ్చే లక్ష్యంతో ప్రభుత్వం EDF ను ఏర్పాటు చేసింది. దేశీయ ESDM రంగాన్ని ఎగుమతుల హబ్ గా తీర్చిదిద్దేందుకు 'నిధులకు నిధిగా' దీన్ని ఏర్పాటుచేశారు. ఎలక్ట్రానిక్స్, నానో ఎలక్ట్రానిక్స్, IT రంగాల్లో నూతన పరిజ్ఞానాలు అభివృద్ధి చేసే కంపెనీలకు రిస్క్ క్యాపిటల్‌ను అందిస్తుంది. మరిన్ని వివరాలు http://www.edfindia-canbankventure.com పై అందుబాటులో ఉన్నాయి.

**డిజిటల్ సేవలు:**

పౌర సేవలను ప్రజలకు మరింత దగ్గరకు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం పలు డిజిటల్ సేవలూ అందుబాటులోకి తెచ్చింది. ఈ సేవలను సులభంగా వినియోగించుకునేందుకు పలు చర్యలూ చేపట్టింది. స్మార్ట్ ఫోన్ల వినియోగం గణనీయంగా పెరిగిన ప్రస్తుత తరుణంలో అందుకు వీలుగా, వివిధ అభివృద్ధి పథకాలకు సంబంధించిన యాప్‌లను, పోర్టల్స్‌ను రూపొందించింది. వాటిలో కీలకమైనవి:

**అగ్రి మార్కెట్ యాప్:**

2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో పనిచేస్తున్న ప్రభుత్వం వ్యవసాయ మార్కెటింగ్ వివరాలను అగ్రి మార్కెట్ యాప్ రూపంలో వారికి అందుబాటు లోకి తీసుకువచ్చింది. రైతులు 50 కిలోమీటర్ల పరిధిలో పంట ఉత్పత్తుల ధరలను ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఇంగ్లీషు, హిందీ భాషలలో అగ్రి మార్కెట్ యాప్ అందుబాటులో వుంది. అలాగే పంటల బీమా పథకం కింద ప్రీమియంను మదింపు చేసేందుకు క్రాప్ ఇన్సూరెన్స్ మొబైల్ యాప్ ను కూడా ప్రవేశ పెట్టారు. వాతావరణం, ఎరువులు, విత్తనాలు, ధరలు, డీలర్లు, పంట రక్షణ లాంటి పలు అంశాలపై సమాచారం తెలుసుకోటానికి "కిసాన్ సువిధ" పేరిట మరొక యాప్ కూడా అందుబాటులో వుంది.

**భీమ్ యాప్:**

ఆన్‌లైన్ చెల్లింపులను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన భారత్ ఇంటర్ పేస్ ఫర్ మనీ– భీమ్ యాప్ విశేషంగా ప్రాచుర్యంలోకి

వచ్చింది. భీమ్ యాప్ ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు మరింత పెరిగాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవల సింగపూర్‌లో పర్యటించిన సమయంలో భీమ్ యాప్‌ను అక్కడి ప్రవాస భారతీయుల కోసం కూడా ఆవిష్కరించారు.

### e-సైన్:

సేవలు అందించే వ్యవస్థను మరింత వేగవంతం చేయటానికి సర్వీసు డెలివరీ వ్యవస్థతో ఎలక్ట్రానిక్ సంతకాన్ని ఆధార్ ప్రాతిపదికగా ఈ కార్యక్రమం అనుసంధాని స్తుంది. పౌర సేవలు వేగంగా అందించటంలో ఈ e-సంతకం కీలక పాత్ర పోషిస్తోంది. http://cca.gov.in పై మరిన్ని వివరాలు చూడవచ్చు.

### ప్రభుత్వ e మార్కెట్ ప్లేస్ (GeM):

వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలు, PSUలు వినియోగించే సాధారణ వస్తు సేవల సమీకరణకు సంబంధించి, సింగిల్ విండో పరిష్కారం ఈ ప్రభుత్వ e-మార్కెట్ ప్లేస్. వస్తు సేవల సేకరణలో పారదర్శకత, వేగం, సామర్థ్యాన్ని పెంచేందుకు GeM ను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. నేరుగా కొనుగోలు చేసేందుకు, e-బిడ్డింగ్‌కు రివర్స్ e-వేలానికీ కూడా ఇందులో వెసలుబాటు ఉంది. భాగస్వాము లందరికీ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పిస్తుంది. ఈ ఏడాది జూన్ నాటికి GeMతో 23,787 కొనుగోలు సంస్థలు నమోదు కాగా, 1,16,352 మంది అమ్మకందారులు, సేవల అందించే సంస్థలు నమోదయ్యాయి. దాదాపు 3.10 లక్షల ఉత్పత్తులు నమోదయ్యాయి. వివరాలు https://gem.gov.in వెబ్‌సైట్‌పై చూడవచ్చు.

### e-బస్తా :

డిజిటల్ ఇండియా కార్యక్రమ కింద స్కూలు పుస్తకాలను డిజిటల్ పద్ధతిలో e-బుక్స్‌గా అందుబాటులోకి తెచ్చే ఫ్రేమ్‌వర్క్ ను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. చదవటానికి అలాగే.. ట్యాబ్స్, ల్యాప్‌టాప్‌లలో చూడటానికి ఈ ప్రక్రియ వీలుగా ఉంటుంది. వివిధ ఉచిత, కమర్షియల్ ప్రచురణ కర్తలు, స్కూళ్ళను ఒకే వేదికపైకి తేవటమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యం. మరిన్ని వివరాలను https://www.ebasta.in వెబ్‌సైట్‌పై చూడవచ్చు.

వివిధ వర్గాల ప్రజలకు సత్వరమే సమాచారం అందించేందుకు, ప్రభుత్వ సిబ్బంది వారి విధులను మరింత సమర్థంగా నిర్వహించి ఉత్తమ ఫలితాలను సాధించేందుకు ప్రభుత్వం పలు రకాల పోర్టల్స్, వెబ్‌సైట్‌లను కూడా అందుబాటులోకి తీసుకువచ్చింది. అందులో కొన్ని ముఖ్యమైనవి: పోలీసు శాఖలో e-పాలన విధానాల మేరకు నేరాల సత్వర విచారణ, నేరస్తుల త్వరిత గుర్తింపు కోసం క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ మరియు సిస్టమ్స్ (CCTNS), గ్రంథాలయాల్లో కార్యకలాపాలను డిజిటలీకరించేందుకు, పాఠకులకు, ఆన్‌లైన్ సేవలు అందించేందుకు నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ ఆటోమేషన్ – NIC e-గ్రంథాలయం పేరిట సమీకృత లైబ్రరీ నిర్వహణ సాఫ్ట్‌వేర్ అందు బాటులో ఉన్నాయి. e-నామ్ పేరిట దేశంలోని ప్రాథమిక వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలను అనుసంధానం చేసి పంటలకు మెరుగయిన గిట్టుబాటు ధరలు లభించేలా కృషి జరుగు తోంది. ఈ-నామ్ ద్వారా వ్యవసాయ మార్కెట్ కు వచ్చే పంటలు, ధరలు, అమ్మకం, కొనుగోళ్ళ వివరాలను రైతులు తెలుసుకోవచ్చు. విద్యావనరులను అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చి డిజిటల్ అంతరాన్ని తొలగించడమే లక్ష్యంతో ఈ-పాఠశాల పోర్టల్‌ను NCERT రూపొందించింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు, విద్యావేత్తలకు మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ల ద్వారా ఆన్‌లైన్ పాఠ్యపుస్తకాలు, మ్యాగజైన్లు, ఆడియో, వీడియోలను ఈ-పోర్టల్ ద్వారా చూడవచ్చు. ఇంకా భవిష్యనిధి ఖాతా దారులకోసం ఇపిఎఫ్ఓ వెబ్ పోర్టల్ మరియు మొబైల్ యాప్, అదేవిధంగా దేశంలోని బ్లడ్ బ్యాంకుల వివరాలు ఒకే నెట్‌వర్క్ కిందకి తీసుసుకవచ్చేందుకు రక్త కోశ్ పోర్టల్‌ను రూపొందించారు. అంకుర పరిశ్రమలను ప్రోత్సహించేందుకు స్టార్టప్ ఇండియా పోర్టల్ అందుబాటులో ఉంది. డిజిటల్ ఇండియా కార్యక్రమం క్రింద అన్ని ప్రభుత్వ సేవలను ఒకచోట అందించేందుకు ఉమంగ్ పోర్టల్ ను రూపొందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, ఇంకా కొన్ని ప్రైవేటు సంస్థలు అందిస్తున్న 1200 రకాల సేవలను ఉమంగ్ పోర్టల్ లో అందుబాటులో ఉన్నాయి.

### డిజిటల్ సాక్షరత అభియాన్ (DISHA):

దేశ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో ఉన్న అంగన్ వాడీ, ఆశా కార్యకర్తలు, అధీకృత రేషన్ డీలర్లు వంటి 52.5 లక్షల మందికి జాతీయ డిజిటల్ అక్షరాస్యత మిషన్ (NDLM) కింద డిజిటల్ కార్యకలాపాల పట్ల అవగాహన కల్పించటం ఈ కార్యక్రమం ఉద్దేశ్యం. పౌరులకు డిజిటల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అవగాహన కల్పించటం ద్వారా అభివృద్ధి, ప్రజాస్వామ్య ప్రక్రియల్లో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వ ఈచర్య చేపట్టింది. 2019 మార్చి నాటికి 40 శాతం కుటుంబాల్లో కనీసం ఒక్కరిని డిజిటల్ అక్షరాస్యులను చేయడం ద్వారా డిజిటల్ వ్యత్యాసాన్ని తగ్గించాలన్నది, ముఖ్యంగా అణగారిన, వెనుకబడిన వర్గాల వారిని ముందుకు తీసుకు రావాలన్నది ఈ పథకం ఉద్దేశ్యం.

### ప్రధాన మంత్రి కౌశల్ వికాశ్ యోజన (PMKVY):

దేశంలో యువతకి మెరుగైన జీవనోపాధి కల్పించేందుకు అవసరమైన నైపుణ్యాల అభివృద్ధి కోసం ప్రభుత్వం Pradhan Mantri Kaushal Vikas Yojana (PMKVY) రూపొందించింది. నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యక్రమం అయిన ఈ పథకం ద్వారా నైపుణ్యాల శిక్షణ ఇచ్చి, పరిశ్రమల్లో ఉద్యోగాలకు వీలు కల్పించే ధ్రువీకరణ ఇస్తారు.

డిజిటైజేషన్ నిరంతరాయంగా కొనసాగే ప్రక్రియ. ప్రజల అవసరాలకు తగినట్లు సాంకేతిక పరిజ్ఞానాలు ఆధునికత సంతరించుకుంటూ ఉంటాయి. ప్రపంచం కుగ్రామం అయిపోయి, దూరాలు తగ్గినకొద్దీ, వర్చువల్ ప్రపంచం చేరువ అవుతోంది. ■

# మనసులోని మాట




**ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" (మనసులోని మాట) కార్యక్రమం ద్వారా జూన్ 24, 2018 న ఆకాశవాణిలో దేశ ప్రజలనుద్దేశించి చేసిన ప్రసంగం సంక్షిప్తంగా!**

నమస్కారం! నా ప్రియమైన దేశ ప్రజలారా, ఇవాళ మరోసారి 'మన్ కీ బాత్' కార్యక్రమం ద్వారా మీ అందరితో కబుర్లు చెప్పే అదృష్టం లభించింది. ఈ జూన్ 21వ తేదీన నాలుగవ 'అంతర్జాతీయ యోగా దినోత్సవం' నాడు ఒక చక్కని దృశ్యాన్ని తిలకించాను. యావత్ ప్రపంచం కలిసికట్టుగా కనపడింది. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఎంతో ఆనంద ఉత్సాహాలతో యోగాభ్యాసం చేశారు. బ్రెజిల్ లోను, యూరోపియన్ పార్లమెంట్‌లోనూ, న్యూయార్క్‌లో ఉన్న ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలోనూ, జపాన్ నౌకా దళానికి చెందిన యుద్ధ నౌకలోనూ, అన్ని చోట్లా కూడా ప్రజలు యోగా చేస్తూ కనిపించారు. సౌదీ అరేబియాలో మొదటిసారిగా యోగాకు చెందిన చారిత్రాత్మక కార్యక్రమం జరిగింది. చాలారకాల యోగాసనాలను మహిళలే ప్రదర్శించి చూపెట్టారని నాకు చెప్పారు. లడాక్‌లోని ఎత్తైన మంచు శిఖరాలల్లో కూడా భారత, చైనా సైనికులు కలిసికట్టుగా యోగాభ్యాసం చేసారు. యోగా అన్ని సరిహద్దులనూ చెరిపి, అందరినీ జత పరుస్తుంది. వందల కొద్దీ దేశాలలో వేల కొద్దీ ఉత్సాహవంతులైన ప్రజలు జాతి, మత, ప్రాంత, లింగ భేదాలన్నింటినీ మరచి ఈ సందర్భాన్ని ఒక పెద్ద ఉత్సవంగా మార్చేసారు. యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఇంత ఉత్సాహ వంతంగా జరిపుకుంటుంటే, మరి మన దేశ ప్రజలు దీనిని రెట్టింపు ఉత్సాహంతో ఎందుకు జరుపుకోరు?

మన దేశ భద్రతా దళ సైనికులు, నీటిల, భూమిపై, ఆకాశంలో మూడు చోట్లా యోగాభ్యాసం చేయడం 125కోట్ల ప్రజలు తిలకించారు. కొందరు వీర జవానులు జలాంతర్గామి లో యోగా చేస్తే, కొందరు సియాచీన్ లోని మంచు కొండల్లో యోగా సాధన చేసారు. వైమానిక దళానికి చెందిన మన వీరులు ఆకాశంలో భూమికి పదిహేను వేల అడుగుల ఎత్తులో నుండి యోగాసనాలు వేసి అందరినీ సంభ్రమానికి గురిచేసారు. విమానంలో కూర్చుని కాకుండా గాలిలో తేలుతూ యోగాసనాలు వెయ్యడం చూసి తీరాల్సిన దృశ్యం. పాఠశాలలు, కళాశాలలు,

ఆఫీసులు, పార్కులు, ఎత్తైన భవనాలు, క్రీడా మైదానాలు అన్ని చోట్లా యోగాభ్యాసం జరిగింది.

అహ్మదాబాద్‌లోని ఒక దృశ్యం మాత్రం మనసుకు హత్తుకుంది. అక్కడ దాదాపు 750 దివ్యాంగ సోదర సోదరీమణులు ఒక చోట కలిసి యోగాభ్యాసం చేసి ప్రపంచ రికార్డు సృష్టించారు. కుల, మత మరియు భూగోళ పరిధిని దాటి యోగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలను ఏకం చేసే పని చేసింది. మన ఋషులు, మునులు, సాధువులు ఎప్పుడూ చెప్తూ వచ్చిన వసుదైక కుటుంబకం అనే భావాన్ని మనం శతాబ్దాలుగా నమ్ముతూ వస్తున్నాం. యోగా ఆ భావాన్ని సరైన విధంగా నిరూపించి చూపెట్టింది.

నా ప్రియమైన దేశప్రజలారా, mygov, నరేంద్ర మోదీ యాప్‌లలో ఈసారి మన్ కీ బాత్‌లో జులై ఒకటవ తేదీన జరగబోతున్న డాక్టర్స్ డే గురించి చెప్పమని చాలా మంది నాకు రాశారు. మంచి సంగతి. ఇబ్బంది ఎదురైనప్పుడే మనం వైద్యుడి దగ్గరకు వెళ్తాము. కానీ ఆ రోజున మన దేశంలోని వైద్యుల ప్రగతిని ఉత్సవంగా జరిపుకోబోతున్నాం. సమాజానికి వారు అందిస్తున్న సేవలకు గాను వారికి అనేకానేక ధన్యవాదాలు. తల్లి జన్మను అందిస్తే, వైద్యుడు మనకు పునర్జన్మను అందిస్తాడు. కేవలం రోగాలను తగ్గించడంతోనే వైద్యుని పాత్ర ముగిసిపోదు. కుటుంబానికి స్నేహితుడి లాంటి వాడు వైద్యుడు. "They

ఆకాశవాణి, హైదరాబాద్ కేంద్రం సౌజన్యంతో.....

not only cure but also heal" అన్నమాటలు మన జీవన విధానంలో మార్గదర్శకాలు. ఇవాళ వైద్యుల వద్ద వైద్య విద్వత్తుతో పాటుగా సాధారణ జీవన విధాన పద్ధతులు మన ఆరోగ్యంపై ఎటువంటి ప్రభావాన్ని చూపగలవు అన్న విషయాలపై లోతైన అవగాహన, అనుభవం ఉంటున్నాయి. భారతీయ వైద్యులు తమ సామర్థ్యం, ఇంకా నైపుణ్యాలతో యావత్ ప్రపంచంలో తమ గుర్తింపుని చాటుకున్నారు. వైద్య వృత్తిలో ఉండే పట్టుదల, పరిశ్రమలతో పాటుగా క్లిష్టమైన వైద్య సమస్యలను పరిష్కరించగలరన్న పేరుపొందారు మన భారతీయ వైద్యులు. మన్ కీ బాత్ మాధ్యమం ద్వారా నేను దేశప్రజలందరి తరఫునా మన వైద్య మిత్రులందరికీ వచ్చే జులై 1వ తేదీన జరగబోతున్న "డాక్టర్స్ డే' సందర్భంగా అనేకానేక అభినందనలను తెలుపుతున్నాను.

2019 లో భగవాన్ గురునానక్ గారి 550వ జయంతి ఉత్సవాన్ని మనం జరుపు కోబోతున్నాము. మనందరమూ ఆనందోత్సాహ లతో ఈ ఉత్సవంలో పాల్గొవాలని నేను కోరుకుంటూన్నాను. ఈ జయంతి ఉత్సవాన్ని మనం ప్రేరణాత్మకమైన ఉత్సవంగా మారుద్దాం.

నా ప్రియమైన దేశ ప్రజలారా, భారత దేశ స్వాతంత్రపోరాటం చాలా పెద్దది. చాలా విస్తృతమైనది. లోతైనది. యావత్ మానవత్వాన్ని సిగ్గుతో తలదించుకునేలా చేసిన జలియన్వాలా బాగ్ దుర్ఘటన జరిగి 2019 నాటికి వందేళ్ళు పూర్తవుతుంది. 1919, ఏప్రిల్13 నాటి ఆ చీకటి రోజుని ఎవరు మర్చిపోగలరు? ఈ సంఘటన జరిగి వందేళ్ళు పూర్తవబోతున్నాయి. ఈ సంఘటన అందించిన అమర సందేశాన్ని మాత్రం మనం ఎప్పటికీ గుర్తుంచుకోవాలి. హింసతోనూ, కరత్వం తోనూ ఎప్పుడూ ఏ సమస్యకూ పరిష్కారం లభించదు అనే సందేశాన్ని ఈ సంఘటన అందిస్తుంది. ఎప్పుడూ కూడా శాంతి, అహింస, త్యాగం, బలిదానాలనే విజయం వరిస్తుంది.

నా ప్రియమైన దేశప్రజలారా, నేనెప్పుడూ గమనిస్తాను, మనం మన చుట్టుపక్కల గనుక గమనిస్తే ఎక్కడో అక్కడ ఏదో ఒక మంచి జరుగుతూనే ఉంటుంది. కొద్ది రోజుల క్రితం ఒక సంగతి నా దృష్టికి వచ్చింది. ఇందులో ఒక పక్క ఇంజినీర్లు, ప్రొఫెషనల్స్ ఉన్నారు. రెండో పక్క పొలంలో పనిచేసేవారు, వ్యవసాయంతో ముడిపడి ఉన్న మన రైతు సోదర సోదరీమణులు ఉన్నారు. బెంగుళూరులో కార్పోరేట్ ప్రొఫెషనల్స్, ఐ.టి ఇంజనీర్లు ఒకటయ్యారు. వారంతా కలిసి ఒక సహజ సమృద్ధి ట్రస్ట్‌ని ఏర్పరిచారు. రైతుల ఆదాయం రెట్టింపు అయ్యేలా చెయ్యడానికి ఈ ట్రస్ట్ ని స్థాపించారు. రైతులను కలుపుకుంటూ, ప్రణాళికలను తయారు చేస్తూ, రైతుల ఆదాయాలను రెట్టింపు చేయడానికి ప్రయత్నాలు చేసారు. వ్యవసాయానికి ఉపయోగపడే కొత్త లక్షణాలతో పాటు, కొత్త పంటలను ఎలా పండించాలి అని ఈ ట్రస్ట్ ద్వారా వృత్తి నిపుణులు, ఇంజనీర్లు, సాంకేతికనిపుణుల ద్వారా రైతులకు శిక్షణను అందించడం మొదలుపెట్టారు. ఇదివరకూ ఏ రైతులు తమ పొలంలో ఒకే రకమైన పంటను పండించారో, ఏ రైతులు ఎక్కువ పంటను పండించలేక పోయారో, లాభాలను ఎక్కువగా పొందలేక పోయారో వారు ఇవాళ కూరగాయులు పండిస్తున్నారు. వాటికి సొంతంగా మార్కెటింగ్ కూడా ట్రస్ట్ ద్వారా చేసుకుని మంచి లాభాలను పొందుతున్నారు. ధాన్యాన్ని పండించే రైతులు కూడా ఈ ట్రస్ట్‌తో కలిసారు. పంట పండించడం మొదలుకుని, మార్కెటింగ్ వరకూ మొత్తం పనిలో రైతులే ప్రముఖ పాత్ర వహిస్తున్నారు. దీనివల్ల లాభాలన్నీ రైతులవే. రైతుల భాగస్వామ్యం, రైతుల హక్కు నిశ్చితంగా ఉంచే ప్రయత్నం ఇది. పంటలు బాగా పెరగడానికి, దానికి సరైన నాణ్యమైన విత్తనాల కోసం ప్రత్యేకంగా ఒక సీడ్ బ్యాంక్ కూడా తయారుచెయ్యబడింది. స్త్రీలు ఈ సీడ్ బ్యాంక్ పనులను చూస్తారు.

నా ప్రియమైన దేశప్రజలారా, జి.ఎస్.టి అమలుపరిచి ఒక ఏడాది కావస్తోంది. 'ఒక దేశం – ఒకే పన్ను అనేది దేశ ప్రజల కల. అది ఇవాళ సాకారమైంది.' ఒక దేశం – ఒకే పన్ను దీనికి ఎవరినైనా అభినందించాల్సి వస్తే నేను రాష్ట్రాలనే అభినందిస్తాను. GST అనేది Cooperative federalism కి ఒక గొప్ప ఉదాహరణ. అన్ని రాష్ట్రాలూ కలిసి దేశ హితం కోసం నిర్ణయాన్ని తీసుకున్నాయి కాబట్టే దేశంలో ఇంత పెద్ద టాక్స్ రిఫార్మ్ అమలు పరచడం జరిగింది. GST కి ముందు దేశంలో 17 రకాలైన పన్నులు ఉండేవి. కానీ ఈ వ్యవస్థ ఏర్పాటైన తరువాత ఒకే ఒక పన్ను మొత్తం దేశంలో అమలులోకి వచ్చింది. నిజాయితీకి లభించిన విజయం జి.ఎస్.టి. జి.ఎస్.టి. 'నిర్వహణ బాధ్యతను ఐ.టి రంగం తీసుకుంది. రిటర్న్ నుండి రిఫండ్ వరకూ అంతా ఆన్‌లైన్ లోనే ఇన్ఫర్మేషన్ టేక్నాలజీ ద్వారానే జరుగు తుంది. నా ప్రియమైన దేశప్రజలారా, మరోసారి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ముగిస్తూ, మిమ్మల్ని కలిసి, మీతో మాట్లాడే మరో అవకాశం కోసం రాబోయే మన్ కీ బాత్ కార్యక్రమం కోసం ఎదురుచూస్తుంటాను. మీ అందరికీ అనేకానేక శుభాకాంక్షలు. అనేకానేక ధన్యవాదాలు. ■

## SWACHHTA RANKING OF CITIES

| Cleanest cities | Dirtiest cities |
|---|---|
| Indore (MP) | Bhadreswar (West Bengal) |
| Bhopal (MP) | Bankura (West Bengal) |
| Chandigarh | Simari Bakhtiyarpur (Bihar) |
| NDMC (Delhi) | Champandi (West Bengal) |
| Vijayawada (Andhra) | Bansberia (West Bengal) |
| Tirupati (Andhra) | Chandbali (Odisha) |
| Visakhapatnam (Andhra) | Khardah (West Bengal) |
| Mysuru (Karnataka) | Bidyabati (West Bengal) |
| Navi Mumbai (M'rashtra) | Panihati (West Bengal) |
| Pune (Maharashtra) | Khoda Makanpur (UP) |

Swachh Survekshan 2018

# ప్రధానమంత్రితో మాటా-మంతీ

ప్రధానమంత్రి  ఇటీవల వివిధ ప్రధాన జాతీయ కార్యక్రమాల లబ్దిదారులతో ముచ్చటించారు. ఆయా కార్యక్రమాలు వారి జీవితాలలో ఎలాంటి మార్పును తెచ్చాయో తెలుసుకోవడం ఈ సంభాషణ లక్ష్యం.

## వివిధ ఆరోగ్య కార్యక్రమాల లబ్దిదారులతో సంభాషణ:

- ప్రతి పౌరునికీ సమగ్ర ఆరోగ్య సేవలను అందుబాటులో ఉంచడం తన ప్రభుత్వ లక్ష్యమని ప్రధాని అన్నారు.
- ప్రధానమంత్రి భారతీయ జన ఔషధీ పరియోజన పథకాన్ని ఈ లక్ష్యంతోనే ప్రారంభించారు. పేద, మధ్య తరగతి వర్గాలు చౌకలో మందులు కొనుగోలు చేసే వెసులుబాటు కల్పించారు.
- దేశ వ్యాప్తంగా 3600 జన ఔషధ కేంద్రాలను ప్రారంభించారు. వీటిలో 700 లకు పైగా మందులు చౌకగా లభ్యమవుతాయి.
- గుండె ఆపరేషన్‌కు అవసరమైన స్టెంట్‌ల ధరలను రెండు లక్షల రూపాయలనుండి, 29 వేల రూపాయలకు తగ్గించారు.

ఆరోగ్య కార్యక్రమాల లబ్దిదారులతో ప్రధాని మాటా-మంతీ



- ప్రధాన మంత్రి రాష్ట్రీయ డయాలసిస్ పథకం కింద 500 జిల్లాల నుండి 2.25 లక్షల మంది రోగులకు 22 లక్షల డయాలసిస్ సేవలను అందించారు.
- మిషన్ ఇంద్రధనుష్ పథకం కింద 528 జిల్లాల నుండి 3.15 కోట్లకు పైగా శిశువులకు, 80 లక్షల మంది తల్లులకూ టీకాలు ఇప్పించారు.
- మరింత మంది వైద్యులు, మరిన్ని ఆసుపత్రి బెడ్లను అందుబాటులోకి తేవడానికి వైద్యకళాశాలలో మరో 15 వేల ఎంబిబిఎస్ సీట్లను పెంచారు.
- ఆయుష్మాన్ భారత్ పథకం కింద 100 కోట్ల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల చొప్పున ఆరోగ్య బీమా కల్పించారు.

## సృజనాత్మక అంకుర సంస్థల యజమానులతో సంభాషణ:

- మానవ వనరుల ప్రయోజనాన్ని గరిష్టంగా పొందటానికి ప్రభుత్వం కృతనిశ్చయమైందని ప్రధాని అన్నారు.
- నూతన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మూలధన కొరత ఉండకూడదని కేంద్ర ప్రభుత్వం రూ. 10 వేల కోట్లతో ఒక నిధుల సంకీర్ణాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో నుండి రూ. 1285 కోట్ల విలువైన ప్రతిపాదనలను ఆమోదించారు. రూ. 6980 కోట్ల వెంచర్ నిధులను విడుదల చేశారు.
- అంకుర సంస్థల ఉత్పత్తులకు మార్కెట్ సమస్య లేకుండా Government E-Market Place, GEM ను అనుసంధానం చేశారు.
- అంకుర సంస్థలకు మూడు సంవత్సరాల పన్ను మినహాయింపునిచ్చారు.
- ఆరు కార్మిక చట్టాలను, మూడు పర్యావరణ చట్టాలను సవరించి, యువ పెట్టుబడిదారులకు స్వంత అనుమతుల వెసులుబాటు కల్పించారు.
- నూతన పెట్టుబడిదారులకు అవసరమైన అన్ని అనుమతులు, సమాచారం ఒక చోటనుండే అందచేసేందుకు Start Up India  అనే ఒక ఏక గవాక్షాన్ని ఏర్పాటుచేశారు. ■

Publishing date 1 July 2018
Posting on 2 - 3 July 2018
Yojana (Telugu) July 2018

RNI Regd. No 37729/80
Regd. No. H/SD-512/2018-20

# కొత్త పుస్తకాలు




**పుస్తకాలు లభించు చోటు :** ప్రచురణల విభాగం - విక్రయకేంద్రం

**రూం. నెం. 204, సి.జి.ఒ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ - 80.**

**ఫోన్ 040-27535383, 27544146**

**E-mail: bmsehyd@gmail.com**

Printed & Published by Mrs. Sadhana Rout, Director General and Head on behalf of the Publications Division, Ministry of I & B, Govt. of India.
and Printed at Prakhya Art Printers Pvt. Ltd. 1-8-724/A/31, Vegetable Market Street, Nallakunta, Hyderabad - 500 044. E-mail: print@prakhyaarts.com
and Published at Yojana (Telugu), 205, 2nd Floor, C.G.O. Towers, Kavadiguda, Hyderabad - 500 080. Senior Editor: Vijayakumar Vedagiri, Tel: 040-27546314